


# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




## హ్యాట్సాఫ్... అమ్మా

Heritage Foods Wins
Golden Peacock Award 2025







CELEBRATING THIS PRIDE
ON THE GLOBAL STAGE IN LONDON



చంద్రబాబు గారిని అరాచక ప్రభుత్వం
53 రోజులపాటు అక్రమంగా నిర్బంధించినప్పుడు
"నిజం గెలవాలి" పేరుతో గళమెత్తారు...

47 రోజులపాటు 9 వేల కిలోమీటర్లు
సుడిగాలి పర్యటన చేసి ప్రజల్లో
చైతన్యం నింపారు...

పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు నేనున్నానంటూ
మాకు దిక్సూచిగా నిలిచి
కార్యకర్తల్లో ధైర్యం నింపారు...

ఎన్‌టిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆపన్నులు,
అన్నార్తులను చేరదీసి
తల్లిలా ఆదరిస్తున్నారు...

వ్యాపార రంగంలో సత్తా చాటి ప్రపంచస్థాయి
ప్రతిష్టాత్మక "గోల్డెన్ పీకాక్" అవార్డును
సొంతం చేసుకున్నారు...

... హ్యాట్సాఫ్ అమ్మా...!

**తెలుగుదేశం కుటుంబం**



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు



ఇలాంటి ఘటనలు పునరావృతం కానివ్వం

6

## ఏమాత్రం.. ఉపేక్షించొద్దు!

- కల్తీ మద్యమంటూ కల్తీ ప్రచారంపై సీఎం సీరియస్
- అభూత కల్పనలతో ప్రజలను భయపెడుతున్నారు
- ప్రాణాలు పోతున్నాయంటూ ఫేక్ ప్రచారాలు సాగిస్తున్నారు
- ఆరోపణలను విచారించి.. వాస్తవాలు బయటపెట్టండి
- రాజకీయ కుట్రతో తప్పుడు ప్రచారాలు చేసేవారిపై చర్యలు
- ఉన్నతాధికారులు, మంత్రుల సమావేశంలో ముఖ్యమంత్రి ఆదేశం
- వైసీపీ రాజకీయ కుట్రలను భగ్నం చేయాలని మంత్రులకు సూచన

3



'కల్తీ మద్యం' అంశంపై ఉన్నతాధికారులు, మంత్రులతో ముఖ్యమంత్రి సమీక్ష



మోదీజీ.. దేశసేవలో మరింత తరించండి: చంద్రబాబు

స్ఫూర్తిదాయకమైన విశిష్ట ప్రజాసేవ మీది: లోకేశ్

లోపలి పేజీల్లో..



2

## ఏపీ.. జాక్‌పాట్

- దేశ చరిత్రలో అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడికి క్లియరెన్స్
- రూ.87,520 కోట్లతో విశాఖలో రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్
- రూ.1,14,824 కోట్ల పెట్టుబడులకు 11వ ఎస్ఐపీబీ ఆమోదం
- 26 ప్రాజెక్టుల ద్వారా 67,218 మందికి జాబ్ ఛాన్స్‌లు
- మెగా ప్రాజెక్టుల పర్యవేక్షణకు ప్రత్యేకాధికార్లను నియమించాలని నిర్ణయం
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఐపీబీ సమావేశం
- 11 ఎస్ఐపీబీల ద్వారా రూ.7.07 లక్షల కోట్ల పెట్టుబడులకు క్లియరెన్స్
- రాష్ట్రంలో 6.2 లక్షల ఉద్యోగావకాశాల సృష్టికి అవకాశం

పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. దేశ చరిత్రలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని ఆకర్షించింది. అమెరికా వెలుపల అతిపెద్ద డేటా సెంటర్‌ను గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా లిమిటెడ్ విశాఖలో ఏర్పాటు చేయనుంది. రూ.87,520 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన 11వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఆమోదాన్ని తెలిపింది. విశాఖలోని తర్లువాడ, అడవివరం, అచ్యుతాపురం సమీపంలోని రాంబిల్లివద్ద మూడు క్యాంపస్‌లలో రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్లను ఏర్పాటు చేయనుంది. విశాఖకు రానున్న కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు అనుసంధానంగా ఈ క్యాంపస్‌లు ఏర్పాటు కానున్నాయి. ఈ ప్రాజెక్టుతోపాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టుల ద్వారా రూ.1,14,824 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. తద్వారా 67,218 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.

## మనమే పరిష్కరించుకుందాం



- సమస్యల పరిష్కారానికి సర్కారు ఎప్పుడూ సిద్ధమే
- ఉపాధ్యాయులకు భరోసానిచ్చిన మంత్రి నారా లోకేశ్
- ఏపీలో విద్యావ్యవస్థను నెం.1గా తీర్చిదిద్దాలనేదే లక్ష్యం
- ఇందుకు ప్రతి ఉపాధ్యాయుడి సహకారం అవసరం
- అంతర్ జిల్లా బదిలీల ఉపాధ్యాయులు, భాషా పండితులతో లోకేశ్ భేటీ
- మంత్రి లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపిన ఉపాధ్యాయులు
- విద్యార్థులకు బాగా చదువు చెబితే అదే పెద్ద గిఫ్టన్న మంత్రి

5



3

## ఆర్గురి.. సజీవ దహనం

- కోనసీమ జిల్లాలో భారీ బాణసంచా పేలుడు
- పేలుడుధాటికి ఛిత్రమైన తయారీ కేంద్రం
- పలువురికి గాయాలు, ఆస్పత్రిపాలు
- శిధిలాలకింద కార్మికులు చిక్కుకున్నట్టు అనుమానం
- ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి
- వైద్య, సహాయక చర్యలకు తక్షణ ఆదేశాలు
- బాధితులకు అండగా ఉంటామన్న ప్రభుత్వం
- ప్రగాఢ సానుభూతి ప్రకటించిన డిప్యూటీ సీఎం, మంత్రులు



4

## రాజధాని రైతులూ అభివృద్ధి సాధించాలి

- భూములిచ్చిన ఊళ్లోనే రిటర్నబుల్ ప్లాట్లు
- సీఆర్డీఏ భేటీలో సీఎం చంద్రబాబు ఆదేశాలు
- రూ.212 కోట్లతో అమరావతిలో రాజ్‌భవన్ నిర్మాణానికి ఆమోదం
- 53వ సీఆర్డీఏ సమావేశంలో కీలక నిర్ణయం

## మోదీ రాకకు భారీ ఏర్పాట్లు

- ప్రధాని ఏపీ పర్యటనపై సీఎం చంద్రబాబు సమీక్ష
- శ్రీశైలంలో జ్యోతిర్లింగం, శక్తిపీఠ క్షేత్రాలను దర్శించుకోనున్న ప్రధాని
- కర్నూలు జిల్లా ఓర్వకల్లులో జీఎస్టీ సంస్కరణల ఉత్సవ్ సభకు హాజరు

5



4

టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్ రూపొందించిన మన చంద్రన్న-2 డిజిటల్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు.

# పెట్టుబడుల్లో ఏపీ జాక్‌పాట్

- దేశ చరిత్రలో అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడికి క్లియరెన్స్
- రూ.87,520 కోట్లతో విశాఖలో రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్
- రూ.1,14,824 కోట్ల పెట్టుబడులకు 11వ ఎస్ఐపీబీ ఆమోదం
- 26 ప్రాజెక్టుల ద్వారా 67,218 మందికి ఉద్యోగావకాశాలు
- మెగా ప్రాజెక్టులకు ప్రత్యేకాధికార్లను నియమించాలని నిర్ణయం
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన ప్రాజెక్టులకు ఓకే చెప్పిన ఎస్ఐపీబీ
- 11 ఎస్ఐపీబీల ద్వారా రూ.7.07 లక్షల కోట్ల పెట్టుబడులకు క్లియరెన్స్
- రాష్ట్రంలో 6.2 లక్షల ఉద్యోకావకాశాల సృష్టికి అవకాశం



అమరావతి (చైతన్య రథం): పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. దేశ చరిత్రలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని ఆకర్షించింది. అమెరికా వెలుపల అతిపెద్ద డేటా సెంటర్‌ను గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా లిమిటెడ్ విశాఖలో ఏర్పాటు చేయనుంది. రూ.87,520 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన 11వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఆమోదాన్ని తెలిపింది. విశాఖలోని తర్లువాడ, అడవివరం, అచ్యుతాపురం సమీపంలోని రాంబిల్లివద్ద మూడు క్యాంపస్‌లలో రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్లను ఏర్పాటు చేయనుంది. విశాఖకు రానున్న కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు అనుసంధానంగా ఈ క్యాంపస్‌లు ఏర్పాటు కానున్నాయి. ఈ ప్రాజెక్టుతోపాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టుల ద్వారా రూ.1,14,824 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. తద్వారా 67,218 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. దాదాపు 3 గంటలపాటు సుదీర్ఘంగా సాగిన ఎస్ఐపీబీ సమావేశం.. ఇంధన రంగంతోపాటు ఫుడ్ ప్రాసెసింగ్, ఐటీ, ఏరో స్పేస్, ఆటోమొబైల్ మాన్యుఫాక్చరింగ్ రంగాలు సహా.. పర్యాటకానికి ఊతమిచ్చేలా ఆతిథ్యరంగానికి చెందిన ప్రాజెక్టులకు ఆమోదాన్ని తెలిపింది. రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్ ద్వారా దేశంలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని ఏపీకి సాధించటంపై ఐటీ మంత్రి నారా లోకేష్‌కు ముఖ్యమంత్రి, మంత్రులు అభినందనలు తెలిపారు. క్వాంటం వ్యాలీ తరహాలోనే డేటా సెంటర్లు ఏపీకి టెక్నాలజీ గేమ్ చేంజర్‌గా మారతాయన్నారు. కేవలం 15నెలల కాలంలో పెట్టుబడుల ప్రయత్నాలు సత్ఫలితాలిస్తున్నాయని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. డేటా సెంటర్లతో ఎకో సిస్టం వస్తోందని.. విశాఖ నగరం తదుపరిస్థాయి ఏఐ సిటీగా మారుతుందని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. విద్యుత్ తక్కువ ధరకు అందిస్తే ఐటీ రంగానికి మేలు జరుగుతుందని సీఎం వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకూ జరిగిన 11 ఎస్ఐపీబీల ద్వారా రూ.7.07 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 6.2 లక్షలమందికి నేరుగా ఉద్యోగాలు దక్కనున్నాయి.

### ప్రాంతాలవారీ పారిశ్రామిక ప్రాజెక్టుల అభివృద్ధి

క్వాంటం వ్యాలీ తరహాలోనే రాష్ట్రానికి వస్తున్న డేటా సెంటర్లు టెక్నాలజీ రంగంలో కీలక మలుపుగా ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. విశాఖ పారిశ్రామిక అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఎకనామిక్ కారిడార్ తరహాలోనే రాయలసీమకూ ప్రత్యేక కారిడార్ ఏర్పాటు చేయాల్సి ఉందని ఐటీ మంత్రి నారా లోకేష్ ప్రతిపాదించారు. ఆ మేరకు మూడు ప్రాంతాలనూ పారిశ్రామిక జోన్లుగా విభజించి అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. తూర్పుగోదావరి నుంచి శ్రీకాకుళం వరకూ విశాఖ ఎకనామిక్ రీజియన్‌ను ఏర్పాటు చేస్తున్నామని, అదే తరహాలో అమరావతి కేంద్రంగా ఉమ్మడి పశ్చిమ గోదావరినుంచి ప్రకాశం వరకూ ఒక ఆర్థిక ప్రగతి రీజియన్‌ను, నెల్లూరు, రాయలసీమ జిల్లాలతో మరో ఎకనామిక్ డెవలప్‌మెంట్ రీజియన్లను ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు. ప్రస్తుతం రాయలసీమ ప్రాంతంలో ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్స్, డ్రోన్ సిటీలతోపాటు ఆటోమొబైల్ కారిడార్లు అభివృద్ధి అవుతున్నాయని సీఎం పేర్కొన్నారు. వీటితోపాటు ఉద్యాన పంటలకు కేంద్రంగావున్న రాయలసీమ ఆగ్రో ప్రాసెసింగ్ హబ్‌గా మారుతోందని త్వరలోనే ప్రపంచ ప్రసిద్ధి చెందిన కేంద్రంగా ఈ ప్రాంతం మారుతుందన్నారు.

అమరావతి రాజధాని నగరం క్వాంటం వ్యాలీతో నాలెడ్జి ఎకానమీ కేంద్రంగా మారుతుందని సీఎం పేర్కొన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లును కూడా అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతంగా తయారు చేయాలని.. దీనికోసం ల్యాండ్ బ్యాంక్‌ను సిద్ధం చేసుకుని ప్రాజెక్టులను ఆహ్వానించాలన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు వచ్చినా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. అభివృద్ధిని ఎవరు అడ్డుకున్నా ఉపేక్షించబోమని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. రాష్ట్రంలోని అన్ని పారిశ్రామిక ప్రాజెక్టులను రైల్వేలైన్‌కు కూడా అనుసంధానిస్తే లాజిస్టిక్స్ వ్యయం తగ్గి ఆయా ప్రాజెక్టులకు ప్రయోజనం కలుగుతుందని సీఎం అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో విలువ జోడింపుపైనా దృష్టి పెట్టలన్నారు. అలాగే ఆతిథ్య రంగానికి చెందిన ప్రాజెక్టులపైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టి పర్యాటకులకు నాణ్యమైన వసతి లభించేలా చూడాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న వివిధ కేటగిరీల హోటళ్లకు అనుబంధంగా ఎకో సిస్టం కూడా వచ్చేలా చూడాలని సూచించారు. తిరుపతిలో ఉన్న కలినరీ ఇనిస్టిట్యూట్‌ను డీమ్డ్ యూనివర్సిటీగా హోదా పెంచి వివిధ సంస్థలను అనుసంధానించాలని పేర్కొన్నారు. కూచిపూడి, థింసాలాంటి సంప్రదాయాలతో పాటు వివిధ ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేసే అంశంపైనా దృష్టి పెట్టాలని చర్చించారు. ఇటీవల విజయం సాధించిన విజయవాడ ఉత్సవ్ తరహాలోనే విశాఖ, రాజమహేంద్రవరంలాంటి చోట్ల ఉత్సవ్‌లు నిర్వహించాలని సూచించారు.

### మెగా పారిశ్రామిక ప్రాజెక్టుల పర్యవేక్షణకు ప్రత్యేకాధికార్లు

అమెరికాలో వర్జీనియా నగరం డేటా వ్యాలీగా ఉందని.. ప్రస్తుతం విశాఖ కూడా రైడెన్, గూగుల్ ప్రాజెక్టులతో డేటా వ్యాలీగా రూపొందుతుందని ఐటీ మంత్రి నారా లోకేశ్ ముఖ్యమంత్రికి వివరించారు. టీసీఎస్ సంస్థ కూడా ఇక్కడ త్వరలోనే క్యాంపస్‌ను ప్రారంభించనుందని.. ఒక్క విశాఖ నగరంలోనే 5 లక్షలమందికి ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం.. ఐటీ సంస్థలు, అందులో పనిచేసే ఉద్యోగులకు హౌసింగ్‌తోపాటు రహదారులు, ఇతర మౌలిక వసతులు ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మాస్టర్ ప్లాన్‌తో స్థానిక టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అనకాపల్లి నుంచి విజయనగరం వరకూ ఉన్న ప్రాంతాన్ని అభివృద్ధి చేసే అవకాశముందని ముఖ్యమంత్రి వివరించారు. వీటితో పాటు 5 లక్షలమంది వర్క్ ఫ్రమ్ హోమ్ ద్వారా ఉద్యోగాలు చేసుకునే అవకాశం కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. రామాయపట్నం సమీపంలో వస్తున్న భారత్ పెట్రోలియం కార్పొరేషన్ రిఫైనరీతోపాటు ఆర్సెలార్ మిట్టల్, రైడెన్ డేటా సెంటర్‌లాంటి భారీ ప్రాజెక్టులు ప్రారంభమయ్యే వరకూ పర్యవేక్షణ చేసేలా ప్రత్యేకాధికార్లను నియమించాలన్నారు. పారిశ్రామిక ప్రాజెక్టులకు లాజిస్టిక్స్‌ను ఇంటిగ్రేట్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని పారిశ్రామిక ప్రాంతాలు, నీటి సరఫరా, వినియోగంలాంటి అంశాలపై మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. 2028నాటికల్లా జిందాల్ స్టీల్ ప్లాంట్ పూర్తి చేసేలా చూడాలని సీఎం పరిశ్రమల శాఖను ఆదేశించారు. ఎస్ఐపీబీ సమావేశానికి మంత్రులు నారా లోకేశ్, కె.అచ్చెన్నాయుడు, పి.నారాయణ, టీజీ భరత్, కందుల దుర్గేష్, బీసీ జనార్దన్ రెడ్డి, వాసంశెట్టి సుభాష్, అనగాని సత్యప్రసాద్‌తో పాటు సీఎస్ కె విజయానంద్, పరిశ్రమలు, ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్, పర్యాటకం, ఆర్థికశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

### 11వ ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం పొందిన ప్రాజెక్టుల వివరాలు

1. యాక్మే ఊర్జా వన్ లిమిటెడ్: అనంతపురం జిల్లాలో సౌర విద్యుత్ ప్రాజెక్టులో రూ.2 వేల కోట్ల పెట్టుబడి. 1380మందికి ఉద్యోగాలు.
2. టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్: అనంతపురం జిల్లాలో 400 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టు రూ.2 వేల కోట్ల పెట్టుబడి. 1,380మందికి ఉద్యోగాలు
3. చింతా గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్: విజయనగరం జిల్లాలో పంప్డ్ ఎనర్జీ ప్రాజెక్టు రూ.12,905 కోట్ల పెట్టుబడి. 3వేల మందికి ఉద్యోగాలు.
4. ఆంఫ్లిన్ ఎనర్జీ ట్రాన్సిషన్: కర్నూలు, నంద్యాల జిల్లాల్లో సౌరవిద్యుత్ ప్రాజెక్టు రూ.15.10 కోట్లు పెట్టుబడి.
5. రిలయన్స్ కన్స్యూమర్ ప్రోడక్ట్స్: కర్నూలు జిల్లా ఓర్వకల్లులో ఎఫ్ఎంసీజీలో రూ.758 కోట్ల పెట్టుబడులు. 500మందికి ఉద్యోగాలు
6. గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్: రూ.208 కోట్ల పెట్టుబడులు. 66మందికి ఉద్యోగాలు
7. ఎస్వీఎఫ్ సోయా ప్రైవేట్ లిమిటెడ్: రూ.201 కోట్ల పెట్టుబడి. 436మందికి ఉద్యోగాలు
8. ఫ్రెష్ బౌల్ హార్టికల్చర్ ప్రైవేట్ లిమిటెడ్: రూ.33 కోట్ల పెట్టుబడి. 200మందికి ఉద్యోగాలు
9. దస్పల్లా అమరావతి హోటల్స్: అమరావతిలో రూ.200 కోట్ల పెట్టుబడి. 400మందికి ఉద్యోగాలు
10. వీఎస్కే హోటల్స్ రిసార్ట్స్: అరకువ్యాలీలో రూ.55 కోట్ల పెట్టుబడి. 98మందికి ఉద్యోగాలు
11. శ్రీవేంకటేశ్వరా లాడ్జ్ ప్రైవేట్ లిమిటెడ్: శ్రీశైలంలో రూ.83 కోట్ల పెట్టుబడి. 300మందికి ఉద్యోగాలు
12. సదరన్ గ్లోబ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్: అమరావతిలో రూ.117 కోట్ల పెట్టుబడి. 300మందికి ఉద్యోగాలు
13. మైరా బే వ్యూ రిసార్ట్స్: కొత్తవలసలో కన్వెన్షన్ సెంటర్‌కు రూ.256 కోట్ల పెట్టుబడి.
14. ఎస్వీఎస్ కన్‌స్ట్రక్షన్స్: కాకినాడలో రూ.87 కోట్ల పెట్టుబడి.
15. రైడెన్ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్: డేటా సెంటర్ ఏర్పాటుకు రూ.87,520 కోట్ల పెట్టుబడి. 200మందికి ఉద్యోగాలు.
16. ఇమాజినేటివ్ టెక్నో సొల్యూషన్స్ ఇండియా: విశాఖ కాపులుప్పాడలో ఐటీ లాజిస్టిక్స్ రూ.140 కోట్ల పెట్టుబడి. 2600 మందికి ఉద్యోగాలు
17. శాన్విరా ఇండస్ట్రీస్ లిమిటెడ్: అనకాపల్లిలో అడ్వాన్స్ కార్బన్ కాంప్లెక్స్‌కు రూ.2600 కోట్ల పెట్టుబడి. 800మందికి ఉద్యోగాలు.
18. శ్రీ సిమెంట్ లిమిటెడ్: పలనాడులో సిమెంట్ ఫ్యాక్టరీ విస్తరణ రూ.2260 కోట్ల పెట్టుబడి. 350మందికి ఉద్యోగాలు
19. రేమండ్, జేకే మైనీ ప్రెసిషన్ టెక్నాలజీ: అనంతపురంలో ఏరో స్పేస్ ఆటోమోటివ్ కాంపోనెంట్‌పై రూ.430 కోట్ల పెట్టుబడి. 4,096మందికి ఉద్యోగాలు.
20. రేమండ్ జేకే మైనీ గ్లోబల్ ఎరోస్పేస్ లిమిటెడ్: అనంతపురంలో ఏరోస్పేస్ కాంపోనెంట్లకు రూ.510 కోట్ల పెట్టుబడి. 1400మందికి ఉద్యోగాలు.
21. భారత్ డైనమిక్స్ లిమిటెడ్: ప్రకాశం జిల్లా దొనకొండ వద్ద రూ.1200 కోట్ల పెట్టుబడి. 1400మందికి ఉద్యోగాలు
22. అలీప్: ఓర్వకల్లు వద్ద మహిళా ఇండస్ట్రియల్ ఎస్టేట్ కోసం రూ.36.25 కోట్ల పెట్టుబడి. 3000 మందికి ఉద్యోగాలు.
23. అవంతీ వేర్ హౌసింగ్ సర్వీసెస్: విశాఖలో గుర్రంపాలెం వద్ద రూ.319 కోట్ల పెట్టుబడి.
24. అస్సెల్ ఈఎస్ జీ: కర్నూలు జిల్లా కృష్ణగిరిలో రూ.300 కోట్ల పెట్టుబడి. 300మందికి ఉద్యోగాలు.
25. ఫెయిర్ ఎక్స్ పోర్ట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్: విజయవాడ మల్లవెల్లిలో మెగా ఫుడ్ పార్క్ కోర్ ప్రాసెసింగ్ సెంటర్.
26. జెఎస్ డబ్ల్యూ ఇండస్ట్రియల్ పార్క్: విజయనగరంలో ప్రైవేట్ మెగా ఇండస్ట్రియల్ పార్క్‌పై రూ.531 కోట్ల పెట్టుబడి. 45000 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి.

# ఆర్గురి సజీవ దహనం



- కోనసీమ జిల్లాలో భారీ బాణసంచా పేలుడు
- పేలుడుధాటికి ఛిద్రమైన తయారీ కేంద్రం
- పలువురికి గాయాలు, ఆస్పత్రిపాలు
- శిథిలాలకింద కార్మికులు చిక్కుకున్నట్లు అనుమానం
- ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి
- వైద్య, సహాయక చర్యలకు తక్షణ ఆదేశాలు
- సహాయక చర్యలను పర్యవేక్షించిన హోంమంత్రి అనిత
- బాధితులకు అండగా ఉంటామని ప్రభుత్వం హామీ
- ప్రగాఢ సానుభూతి ప్రకటించిన డిప్యూటీ సీఎం, మంత్రులు

రాయవరం (చైతన్య రథం): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. రాయవరంలోని గణపతి గ్రాండ్ బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించింది. దీంతో పెద్దఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. మంటల్లో చిక్కుకుని ఆరుగురు సజీవ దహనమయ్యారు. మృతుల్లో నలుగురు మహిళలున్నట్టు అధికారులు గుర్తించారు. బాణసంచా పరిశ్రమ యజమాని సత్తిబాబు కూడా ఉన్నట్టు సమాచారం. మరికొందరికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని అనపర్తి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మిగిలిన వారిని ప్రయివేట్ ఆస్పత్రులకు తరలించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో 40మంది కార్మికులు అందులో పనిచేస్తున్నారు. భారీ పేలుడు ధాటికి బాణసంచా తయారీ కేంద్రం షెడ్డు గోడ కూలింది. శిథిలాల కింద మరికొందరు ఉండొచ్చని సమాచారం. ఘటనాస్థలిని రామచంద్రపురం ఆర్డీవో అఖిల పరిశీలించారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ స్పందించారు. వారం క్రితమే బాణసంచా తయారీ కేంద్రాన్ని స్థానిక పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పరిశీలించి అన్ని రక్షణ చర్యలున్నట్టు నివేదిక ఇచ్చినట్టు తెలిపారు. అగ్నిప్రమాద నివారణ పరికరాలను గోదాము యజమానులు సక్రమంగా వినియోగించారా? లేదా? అనే విషయాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుంటున్నామన్నారు.

### సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

బాణసంచా పేలుడు ఘటనపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దీనిపై అధికారులతో ఆయన మాట్లాడారు. ప్రమాదంలో పలువురు చనిపోవడంపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలు, ప్రస్తుత పరిస్థితి, సహాయకచర్యలు, వైద్యసాయంపై వివరాలను అధికారులనుంచి తెలుసుకున్నారు. ఘటనాస్థలికి వెళ్లి సహాయకచర్యల్లో పాల్గొనాలని చంద్రబాబు ఆదేశించారు. మరోవైపు ఈ ఘటనపై హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ, అగ్నిమాపక శాఖ అధికారులతో ఆమె మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి వెల్లడించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు అచ్చెన్నాయుడు, వాసంశెట్టి సుభాష్, కొలుసు పార్థసారథి, దుర్గేష్, ఆనం రామనారాయణ రెడ్డి తదితరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. మృతులు, క్షతగాత్రులపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇస్తూనే.. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను మంత్రులు ఆదేశించారు. అధికారులతో మంత్రులు ఫోన్లో మాట్లాడి సహాయ చర్యల పురోగతిని తెలుసుకున్నారు. భద్రతా నింబంధనలు అమలుపై దృష్టి పెట్టాలని, ఇటువంటి ఘటనలు పునరావృతతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీపావళి సమయంలో బాణాసంచా తయారీ కేంద్రాల్లో, సంబంధిత గోడాముల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు అమలయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం భరోసాగా ఉంటుందని హామీనిచ్చారు.

# అస్సలు ఉపేక్షించొద్దు!



- కల్తీ మద్యమంటూ కల్తీ ప్రచారంపై సీఎం సీరియస్
- అభూత కల్పనలతో ప్రజలను భయపెడుతున్నారు
- ప్రాణాలు పోతున్నాయంటూ ఫేక్ ప్రచారాలు సాగిస్తున్నారు
- ఆరోపణలను విచారించి.. వాస్తవాలు బయటపెట్టండి
- రాజకీయ కుట్రతో తప్పుడు ప్రచారాలు చేసేవారిపై చర్యలు
- ఉన్నతాధికారులు, మంత్రుల సమావేశంలో ముఖ్యమంత్రి ఆదేశం
- వైసీపీ రాజకీయ కుట్రలను భగ్నం చేయాలని మంత్రులకు సూచన

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో కల్తీ మద్యం తయారీ, అమ్మకాలను ఏమాత్రం ఉపేక్షించొద్దని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలను హరించే వారిపై కఠిన చర్యల ద్వారా ఉక్కుపాదం మోపాలని సీఎం స్పష్టం చేశారు. 15 నెలల్లో పటిష్ట చర్యలద్వారా ఇతర రాష్ట్రాలనుంచి వచ్చే నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అరికట్టామని... ఇంతే సమర్థవంతంగా పనిచేసి రాష్ట్రంలో కల్తీ మద్యం అనేది లేకుండా చేయాలని ఆదేశించారు. ఏ ఒక్కచోటా కల్తీ మద్యం తయారీ కేంద్రాలుకానీ, అటువంటి వ్యక్తులుకానీ ఉండకూడదని సీఎం స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అన్నమయ్య జిల్లాలో కల్తీ మద్యం వ్యవహారంలో తీసుకున్న చర్యలను, దర్యాప్తు వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అన్నమయ్య జిల్లా ములకలచెరువు కేసులో మొత్తం 21మంది నిందితులుగా గుర్తించామని... అందులో ఇప్పటికి వరకు 12మందిని అరెస్టు చేశామని... మిగితా నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని వివరించారు. ములకలచెరువు కేసులో ఎ1గా ఉన్న అద్దేపల్లి జనార్ధన్‌రావు లావాదేవీలు, వ్యాపారాలపై విచారణ జరుపుతున్నామని తెలిపారు. ముకలచెరువు కేసుల ఆధారంగా ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో జనార్ధన్‌రావుకు చెందిన వ్యాపారాలపై తనిఖీలు జరిపామన్నారు. ఈ తనిఖీల్లో కిరాణా షాప్ వెనుక కల్తీ మద్యం నిల్వలను గుర్తించినట్టు తెలిపారు. అద్దేపల్లి జనార్దనరావు ఇబ్రహీంపట్నంలోని మెస్సర్స్ ఏఎన్నార్ బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహిస్తున్నాడు. అతను 15 ఏళ్లుగా మద్యం వ్యాపారం చేస్తున్నాడు. అధిక లాభాల కోసం నకిలీ మద్యం తయారీ ద్వారా చట్ట విరుద్ధ కార్యక్రమాలు నిర్వహించారు. తన సోదరుడు అద్దేపల్లి జగన్ మోహన్‌రావు ద్వారా కల్తీ మద్యం తయారీ, సరఫరా, అమ్మకం చేపట్టాడు. వీరిద్దరు కొందరితో కలిసి కల్తీ మద్యం తయారు చేసినట్టు తనిఖీల్లో గుర్తించామని అధికారులు తెలిపారు. ఇక్కడ జరిపిన తనిఖీల్లో కల్తీ లిక్కర్ సీసాలు పట్టుకున్నామన్నారు. ఇక్కడ కల్తీ లిక్కర్ వ్యవహారంలో మొత్తం 12మందిని నిందితులుగా గుర్తించామని.. వీరిలో ముగ్గురిని ఇప్పటికే అరెస్టు చేశామని తెలిపారు. నలుగురిని పీటీ వారెంట్‌పై తీసుకుని విచారిస్తున్నామని తెలిపారు. నిందితుల కాల్ రికార్డులతోపాటు అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నామని అధికారులు వివరించారు.

### ఫేక్ ప్రచారంపైనా చర్యలు తీసుకోండి

కల్తీ మద్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేసిన ముఖ్యమంత్రి... ఈ మొత్తం వ్యవహారంలో పలు కీలక సూచనలు చేశారు. అన్నమయ్యజిల్లాలో జరిగిన కల్తీ మద్యం వ్యవహారంపై రాష్ట్రంలో రాజకీయ పక్షాలు తప్పుడు ప్రచారంతో రాజకీయ ప్రయోజనంకోసం ప్రయత్నం చేస్తున్నాయని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రమంతటా కల్తీ మద్యం అని తప్పుడు ప్రచారంతో ప్రజలను భయపెడుతున్నారని... ప్రతి మూడు బాటిల్స్‌లో ఒక బాటిల్ కల్తీ మద్యం బాటిల్ ఉందని ఫేక్ ప్రచారం చేస్తున్నారని సీఎం అన్నారు. రాష్ట్రంలో కల్తీ లిక్కర్‌తో ప్రాణాలుపోతున్నాయని ఫేక్ ప్రచారాలు మొదలు పెట్టిన విషయాన్ని మంత్రులు కూడా అర్థం చేసుకోవాలని.... వైసీపీ నేతల రాజకీయ కుట్రలను ఎప్పటికప్పుడు భగ్నం చేయాలని సూచించారు. కల్తీ మద్యం కారణంగానే అక్కడ చనిపోయారు.. ఇక్కడ చనిపోయారని ప్రచారం చేస్తున్నారని...ప్రతీ ఆరోపణ పైనా విచారణ జరిపించాలని అధికారులను సీఎం ఆదేశించారు. అవసరమైతే పోస్టుమార్టంవంటి విధానాల ద్వారా మృతికి కారణాలు సైంటిఫిక్‌గా నిర్ధారించి... వాస్తవాలు వెల్లడించాలని అధికారులను ఆదేశించారు. ఏది నిజమో చెప్పడంతోపాటు.. రాజకీయ కుట్రల్లో భాగంగా సహజ మరణాలపై తప్పుడు ప్రచారాలు చేసేవారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కల్తీ మద్యంతో మరణాలు అని ప్రచారం చేస్తే దానికి రుజువు చూపాలని అడగాలని... తప్పుడు ప్రచారమని తేలితే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. మీడియా అయినా,సోషల్ మీడియా అయినా తప్పుడు ప్రచారం చేస్తే ఉపేక్షించవద్దని సీఎం స్పష్టం చేశారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి లాభం పొందుదామను కుంటే ప్రభుత్వం, ప్రభుత్వ శాఖలు సైలెంట్‌గా చూస్తూ ఊరుకోవని సీఎం హెచ్చరించారు.

### ఏ అంశాలు లేకనే తప్పుడు ప్రచారం

సమావేశానికి మంత్రులు కొల్లు రవీంద్ర, లోకేశ్ నేరుగా హాజరవ్వగా..హోంమంత్రి సహా పలువురు మంత్రులు వీడియో కాన్ఫరెన్స్‌లో హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులకు సీఎం స్పష్టమైన ఆదేశాలిచ్చారు. 2019లో వివేకా హత్య సమయంలో వైసీపీ ఆడిన డ్రామాలు, శవ రాజకీయాలను మరిచిపోవద్దని గుర్తు చేశారు. వాళ్లు ఫేక్ ప్రచారంతోనే ప్రజలను నమ్మించాలనే ప్రయత్నంలో ఉంటారని... మీరు మరింత చురుగ్గా, వేగంగా వాటిని తిప్పికొట్టాలన్నారు. ఈ విషయంలో వైసీపీ గత చరిత్ర, వారి కుట్ర రాజకీయాలను ప్రజల్లో ఎండగట్టాలని సూచించారు. ప్రతి ఘటనపైనా, ప్రతి సమస్యపైనా ప్రభుత్వం స్పందిస్తోందని, ప్రభుత్వంపై విమర్శలు చేయడానికి వైసీపీకి ఏ కారణాలు దొరకడం లేదన్నారు. అందుకే తప్పుడు ప్రచారాలతో రాద్ధాంతం చేయాలని చూస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తున్నాం.. దీంతో విమర్శలకు అవకాశం లేని వైసీపీ.... తమ రాజకీయ సిద్ధాంతమైన ఫేక్ ప్రచారాన్నే నమ్ముకుందని సీఎం దుయ్యబట్టారు. అయితే ప్రజలు ఇప్పుడు వీటిని నమ్మే పరిస్థితి లేదని.... అయినా మంత్రులుగా, ప్రజా ప్రతినిధులుగా ఏది మంచి ఏది చెడు అనేది ప్రజలకు వివరించే బాధ్యత మనపై ఉందని సీఎం చంద్రబాబు మంత్రులకు సూచించారు.

చైతన్యరథం

# అమరావతి అభివృద్ధితో పాటు
# స్థానిక రైతులూ అభివృద్ధి చెందాలి



- రిటర్నబుల్ ప్లాట్లు ఇచ్చిన వారికి రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలి
- భూములిచ్చిన ఊళ్లోనే రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వాలి
- సీఆర్డీఏ అథార్టీ భేటీలో సీఎం చంద్రబాబు ఆదేశాలు
- అమరావతిలో రూ.212 కోట్లతో రాజ్‌భవన్ నిర్మాణానికి సీఆర్డీఏ ఆమోదం
- 53వ సీఆర్డీఏ అథార్టీ సమావేశంలో కీలక నిర్ణయం

అమరావతి (చైతన్య రథం): అమరావతి అభివృద్ధితో పాటు... రాజధానికి భూములిచ్చిన రైతులూ అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. భూములిచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్లను తక్షణం ఇవ్వాలని సీఎం ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన 53వ సీఆర్డీఏ అథార్టీ సమావేశం జరిగింది. మొత్తంగా 18 అంశాలపై అథార్టీ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "రాజధాని నిర్మాణ పనులు రీస్టార్ట్ చేశాం. రాజధాని కోసం భూములను త్యాగం చేసిన రైతులకే మొదటగా రాజధాని అభివృద్ధి ఫలాలు అందాలి. రాజధాని రైతులకు కౌలు చెల్లింపుల్లోనూ ఎలాంటి జాప్యం జరగకూడదు. భూములిచ్చిన రైతులకు ఎక్కడ రిటర్నబుల్ ప్లాట్లు ఇస్తామని చెప్పామో... అక్కడే ఇవ్వాలి. ఏ ఊళ్లో భూములిచ్చిన వారికి ఆ ఊళ్లోనే ప్లాట్లు ఇస్తామని హామీ ఇచ్చాం. అలాగే ఎలాట్మెంట్ చేయాలి. రాజధాని నిర్మాణ పనుల్లో మరింత వేగం పెరగాలి. సెక్రటేరియేట్ టవర్లతో సహా ఇతర నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి. వెస్ట్ బైపాస్ రోడ్డును వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి. ఏమైనా సాంకేతిక ఇబ్బందులుంటే.. వాటిని వెంటనే పరిష్కరించుకుని ఖాజా టోల్ గేట్ దగ్గర జాతీయ రహదారిని చేరేలా ఉన్న రోడ్ నిర్మాణ పనులను పూర్తి చేయాలి. కరకట్ట రోడ్డును విస్తరించాలి. మూడు నెలల్లో రాజధాని నగరాన్ని ఓ రూపునకు తీసుకురావాలి" అని సీఎం స్పష్టం చేశారు.

### రాజ్‌భవన్ సహా వివిధ నిర్మాణలకు ఆమోదం

అమరావతిలో గవర్నర్ నివాసం రాజ్‌భవన్ నిర్మాణానికి సీఆర్డీఏ అథార్టీ ఆమోదించింది. రూ.212 కోట్ల వ్యయంతో రాజ్‌భవన్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. కృష్ణా నదీ ఒడ్డున అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ నిర్మాణంలో భాగంగా రాజ్‌భవన్ నిర్మాణం జరగనుంది. రాజ్‌భవన్ నిర్మాణానికి సంబంధించిన డిజైన్ అద్భుతంగా ఉండాలని సీఎం సూచించారు. మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి 25శాతం నిధులను సీఆర్డీఏ ఇచ్చేందుకు అథార్టీ ఆమోదం తెలిపింది. రాజధాని ప్రాంతంలో నాలుగు కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి అథార్టీ అంగీకరించింది. రాజధాని నగర జోనింగ్ నిబంధనల్లో గ్రీన్ సర్టిఫైడ్ భవనాలుండేలా అవసరమైన మార్పులు చేర్పులు అథార్టీ ఆమోదించింది. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణానికి ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా సీఆర్డీఏ వ్యవహరించేలా అథార్టీలో నిర్ణయించారు. హ్యాపీ నెస్ట్, ఏపీ ఎన్నార్టీ ప్రాజెక్టులకు చెందిన బిల్డింగ్ పర్మిషన్ ఫీజును మాఫీ చేసేందుకు అథార్టీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాజధానిలో నిర్మించే హోటళ్ల వద్ద పార్కింగ్ నిబంధనల్లోనూ స్వల్ప మార్పులు చేసేందుకు అథార్టీ అంగీకరించింది. కొండవీడు వాగు సమీపంలో నీటి ప్రవాహాల కోసం 8400 క్యూసెక్కుల సామర్థ్యంతో మరో పంపింగ్ స్టేషన్ నిర్మాణానికి అథార్టీ నిర్ణయించింది. దీంతోపాటు మరికొన్ని సాంకేతిక అంశాలకు, పరిపాలనా అంశాలకు అథార్టీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా సీఎం కొన్ని సూచనలు చేశారు. భవిష్యత్తులో వాహనాల సంఖ్య బాగా పెరిగే అవకాశముందని... పార్కింగ్ సమస్య లేకుండా ప్రణాళికలు చేయాలని సూచించారు.

అమరావతి రాజధానిలో రోడ్డుపై వాహనాల పార్కింగ్ చేసే పరిస్థితి లేకుండా చూడాలన్నారు. కామన్ పార్కింగ్ ప్రాంతాలు ఉండేలా ప్రణాళికలు చేయాలని సీఎం అధికారులకు సూచించారు. విజయవాడ, గుంటూరు, మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్లు తెనాలి మున్సిపాలిటీ, రాజధాని ప్రాంతంతో ఇంటిగ్రేట్ చేయాలని... బ్లూ గ్రీన్ అమరావతిగా రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సీఆర్డీఏ అథార్టీ సమావేశానికి మంత్రి నారాయణ, సీఎస్ కె విజయానంద్, సీఆర్డీఏ, ఏడీసీ, మౌలికసదుపాయాల కల్పన శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## 'ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి' వెబ్‌సైట్ ఆవిష్కరించిన ముఖ్యమంత్రి




- జర్నలిస్టులకు శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు
- రాజధానిలో మీడియా అవసరాలకు సహకరిస్తామని హామీ

అమరావతి (చైతన్య రథం): అమరావతి జర్నలిస్టులు రూపొందించిన 'ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి' వెబ్‌సైట్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమరావతి ప్రెస్ క్లబ్ కమిటీకి, జర్నలిస్టులకు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. రాజధాని ప్రాంతంలోని జర్నలిస్టులు అంతాకలిసి ప్రెస్‌క్లబ్ ఆఫ్ అమరావతి ఏర్పాటు చేసుకోవడంతోపాటు నేడు వెబ్‌సైట్‌ను రూపొందించుకోవడాన్ని ముఖ్యమంత్రి అభినందించారు. అమరావతి నిర్మాణంలో ముఖ్యమంత్రి ఆలోచనల స్ఫూర్తితోనే 2018లో 'ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి' పురుడుపోసుకుందని కమిటీ సభ్యులు చెప్పారు. నాటి నుంచి 'ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి' తరుపున పలు కార్యక్రమాలు నిర్వహించినట్టు వివరించారు. ప్రభుత్వ సహకారంతో ఇప్పుడు అమరావతిలో ప్రెస్ క్లబ్ నిర్మాణం చేపట్టి... రాజధానిలో అమరావతి ప్రెస్ క్లబ్‌ను ఒక మంచి కేంద్రంగా గుర్తింపు తెచ్చే ప్రయత్నం చేస్తున్నామని... ఈ క్రమంలో దేశంలో ఇతర రాష్ట్రాల్లో ఉన్న ప్రెస్‌క్లబ్‌లను కూడా పరిశీలించి డిజైన్లు రూపొందించామని కమిటీ సభ్యులు తెలిపారు. అమరావతి ప్రెస్ క్లబ్ ద్వారా రాజధానిలో మీడియా తనవంతు పాత్ర పోషించాలనేది తమ ఆకాంక్షగా వెల్లడించారు. ప్రెస్ క్లబ్ నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించాలని ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, జర్నలిస్టులు ముఖ్యమంత్రిని కోరగా... ఆయన సానుకూలంగా స్పందించారు. రాజధానిలో మీడియా అవసరాలు తీర్చడానికి సహాయ సహకారాలు అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి వెబ్ సైట్ ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ అప్పాజీ, జనరల్ సెక్రటరీ సతీష్‌బాబు, వైస్ ప్రెసిడెంట్ నారాయణ, ట్రెజరర్ కె.పూర్ణచంద్రరావు, జాయింట్ సెక్రటరీ మహేష్, కమిటీ సభ్యులు శ్యామ్‌సుందర్, మల్లేశ్వరరావు, శ్రీనివాస్, కె గాంధీబాబు, అనిల్ పాల్గొన్నారు.

## మన చంద్రన్న-2 పుస్తకం ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు






అమరావతి (చైతన్య రథం): టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్ రూపొందించిన మన చంద్రన్న-2 డిజిటల్ పుస్తకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. 2024లో ముఖ్యమంత్రి అయిన తర్వాత చేపట్టిన వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఈ పుస్తకాన్ని టీడీ జనార్ధన్ రూపొందించారు. మొదట రూపొందించిన మన చంద్రన్న పుస్తకంలో చంద్రబాబు బాల్యం, విద్యాభ్యాసం, ఎమ్మెల్యేగా గెలుపు, అనంతరం ముఖ్యమంత్రి అయ్యాక చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం, విజన్‌వంటి అంశాలతో పుస్తకాన్ని రూపొందించగా... మన చంద్రన్న-2 డిజిటల్ పుస్తకంలో 2024లో ముఖ్యమంత్రి అయిన తర్వాత చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. మహిళా సంక్షేమం కోసం తీసుకొచ్చిన సంస్కరణలు, కార్యక్రమాలు, రాయలసీమకు కృష్ణాజలాల తరలింపు, పెట్టుబడుల ఆకర్షణ, ఏపీ బ్రాండ్ పునరుద్ధరణవంటి వివిధ అంశాలను ఈ డిజిటల్ బుక్‌లో ప్రస్తావించారు. మన చంద్రన్న-2 డిజిటల్ బుక్ త్వరలోనే ప్రింట్ రూపంలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు టీడీ జనార్ధన్ తెలిపారు.

చైతన్యరథం

# మోదీ రాకకు భారీ ఏర్పాట్లు



- ప్రధాని ఏపీ పర్యటనపై సీఎం చంద్రబాబు సమీక్ష
- శ్రీశైలంలో జ్యోతిర్లింగం, శక్తిపీఠ క్షేత్రాలను దర్శించుకోనున్న ప్రధాని
- కర్నూలు జిల్లా ఓర్వకల్లులో జీఎస్టీ సంస్కరణల ఉత్సవ్ సభకు హాజరు

అమరావతి (చైతన్య రథం): ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 16న ఏపీ పర్యటన ఏర్పాట్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్షించారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్షలో మంత్రులు నారా లోకేశ్, బీసీ జనార్దన్ రెడ్డి, అనగాని, కందుల దుర్గేష్ పాల్గొన్నారు. సీఎస్, డీజీపీలు సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు సమీక్షకు హాజరయ్యారు. ఈ క్రమంలో అమరావతి, విశాఖల్లో ప్రధాని పాల్గొన్న కార్యక్రమాలను మించినస్థాయిలో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రధాని పర్యటనను సక్సెస్ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తన పర్యటన సందర్భంగా ప్రధాని శ్రీశైల భ్రమరాంబ, మల్లిఖార్జునస్వామిని దర్శనం చేసుకోనున్నారు. తర్వాత కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరులో నిర్వహించే బహిరంగ సభకు హాజరు కానున్నారు. కేంద్రం తెచ్చిన జీఎస్టీ-2.0 సంస్కరణలను స్వాగతించి.. దేశంలోనే తొలిసారిగా అసెంబ్లీలో అభినందనల తీర్మానం చేసింది ఏపీ ప్రభుత్వం. అలాగే జీఎస్టీ సంస్కరణల ఉత్సవ్ పేరుతో దసరానుంచి దీపావళి వరకు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలను చేపట్టింది. ఈ క్రమంలో జీఎస్టీ సంస్కరణల ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని పాల్గొనే సభను విజయవంతం చేసేలా ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. సభ నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ప్రధాని పర్యటన సందర్భంగా వాతావరణ పరిస్థితులను చూసుకుని.. దానికి తగ్గ ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రధాని సభకు వచ్చే సభికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని... ఆహారం, తాగునీరు సౌకర్యం కల్పించాలని... సభకు వచ్చే అప్రోచ్ రోడ్లను పూర్తి చేయాలని.. పార్కింగ్ నిమిత్తం ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అలాగే ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## మోదీజీ.. దేశసేవలో మరింత తరించండి

### ఎక్స్ పోస్టులో సీఎం చంద్రబాబు అభినందనలు

అమరావతి (చైతన్య రథం): సుదీర్ఘ పజాసేవలో ప్రధాని నరేంద్రమోదీ సాధించిన అద్భుతమైన మైలురాయికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. ప్రభుత్వాధినేతగా నరేంద్రమోదీ పాతికేళ్ల ప్రయాణాన్ని ప్రస్తావిస్తూ.. ఎక్స్ వేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబు పోస్టు పెట్టారు. "ప్రధాని మోదీజీ.. మీరు సాధించిన అద్భుత మైలురాయికి అభినందనలు. ప్రజా సేవపట్ల మీ నిబద్ధత, దార్శనిక నాయకత్వం దేశవ్యాప్తంగా లక్షలాది మందికి స్ఫూర్తినిస్తూనే ఉంది. గుజరాత్ ముఖ్యమంత్రిగా మీ పరివర్తనాత్మక పదవీకాలం నుంచి ప్రధానమంత్రిగా మీ సేవ వరకు, స్థిరమైన, దృఢ సంకల్పం కలిగిన నాయకత్వం ఒక రాష్ట్రం, దేశం మరియు దాని ప్రజల భవిష్యత్తును ఎలా పునర్నిర్మించగలదో చూపించారు. మన గొప్ప దేశానికి మీరు ఇంకా చాలా సంవత్సరాలు సేవ చేయాలని, ప్రతి పౌరుడిని శక్తివంతం చేయడానికి, ఉద్ధరించడానికి మీరు చేసే ప్రయత్నాలలో నిరంతర విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

# మనమే పరిష్కరించుకుందాం

- సమస్యల పరిష్కారానికి సర్కారు ఎప్పుడూ సిద్ధమే
- ఉపాధ్యాయులకు భరోసానిచ్చిన మంత్రి నారా లోకేశ్
- ఏపీలో విద్యావ్యవస్థను నెం.1గా తీర్చిదిద్దాలనేదే లక్ష్యం
- ఇందుకు ప్రతి ఉపాధ్యాయుడి సహకారం అవసరం
- అంతర్ జిల్లా బదిలీల ఉపాధ్యాయులు, భాషా పండితులతో లోకేశ్ భేటీ
- మంత్రి లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపిన ఉపాధ్యాయులు
- విద్యార్థులకు బాగా చదువు చెబితే అదే పెద్ద గిఫ్టన్న మంత్రి




ఉండవల్లి (చైతన్య రథం): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, చర్చించుకుని మన సమస్యలను మనమే పరిష్కరించుకుందామని విద్య, ఐటీ మంత్రి నారా లోకేశ్ భరోసానిచ్చారు. ఉండవల్లి నివాసంలో ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు అంతర్ జిల్లా బదిలీల ఉపాధ్యాయులు, భాషా పండితులతో మంత్రి సమావేశమయ్యారు. టీచర్ల అంతర్ జిల్లా బదిలీలను (మ్యూచువల్, స్పౌజ్) విజయవంతంగా నిర్వహించడంతోపాటు ఏళ్లుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న భాషా పండితుల సమస్యను పరిష్కరించడంపట్ల మంత్రి నారా లోకేశ్‌ను ప్రత్యేకంగా కలిసి వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. విద్యాశాఖలో మొదటి ఏడాది సంస్కరణలు పూర్తిచేశాం. వచ్చే నాలుగేళ్లపాటు ఫలితాలపైనే దృష్టిసారిస్తాం. గత ప్రభుత్వం మాదిరిగా విద్యార్థులను డ్రాప్ బాక్స్‌లో పెట్టి దొంగలెక్కలు చూపబోం. పారదర్శకంగా వ్యవహరిస్తాం. విద్యాశాఖను ఛాలెంజింగ్‌గా తీసుకున్నాం. ఏపీలో విద్యావ్యవస్థను నెం1గా తీర్చిదిద్దాలనేదే లక్ష్యం. ఇందుకు ఉపాధ్యాయుల సహకారం కావాలి. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్ గురించి ఆలోచించాలి. అభ్యసన ఫలితాల్లో విద్యార్థులు వెనుకబడి ఉన్నారు. దీనిని అధిగమించేందుకు కృషిచేస్తున్నాం. 150 రోజుల్లో డీఎస్సీ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేశాం. ఉపాధ్యాయుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించాం. విద్యావ్యవస్థలో మార్పునకు మీ అందరి సహకారం కావాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

### విద్యార్థులను తీర్చిదిద్దితే అదే పెద్ద గిఫ్ట్

టీచర్ల అంతర్ జిల్లా బదిలీలను విజయవంతంగా నిర్వహించడంతోపాటు భాషా పండితులకు పదోన్నతులు కల్పించిన మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపేలా రాష్ట్రవ్యాప్తంగా 'థాంక్యూ లోకేష్' కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు ఉపాధ్యాయులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అందుకు మంత్రి స్పందిస్తూ.. అలాంటి కార్యక్రమాలేవీ వద్దని, విద్యార్థులకు చదువు బాగా చెబితే అదే పెద్ద గిఫ్ట్ అని వారితో అన్నారు.

"నేను ఏలూరు జిల్లాలో ఎస్జీటీగా పనిచేస్తున్నాను. నా భర్త కడపలో పనిచేస్తున్నారు. ఎవరికి ఆరోగ్యం బాగాలేకపోయిన వందల కిలోమీటర్లు ప్రయాణం చేస్తూ.. గత ఐదేళ్లుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. బదిలీ కోసం ఎన్ని ప్రయత్నాలు చేసినా సక్సెస్ కాలేకపోయాం. ఇక బదీలీ కాదనే స్థిర నిర్ణయానికి వచ్చాం. ఈ సమయంలో భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డిని కలిసి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లాం. ధైర్యంగా ఉండాలని, విద్యాశాఖ మంత్రి కచ్చితంగా అంతర్ జిల్లా బదిలీలు చేస్తారని చెప్పారు. అనుకున్నట్లుగానే అంతర్ జిల్లాల బదిలీలకు సంబంధించి నోటిఫికేషన్ ఇచ్చారు. అంతర్ జిల్లాల బదిలీలు అంటే చాలా ప్రాసెస్ ఉంటుంది. ఎన్నో ఏళ్లు పడుతుంది. ఎప్పటికో అవుతుందిలేనని భావించాం. నిర్దుష్ట సమయంలోనే నోటిఫికేషన్ రావడం, జీవో రావడం జరిగిపోయింది. మేం స్కూల్‌లో కూడా జాయిన్ అయ్యాం. ఇవాళ చాలా సంతోషంగా ఉంది. మీకు కృతజ్ఞతలు చెప్పుకోవడానికి వచ్చాం. ఈ ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటా"మని ఉపాధ్యాయురాలు బి లక్ష్మీ ప్రసన్న అన్నారు.

"భాషా పండితులకు పదోన్నతలు కల్పించి.. విజయదశమి రోజున మా జీవితాల్లో వెలుగులు నింపారు. మీకు కృతజ్ఞతలు. దశాబ్దాల కలను సాకారం చేశా"రంటూ భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఏ కొండయ్య మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె శ్రీనివాసరాజు, జనరల్ సెక్రటరీ బి హైమారావు, ఫైనాన్షియల్ సెక్రటరీ జే శ్రీనివాస్, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ అధ్యక్షులు సంపత్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎం.రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.



# స్ఫూర్తిదాయకమైన విశిష్ట ప్రజా సేవ మీది

## మోదీజీకి ఎక్స్ వేదికపై మంత్రి లోకేశ్ అభినందనలు

అమరావతి (చైతన్య రథం): పాతికేళ్ల విశిష్ట ప్రజా సేవ పూర్తి చేసుకున్న ప్రధాని నరేంద్ర మోదీజీకి మంత్రి నారా లోకేశ్ మర్యాదపూర్వక అభినందనలు తెలిపారు. ఈమేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ.. "మీది దార్శనికత, దృఢ నిశ్చయం, దేశ సేవలో నిరంతర నిబద్ధత ప్రదర్శించిన అద్భుతమైన ప్రయాణం" అని కొనియాడారు. "నేను వ్యక్తిగతంగా మిమ్ములను కలిసి.. మీనుంచి దగ్గరగా నేర్చుకునే అదృష్టం దక్కించుకున్నాను. ప్రతి సంభాషణనుంచి.. వినడంలోని నిశ్శబ్ద శక్తినుంచి.. విధాన సంవిధానంలోని క్రమశిక్షణ నుంచి.. ఆచరణీయ అంశాలపై అచంచలమైన పట్టుదల నుంచి నేర్చుకోవలసినవి చాలా ఉన్నాయి. మీరు సాధించిన మైలురాయిని దేశం గుర్తించే సమయంలో, భారత్ ఆకాంక్షల సేవలో నిరంతర బలం, ఆరోగ్యం కలిగి ఉండాలని కోరుకుంటూ హృదయపూర్వక శుభాకాంక్షలు. తదుపరి అధ్యాయం భారత ప్రజలకు, దేశ భవిష్యత్తుకు మరింత పరివర్తన కలిగించేదిగా ఉండాలని ఆశపడుతున్నాను" అని మంత్రి లోకేశ్ వినమ్రంగా పేర్కొన్నారు.

# నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు అక్షయపాత్ర ద్వారా నాణ్యమైన భోజనం

## మాట నిలబెట్టుకున్నారంటూ మంత్రి లోకేశ్‌కు విద్యార్థుల ధన్యవాదాలు



అమరావతి (చైతన్య రథం): నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు అక్షయపాత్ర ద్వారా నాణ్యమైన భోజనం అందుతుండటంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి కృషిచేసిన విద్య, ఐటీ మంత్రి నారా లోకేశ్‌కు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల నూజివీడు ట్రిపుల్ ఐటీలో భోజనం సరిగా పెట్టడం లేదని, నిర్వహణ సక్రమంగా లేదంటూ విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ట్రిపుల్ ఐటీల్లో మెస్ నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం అక్షయపాత్రకు అప్పగించింది. దీంతో నూజివీడు విద్యార్థులు ఎప్పటినుంచో ఎదుర్కొంటున్న భోజన సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిన మంత్రి నారా లోకేశ్‌కు ఈ సందర్భంగా విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. అక్షయపాత్ర ద్వారా అందిస్తున్న పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన భోజనాలతో ఇప్పుడు నిజమైన మార్పు కనిపిస్తోందని, మాట నిలబెట్టుకున్నందుకు ధన్యవాదాలు అంటూ తమ సంతోషాన్ని తెలియజేశారు. ఈ పరిష్కారాన్ని శాశ్వతంగా కొనసాగించాలని విద్యార్థులు విజ్ఞప్తి చేశారు.



### ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు కుమార్తె వివాహ వేడుకకు హాజరైన మంత్రి లోకేష్

మంగళగిరి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ వైద్యసేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) ఛైర్మన్, మంగళగిరి నియోజకవర్గ జనసేన ఇంఛార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు కుమార్తె వివాహ వేడుకకు విద్య, ఐటీ మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్‌లో జరిగిన వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులు చాముండేశ్వరి, సాయివివేక్‌లను ఆశీర్వదించారు. వైవాహిక జీవితంలోకి అడుగుపెడుతున్న నూతన దంపతులకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.



# ఇలాంటి ఘటనలు పునరావృతం కానివ్వం



- ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటుంది
- ఫైర్‌వర్క్స్ కేంద్రాలు నిబంధనలు పాటించాలి
- కార్మికులకు బీమా సౌకర్యం కల్పిస్తాం
- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన హోంమంత్రి అనిత
- బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ

రాయవరం (చైతన్య రథం): కోనసీమ జిల్లా రాయవరం మండలం కొమరిపాలెం శివారులోని వి సావరంలో గణపతి ఫైర్‌వర్క్స్ తయారీ కేంద్రంలో బుధవారం చోటుచేసుకున్న భారీ అగ్నిప్రమాదంలో ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. విద్యుదాఘాతం కారణంగా ప్రమాదం సంభవించినట్టు బాధితులు వెల్లడించారు. సంఘటనపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన అనంతరం మంత్రి అనిత మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటుందన్నారు. ఫైర్‌వర్క్స్ తయారీ కేంద్రాలు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. అనుమతి ఉన్నప్పటికీ విధుల్లో నిర్లక్ష్యం వల్లే ఇలాంటి ఘటనలు సంభవిస్తున్నట్టు ఆమె అభిప్రాయపడ్డారు. "బాణాసంచా తయారీ కేంద్రాలు, దుకాణాలను తనిఖీలు చేయాలని అధికారులను ఆదేశించాం. కార్మికులకు బీమా సౌకర్యం కల్పించేలా చేస్తాం" అని తెలిపారు.

ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా నిలుస్తుందని, త్వరలో పరిహారం ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. గాయపడిన లింగం చిన్నబాబు, చిట్టూరి యామినిలను కాకినాడ జీజీహెచ్‌కి తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నట్టు తెలిపారు. ఏడుగురు కార్మికులు సజీవ దహనమవడం హృదయ విదారకమన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు. మంత్రి అనితతో పాటు మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనా, ఆర్టీవో దేవరకొండ అఖిల, అగ్నిమాపక విపత్తుల శాఖ అధికారి సారథి, డీఎస్పీ మురళీమోహన్ తదితరులు పరిశీలనలో పాల్గొన్నారు.

# కాణిపాకం ట్రస్ట్ బోర్డు నియామకం



కాణిపాకం (చైతన్య రథం): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం పాలకమండలి సభ్యులను కూటమి ప్రభుత్వం నియమించింది. 16 మంది సభ్యులతో కూడిన పాలకమండలిని బుధవారం ప్రకటించింది. పాలక మండలిలో జనసేన నుంచి ఇద్దరికి, బీజేపీ నుంచి ఒకరికి పదవులు దక్కాయి.

### కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు

| పేరు | నియోజకవర్గం | పార్టీ |
|---|---|---|
| 1. చంద్రశేఖర్‌రెడ్డి | పూతలపట్టు (ఎస్సీ) | టీడీపీ |
| 2. డాక్టర్ బివి నరేష్ | కుప్పం | జనసేన |
| 3. పరిమి చంద్రకళ | తాడిపత్రి | టీడీపీ |
| 4. కెఎస్ అనసూయమ్మ | గంగాధర నెల్లూరు (ఎస్సీ) | టీడీపీ |
| 5. కాథి సుధాకర్ రెడ్డి | పూతలపట్టు (ఎస్సీ) | టీడీపీ |
| 6. సంధ్యారాణి దేవరకొండ | రాజంపేట | టీడీపీ |
| 7. శ్రీమతి సునీతా గుంటుపల్లి | ప్రత్తిపాడు (ఎస్సీ) | టీడీపీ |
| 8. కొత్తపల్లి శివప్రసాద్ | పూతలపట్టు | జనసేన |
| 9. టివి రాజ్యలక్ష్మి | కర్నూలు | టీడీపీ |
| 10. పుట్ల నాగరాజునాయుడు | పూతలపట్టు (ఎస్సీ) | టీడీపీ |
| 11. శ్రీపతి సతీష్ | తెలంగాణ | టీ.టీడీపీ |
| 12. పెరుమాళ్ సుబ్రమణ్యం రెడ్డి | పూతలపట్టు (ఎస్సీ) | బీజేపీ |
| 13. కిలపర్తి రాజేశ్వరి | మాడుగుల | టీడీపీ |
| 14. పి పద్మలత కనకరాజు | చంద్రగిరి | టీడీపీ |
| 15. వసంత | కుప్పం | టీడీపీ |
| 16. వి శ్రీవాణి | పీలేరు | టీడీపీ |

# వైద్య విద్యను నాశనం చేసిన జగన్

- మెడికల్ కాలేజీలకు చేసింది శూన్యం
- పేద విద్యార్థులకు దూరమయ్యేలా చేశాడు
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్



మంగళగిరి (చైతన్యరథం): జగన్ పేద విద్యార్థులకు వైద్య విద్య ను దూరం చేస్తున్నాడని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ అసెంబ్లీకి రాకుండా కుర్చీ కావాలంటూ చిన్న పిల్లాడు లాలీపాప్ కోసం ఏడ్చినట్లు, జగన్ తన ప్యాలెస్‌లో కూర్చుని డ్రామాలు ఆడుతున్నా డు. రాష్ట్ర ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే ప్యాలెస్‌లో రాజకీయ నాట కాలు ప్రదర్శిస్తున్నాడు. నర్సీపట్నం వెళ్లి మెడికల్ కాలేజీలను చూస్తాడట. రాష్ట్రంలో జగన్ చేత కట్టిన ఒక్క మెడికల్ కాలేజ్ కూడా లేదు. అయినా కూడా తానే కట్టానని, ప్రజలు చూసి ఆహా ఓహో అంటారని తెగ ప్రగల్భాలు పలుకుతున్నాడు..అలా చెప్పు కోవడానికి కొంచెమైనా సిగ్గుండాలని హితవుపలికారు. నర్సీప ట్నం మెడికల్ కాలేజ్ అంచనా వ్యయం రూ.500 కోట్లు. కానీ ఖర్చు చేసింది కేవలం రూ.11.7 కోట్లు మాత్రమే. పార్వతీపు రం కాలేజ్‌కి రూ.600 కోట్లు అంచనా అయితే కనీసం టెండర్లు కూడా పిలవలేదు. విజయనగరం కాలేజీకి రూ.500 కోట్లు అంచనా.. ఖర్చు రూ.84కోట్లు మాత్రమే. పాడేరు కాలేజ్‌కి రూ.500 కోట్లు అంచనా.. ఖర్చు రూ.116కోట్లు మాత్రమే. మొత్తంగా ఈ నాలుగు కాలేజీలకు అంచనా వ్యయం రూ.2100కోట్లు అయితే ఖర్చు చేసింది కేవలం రూ.212 కోట్లు..అంటే 10 శాతం మాత్రమే. ఈ స్థాయిలో అసలు పనులేం జరగక పోయినా జగన్ మాత్రం నేను అద్భుతం చేశానంటూ ప్రచారం చేస్తూ .. ఇప్పుడు ఏకంగా ఫొటోషూట్‌ల కోసం నర్సీపట్నం వెళుతున్నాడు. అక్కడ జగన్ ఏం చూపిస్తాడు. అక్కడున్నది ముళ్లకంచెల మధ్య నిలిచి న నిర్మాణాలే! వాటిలో ఐసీయూలు లేవు, క్లాస్‌రూములు లేవు, బోధన సదుపాయాలు లేవు. అలాంటి ముళ్లకంపల్లోనే ఇప్పుడు ప్రజలు ట్రీట్‌మెంట్ తీసుకుంటారా జగన్? ఇదేనా నీ నిర్వాకం. నువ్వు చూపించాల్సినది నర్సీపట్నం కాదు, నీ రిషికొండ ప్యాలెస్ నే! అదే నీ నిజమైన అద్దం. తెలుసా నేడు పేద విద్యార్థులు చదవడానికి కాలేజీలు పూర్తి కాకపోయినా, జగన్ మాత్రం ప్రజల డబ్బుతో తన కోసం స్నానాల ప్యాలెస్ కట్టించుకున్నాడు. అదే రిషికొండ ప్యాలెస్. దానికి మాత్రం రూ.500 కోట్లు ఖర్చు చేశాడు. అందులో మసాజ్ టేబుల్లు, స్నానాల తొట్టెలు, లక్షల కబోర్డులు.. అబ్బో చూడ్డానికి రెండు కళ్లూ చాలవు. ఎందుకంటే జగన్ వాటికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తాడు మరి. ప్రజలు మొన్న ఎన్నికల్లో నీ అహంకారానికి, నీ అవినీతికి సరైన సమాధానం ఇచ్చారు. అయినా సిగ్గు లేకుండా మాట్లాడుతున్నా వా జగన్. అన్నట్టు పీపీపీ విధానం చాలా దుర్మార్గమని నేడు చెప్పే జగన్, ఆరోగ్యశ్రీ ప్రారంభించినప్పుడు తన తండ్రి వైఎస్ కూడా పీపీపీ మోడల్‌లోనే ప్రైవేట్ హాస్పిటల్స్‌తో ఒప్పందాలు చేసుకున్నారని తెలుసుకోవాలి. అప్పుడు అది మంచి మోడల్. ఇప్పుడు చంద్ర బాబు చేస్తే మాత్రం చెడ్డదట! ఇంకా వాస్తవం ఏంటంటే, జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2021-22లో తానే స్వయంగా రాష్ట్రవ్యాప్తంగా 16 మెడికల్ హబ్బులు పీపీపీ మోడల్‌లో నిర్మిం చడానికి టెండర్లను పిలిచాడు. 13 ఉమ్మడి జిల్లాలు, 3 కార్పొరేషన్లు కలిపి మొత్తం 16 లొకేషన్లు.. ఇవన్నీ పీపీపీ పద్ధతి లో చేద్దాం.. రండి నిర్మిద్దాం.. అంటూ జగన్ టెండర్లను పిలిచినా ఒక్కరు కూడా రాలేదు. ఎందుకంటే పెట్టుబడిదారులు అడిగిన మొదటి ప్రశ్న "మా జె టాక్స్ ఎంత కడతావ్ జగన్? అని. కానీ జగన్ తాడేపల్లిలో కూర్చొని వ్యాపారులను బెదిరిస్తే, ఎవరు వస్తారు పెట్టుబడులు పెట్టడానికి? ఇదే నమ్మకం కోల్పోయిన జగన్ పాలన ఫలితం. ఇక ఇప్పుడు చంద్రబాబు గారు ప్రారంభించిన పీ4 పథకానికి రాష్ట్రవ్యాప్తంగా అద్భుత స్పందన వస్తోంది. ఇది చంద్రబాబు గారి ఇమేజ్, క్రెడిబిలిటీ, విజన్ ఫలితం. అంతేకాక ఎయిర్‌బస్, టీసీఎస్, విశాఖ పట్నం ఇన్వెస్టర్లు ముందుకు వస్తున్నారు ఎందు కంటే వారికి చంద్రబా బు నాయకత్వంపై, విశ్వసనీయతపై నమ్మకం ఉంది. పేదవాడికి మెరుగైన వైద్యం అందించాలన్న ఆలోచన చంద్రబాబుదే. పేద విద్యార్థులకు మెడికల్ ఎడ్యుకేషన్ చేరువ చేయడమే ఆయన ధ్యేయం. పేదరికం లేని సమాజం కోసం ఆయన కృషి చేస్తుంటే జగన్ మాత్రం పాపాల బురదలో మునిగి పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేశావు జగన్. నీ నిర్వాకం, నీ అవినీతి పాలన... ఇవే నీ ఓటమికి కారణం అని తెలుసుకోవాలని హితవుపలికారు.

# అంబేద్కర్ విగ్రహాలతో రాజకీయమా?

- ధ్వంసం చేసి ప్రభుత్వంపై బురదజల్లుతారా?
- దళితులను వేధించి చంపి నేడు నాటకాలా?
- జిత్తులమారిన నక్క..ఊసరవెల్లి జగన్‌రెడ్డి
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య



మంగళగిరి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వంపై అక్కసుతో జగన్‌రెడ్డి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడిన ఆయన.. రాజ్యాంగం ప్రకారం ఎన్నికైనా కూటమి ప్రభుత్వాన్ని జగన్ అస్థిరపరచాలని చూస్తున్నారని మండిపడ్డారు. నదిలో కొట్టుకు పోయిన వ్యక్తి ఊత సాయంతో ఎలా బయటపడాలని చూస్తాడో.. జగన్‌రెడ్డి తీరు అలా ఉందని ఎద్దేవా చేశారు. దళిత వర్గాలపై ఆయనకు ఎలాంటి ప్రేమ లేదన్నారు. దళితవర్గాలను మభ్యపె ట్టాలని చూస్తున్నారని.. ఓసారి సక్సెస్ అయ్యి మరోసారి బొక్క బోర్లా పడ్డారని అన్నారు. అంబేద్కర్‌పై జగన్‌రెడ్డికి అసలు ప్రేమ లేదన్నారు. అంత ప్రేమ ఉంటే రూ.400 కోట్లు ఖర్చు చేసి విజయవాడలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన వైసీపీ ప్రభు త్వం.. తాడేపల్లిలో ఇంట్లో ఉండి జగన్‌రెడ్డి ఆ విగ్రహాన్ని ప్రారంభి స్తారా? పోలీసుస్టేషన్‌లో దళితులకు శిరోముండనం చేస్తే.. ఏం చేశారని ప్రశ్నించారు. కిరణకుమార్ మాస్క్ పెట్టుకోలేదని పోలీసు లు తరిమి తరిమి చంపితే ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. మీ స్వంత నియోజకవర్గంలో దళిత మహిళ నాగమ్మపై దాడి జరి గితే మౌనంగా ఎందుకు ఉన్నారు. దళితుడైన ప్రతాప్ లిక్కర్ తాగి ప్రభుత్వాన్ని ద్వేషించాడని చంపేశారు. ఆయన ఫోన్ కూడా ఇప్పటివరకు బయటకు రాలేదు.

కొవ్వూరులో దళితుడిని చంపారు. మాదిగ వర్గానికి చెందిన వ్యక్తిపై బేడీలు వేసి ఊరు మొత్తం తిప్పా రని మండిపడ్డారు. చిత్తూరు జిల్లాలో అంబేద్కర్ విగ్రహం ప్రమాద వశాత్తు కాలిపోతే అక్కడ స్థానిక సర్పంచ్ రాజకీయం చేయాల నుకున్నాడని మండిపడ్డారు. ఈ కుట్రలో జగన్ భాగస్వామి.. జగనే స్క్రిప్ట్ రాసినట్లు ఆరోపించారు. కూటమి ప్రభుత్వాన్ని అస్థిర పరచాలని జగన్ చూస్తున్నారని మండిపడ్డారు. జగన్ మరోసారి సీఎం అవుతాడనుకోవడం కల అని పేర్కొన్నారు. ప్రజా విశ్వాసా న్ని వైసీపీ కోల్పోయిందన్నారు. దళితులను మభ్యపెట్టడానికి అంబేద్కర్ విగ్రహాలను పావులుగా వాడుకుంటున్నారన్నారు. ఐదేళ్లు కూటమి ప్రభుత్వాన్ని జగన్ కదిలించలేడని మండిపడ్డారు. ప్రజలకు జగన్ కుయుక్తులు తెలుసునని.. జిత్తులు మారిన నక్కలాంటి.. రంగులు మార్చే ఊసరవెల్లి జగన్‌రెడ్డి అని మండిప డ్డారు. చంద్రబాబు నాయకత్వంలో దళితులు ప్రశాంతంగా ఉన్నారని పేర్కొన్నారు.

# వైసీపీ నాయకుడి భూ దందాపై ఫిర్యాదు

**ములకచెరువులో నేతల దౌర్జన్యం**

**డబ్బివ్వకుంటే ఇల్లు కూల్చేస్తామంటున్నారు**

**ప్రజావినతుల కార్యక్రమంలో బాధితుల గోడు**

మంగళగిరి (చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండ లం భీమవరప్పాడు గ్రామానికి చెందిన శివయ్య టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో తన సమస్యను వివరించాడు. తమ గ్రామంలో తమకు సర్వే నెం.18లో జమ్మికుంట చెరువు ఉంది. దీనిలో నలబావుల నాగేశ్వరరావు అనే వైసీపీ నాయకుడు సుమారు మూడెకరాలు కబ్జా చేసి గత ప్రభు త్వంలో పామాయిలు మొక్కలు వేశాడు. దీనిపై సంబంధిత అధికా రులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరిం చాలని కోరారు. నేతలు ఏపీ వడ్డెర వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వరరావు, ఏపీ నాగవంశం వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రామనారాయణ అర్జీలు స్వీకరించారు.

**వైసీపీ నాయకుల దౌర్జన్యం**

అన్నమయ్య జిల్లా ములకచెరువుకు చెందిన రవణమ్మ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నెం. 517లో 24 కుంటల భూమి గత 30 ఏళ్లుగా తమ స్వాధీనంలో ఉంచు కుని దానిలో తమ నివాసం, రేకుల షెడ్లు, పక్కా భవనలు నిర్మిం చుకున్నాం. రేకుల షెడ్లు ఒకటి ప్రైవేట్ స్కూల్ కు రెండవది బీసీ హాస్టల్ కు, మరొకటి హౌసింగ్ గోడౌన్‌కు బాడుగకు ఇచ్చాం. ప్రభుత్వం హాస్టల్ బిల్డింగ్‌కు రెంటు కూడా ఫిక్స్ చేసి తమకు చెల్లిస్తుంది. కానీ గత నాలుగైదు నెలల నుంచి ఈ భూమి తమది ఖాళీ చేయాలని వైసీపీ నాయకులు శేఖర్‌రెడ్డి, గోవింద్ భాస్కర్ రెడ్డి, ఆవల రాజశేఖర్‌లు ఒత్తిడి తెచ్చారు. తాము నిర్మించిన నిర్మా ణాలను జేసీబీలతో కూల్చి తమని చంపేస్తామని బెదిరిస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.

**ఇల్లు కూలుస్తామని బెదిరింపులు**

చిత్తూరు జిల్లా సదుం గ్రామానికి చెందిన భూదేవి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. గతంలో ప్రభుత్వం వారు తమ ఇంటి స్థలం మంజూరు చేశారు. అందులో ఇల్లు కట్టుకొని చిన్న దుకా ణం పెట్టుకొని జీవనం సాగిస్తున్నాను. కానీ ట్రాక్ బాబు, మౌళి అనే వ్యక్తులు వచ్చి ఇంటి స్థలం తమది అంటూ దౌర్జన్యం చేసి చిల్లర దుకాణాన్ని ధ్వంసం చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాను కోర్టులో వేసి స్టే కూడా తెచ్చుకున్నాను. అయినా వారు మళ్లీ వచ్చి ఇంటి స్థలం తమది వదిలిపెట్టిపోవాలని జేసీబీతో ఇంటిని కూల్చేస్తామని బెదిరిస్తున్నారు. లేకపోతే రూ.4 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.



**స్థలానికి దారి చూపాలి**

అన్నమయ్య జిల్లా కలికిరి గ్రామానికి చెందిన శ్రీనివాసులు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. 21 సంవత్సరాలు బీఎస్ ఎఫ్‌లో పనిచేసి 2009లో రిటైర్ అయ్యాను. రిటైర్‌మెంట్ తరువా త ప్రభుత్వం ఇంటి స్థలంతో పాటు పారపట్ల గ్రామంలో సర్వే నంబర్ 508లో 5 ఎకరాల భూమి తమకు కేటాయించింది. అయితే సర్వే నంబర్ 633లో ఉన్న రాస్తా పోరంబోకు భూమి మీదుగా తమ స్థలానికి వెళ్లే రోడ్డు ఉంది. ఇప్పుడు కొందరు వ్యక్తులు ఆ రాస్తాలో సుమారు 1.70 సెంట్ల భూమికి కట్ట వేసి తమ రాకపోకలు ఆపుతున్నారు. తాము వెళ్లి అడిగితే ఇది రాస్తా కాదు, పోరంబోకు అంటూ గొడవ చేస్తున్నారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు లేవు. తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

# ప్రభుత్వ ఉద్యోగులపై జగన్‌రెడ్డి మొసలి కన్నీరు

- వారికి చేసిన గాయాలు ఇంకా మానలేదు
- ఉపాధ్యాయులను వేధించుకుతిన్నారు
- నేడు దొంగ ప్రేమ ఒలకబోస్తున్నాడు
- బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ విజయ్‌కుమార్




మంగళగిరి (చైతన్యరథం): జగన్‌రెడ్డి ఐదేళ్ల తరువాత ఉద్యోగు లపై మొసలి కన్నీరు కారుస్తున్నారని ఏపీ బయో డైవర్సిటీ బోర్డు చైర్మన్, నీలాయపాలెం విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో మాట్లాడుతూ నూరు ఎలుకలను తిన్న పిల్లిలా జగన్‌రెడ్డి ఉపాధ్యాయుల పట్ల వ్యవహరిస్తున్నారు. 2014లో టీడీపీ అధికా రంలోకి వచ్చిన తరువాత 43 శాతం పీఆర్సీ ఇవ్వడం జరిగింది. జగన్ 21 శాతానికి తగ్గించారు. ఇప్పుడు జగన్ ఉద్యోగుల గురిం చి మాట్లాడం విడ్డూరంగా ఉంది. ఒక్కొక్క యూనియన్ నాయకు లను, ఉద్యోగులను హౌస్ అరెస్ట్ చేసిన చరిత్ర జగన్ రెడ్డి మర్చి పోయి మాట్లాడుతున్నాడు. పీఎఫ్ నిధులను దోచుకుని ప్రశ్నించిన సూర్యనారాయణను చంపేస్తామని బెదిరించి రాష్ట్ర వదలి వెళ్లిపో యే పరిస్థితి తీసుకొచ్చిన క్రిమినల్ చరిత్ర వైసీపీ నాయకులది. కరోనా సమయంలో మాస్కు అడిగినందుకు డాక్టర్ సుధాకర్ ను చేతులు విరిచిన మీరు ఉద్యోగుల గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు ఉందా? ప్రభుత్వం ఉపాధ్యాయులకు వైన్ షాపుల దగ్గర డ్యూటీలు వేసి తలదించుకునే పరిస్థితి తీసుకొచ్చింది జగన్ రెడ్డి కాదా.? ప్రభుత్వ ఉద్యోగులు చేసే పనులను వాలంటీర్లు చేసినట్లు చెప్పి ప్రభుత్వ ఉద్యోగులను అవమానించారు.. గత ఐదేళ్ళ వైసీపీ నాయకులు ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేసిన సందర్భంలో ఏనాడు జగన్ ప్రశ్నించలేదు. వైజాగ్ భూ మాఫియా ఎంఆర్‌ఓని హత్య చేస్తే వారిపై చర్యలు తీసుకున్నారా? అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తానని అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి సీపీఎస్ రద్దు చేశారా? భూ మాఫియా నుంచి కల్తీ లిక్కర్ మాఫియా వరకు ఉద్యోగులను జైలు పాలు చేసింది జగన్ రెడ్డి కాదా.? ఈ రోజు సడన్‌గా ఉద్యోగులపై జగన్ ప్రేమను ఒలకబోస్తున్నాడు. ఒక డీఎస్సీ ఉద్యోగం నియామకం చేపట్టకుం డా వరల్డ్ బ్యాంక్ ఒప్పందంతో నాడు–నేడు పేరుతో వేల కోట్లు దోచుకున్నారు. 15 నెలల్లోనే మెగా డీఎస్సీ ద్వారా 16 వేల టీచ ర్ల పోస్టులు భర్తీ చేశాం. ఉద్యోగులపై సీబీఐ గూడచారి మాదిరి ప్రవీణ్ ప్రకాశ్‌ను నియమించి ఉపాధ్యాయులకు నరక యాతన చూపించిన ఘనత జగన్‌రెడ్డిది.. నేడు జగన్ ఆస్కార్ లెవెల్‌లో ఉద్యోగులపై దొంగ ప్రేమ చూపిస్తున్నాడు. ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులకు డ్యూటీ వద్దని చెప్పిన వ్యక్తి జగన్‌రెడ్డి కాదా? గత ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఎప్పుడు వస్తాయో కూడా తెలియదు. టీచర్లకు ఇంత జీతాల అని వారిని అవమా నించింది జగన్‌రెడ్డి కాదా? నేడు కూటమి ప్రభుత్వంలో ఒకటో జీతాలు ఇవ్వడం జరుగుతోంది. వైసీపీ హయాంలో ఐబీ పేరుతో రూ.28 వేల కోట్లు అవినీతి చేశారు. ఉద్యోగులకు మాయమాటలు చెప్పి వారి రెచ్చగొట్టాలని చూస్తున్నారు.. జగన్ మాయలో ఉద్యోగు లు పడ్డారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అన్నింటిని అమలు చేస్తోంది. కస్తూర్బా గాంధీ గిరిజన పాఠశాలల్లో 729 నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేశాం. జూనియర్ కాలేజీల్లో 700 సిబ్బంది నియామకాలను భర్తీ చేశాం. 700 కోయ భారత్ టీచర్ల పోస్టులు భర్తీ చేశాం..476 ప్రభుత్వం జూనియర్ కాలేజీల్లో 3619 కాంట్రాక్ట్ సేవలు పునరుద్ధరించటం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 117 జీవోను రద్దు చేశాం.. ఉద్యోగులపై వైసీపీ హయాంలో పెట్టిన క్రిమినల్ కేసులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కేసులు ఎత్తివేశాం. సాల్ట్ ద్వారా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం జరుగుతోంది. గత వైసీపీ ఉపాధ్యాయులకు 18 యాప్‌లు పెట్టారు..ఇప్పుడు ఒకే యాప్ అమలు చేయడం జరుగుతోంది. ఉద్యోగులను అన్ని విధాలుగా అందుకునేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో పెట్టుబడులకు ఏరో కంపెనీ ఆసక్తి

- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసిన ప్రతినిధులు - ప్రతిపాదనలతో వస్తే సహకరిస్తామని హామీ




అమరావతి (చైతన్యరథం): సచివాలయంలో ఆర్ అండ్ బీ శాఖ కార్యాలయంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని నల్వా ఏరో ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. దేశంలో మొదటి 5 సీటర్ ఎలక్ట్రిక్ వర్టికల్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్ విమానాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు నల్వా ఏరో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వ్యవస్థాపకులు కుల్జిత్ ఎస్.సంధూ తెలిపారు.

దేశంలో మొదటి 5 – సీటర్ ఫ్లైట్‌కు డీజీసీఏ నుంచి డిజైన్ ఆర్గనైజేషన్ అప్రూవల్ పొందిన ఏకైక సంస్థ తమదని వివరించారు. ఈ అధునాతన ఎయిర్ మొబిలిటీ కోసం లాంగ్–రేంజ్ ప్యాసింజర్ ఈవీటోల్ విమానాలను తయారు చేయాలనే లక్ష్యంతో సంస్థ పనిచేస్తున్నట్లు తెలిపారు. ఆర్‌అండ్‌డీ సెంటర్, ప్రోటో టైప్ డెవలప్‌మెంట్ యూనిట్, ఈవీటోల్ విమానాల కోసం పూర్తిస్థాయి తయారీ సౌకర్యం, ఈవీ టోల్ పైలెట్ల కోసం ప్రపంచ స్థాయి ఫ్లయింగ్ శిక్షణ సంస్థలు ఏర్పాటుకు దాదాపు 100 ఎకరాల భూమి అవసరమని కోరింది. అనంతపురం పరిసర ప్రాంతాల్లో తమ సంస్థ ఏర్పాటుకు ఆసక్తి వ్యక్తం చేసింది. రాష్ట్రంలో ప్రపంచ స్థాయి ఏరోస్పేస్ ఏకోసిస్టమ్ కల్పనకు రాబోయే 10 ఏళ్లలో దాదాపు రూ. 800 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పూర్తి స్థాయి ప్రతిపా దనలతో ముందుకు వస్తే ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహకరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# ప్రధాని పర్యటనపై మంత్రి సమీక్ష

- ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలి
- ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశం



అమరావతి (చైతన్యరథం): ప్రధాని పర్యటన ఏర్పాట్లపై కర్నూలు జిల్లా కలెక్టర్ ఎ.సిరి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ, ఈఈలతో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు. ఎక్కువగా ట్రాఫిక్ ఉండే ప్రాంతాలను ముందస్తుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో భారీగా ప్రజలు తరలి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆర్ అండ్ బీ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శ్రీశైలంలో ప్రధాని పర్యటన నేపథ్యంలో స్థానికంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. స్థానికంగా రహదారుల మరమ్మతులను వేగవంతంగా పూర్తి చేయాలని, అవసరమైతే, ఇతర జిల్లాల ఆర్ అండ్ బీ అధికారుల ను ఉపయోగించుకుని సమర్థవంతంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

# పశు శాలల పర్యవేక్షణకు కమిటీ

- ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

- మచిలీపట్నంలో గోశాల సందర్శించిన మంత్రి



మచిలీపట్నం (చైతన్యరథం): మచిలీపట్నం రహదారులపై పశు వులతో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకు న్నామని గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బుధవారం ఉదయం మచిలీపట్నం వ్యవసా య మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన గోశాలను సందర్శించి విధి విధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మచిలీపట్నం మున్సిపల్ పరిధిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న పశువులను నియంత్రిం చేందుకు గత ఆగస్టులో పశువుల శాల ఏర్పాటు చేసినట్లు తెలిపా రు. ఇప్పటివరకు 326 పశువులను పశువులశాలలో ఉంచగా, వాటిలో 269 పశువులను యజమానులు రుసుం చెల్లించి తిరిగి తీసుకెళ్లారని వివరించారు. అయితే 16 పశువులు తీవ్ర అనారో గ్యంతో చనిపోయినట్లు మంత్రి తెలిపారు. వాటికి నిర్వహించిన పోస్టుమార్టం నివేదికలో కడుపులో కుళ్లిపోయిన ప్లాస్టిక్ కవర్లు, జీర్ణం కాని ఆహారం ఉన్నట్లు తెలిసిందని చెప్పారు. ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. పశువుల శాల కార్యకలా పాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా పశువుల హాస్టళ్లు ఏర్పాటు చేయాలని ముఖ్యమం త్రి చంద్రబాబు నిర్ణయిం చారని, ఇందుకోసం భూముల కేటాయింపు, నిధుల విడుదల త్వరలోనే జరుగుతాయని వివరించారు. రోడ్లపై సంచరిస్తున్న పశు వులను సేకరించి గోశాలలో ఉంచే చర్యలు నిరంతరంగా కొనసా గుతాయని మంత్రి స్పష్టం చేశారు. ఈ పర్యటనలో మంత్రి వెంట మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, మార్కెటింగ్ ఏడీ నిత్యానందం, సహాయ మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), కార్పొరేటర్లు మరకాని సమతా కీర్తి, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ జెడ్పిటిసి లంకె నారాయణ ప్రసాద్ స్థానిక నాయకులు లోగిశెట్టి స్వామి, కోస్తా మురళి తదితర అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

# కొండపి నియోజకవర్గానికి వెలుగొండ జలాలు

- డీపీఆర్ సిద్ధం చేయాలని మంత్రి స్వామి ఆదేశం



కొండపి(చైతన్యరథం): వెలుగొండ జలాలు కొండపి నియోజక వర్గానికి తీసుకొచ్చేందుకు అవసరమైన డీపీఆర్ సిద్ధం చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి సంబంధిత అధికారులను ఆదే శించారు. బుధవారం టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ అధికారులతో మంత్రి స్వామి సమీక్షించారు. మంత్రి స్వామి కృషితో వెలుగొండ నుంచి పునుగోడు రిజర్వాయర్ ద్వారా కొండపి ప్రాంతంలోని పాలేరు పరివాహక ప్రాంతంలోని చెరువులకు 1.06 టీఎంసీల నీటిని ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ఇటీవల అనుమతులు ఇచ్చింది. వెలుగొండ పూర్తయ్యాక ఆ నీటిని తూర్పు ప్రధాన కాలువ ద్వారా పునుగోడు రిజర్వాయర్ నుంచి కాలువ ద్వారా నియోజకవర్గంలోని చెరువులకు తీసుకొచ్చేందుకు డీపీఆర్ సిద్ధం చేయాలని మంత్రి డోలా ఆదేశించారు.

# నర్సీపట్నం పర్యటనలో కనువిప్పు కలగాలి

- మెడికల్ కాలేజీల్లో జగన్ నిర్లక్ష్యం తెలుసుకోవాలి
- రూ.500 కోట్లలో ఖర్చు చేసింది రూ.10 కోట్లే
- 2025-26లో 150 ఎంబీబీఎస్ ప్రవేశాలు ఎలా సాధ్యమో ప్రజలకు జగన్ వివరించాలి
- తన తప్పును గ్రహించి క్షమాపణ చెప్పాలి
- అధికారంలో ఉన్నంతకాలం వినాశనం
- 11 సీట్లకు పతనమైనా మారని తీరు
- ఈ 10 ప్రశ్నలకు జవాబు చెప్పగలరా?
- వైద్యఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్
- మెడికల్ కాలేజీల నిర్మాణాలపై చర్చకు సవాల్



అమరావతి (చైతన్యరథం): జగన్‌రెడ్డి గురువారం నర్సీపట్నం పర్యటన సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణం విష యంలో వైద్యఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ వాస్తవాలు వివరిస్తూ ధ్వజమెత్తారు. ఈ పర్యటన జగన్‌రెడ్డికి కనువిప్పు కావా లని హితవుపలికారు. అధికారంలో ఉన్నప్పుడు నిర్మాణాలు ప్రారం భమైన ఏ ఒక్క కాలేజీనీ ఎన్నడూ సందర్శించని, నత్తనడకన సాగిన పనుల తీరును ఏనాడూ సమీక్షించని మాజీ సిఎం నర్సీ పట్నం కాలేజీ పనుల తీరును స్వయంగా చూసి, తన నిర్వాకాన్ని గమనించి చెంపదెబ్బలేసుకుని, ఆ ప్రాంత ప్రజలకు క్షమాపణలు చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. ఆయన నిర్లక్ష్యం, నిర్వాకాల వల్లే కొన్ని కాలేజీల నిర్మాణాన్ని పీపీపీ విధా నంలో చేపట్టాల్సిన పరిస్థితి ఎదురైందని మంత్రి స్పష్టం చేశారు.

**జగన్ పర్యటనను ఆహ్వానిస్తున్నా..**

అధికారంలో ఉన్నంతకాలం వెనుకబడ్డ ప్రాంతమైన నర్సీ పట్నంలో చేపట్టిన వైద్యకళాశాల పనులను ఏనాడూ కనీసం సమీక్షించి వేగవంతం చేయాలని ఆదేశించని జగన్ ఇప్పుడు పర్య టించడాన్ని తాను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. భారీ ఓటమిని మూట కట్టుకున్న 16 నెలల తర్వాత చేపట్టిన ఈ పర్యటన ద్వారా వాస్తవాల్ని తెలుసుకుని ఆయనలో కనువిప్పు కలిగితే సంతోషిస్తా నని వెల్లడించారు. అయితే జగన్‌రెడ్డి మానసికంగా ఇందుకు పూర్తి గా భిన్నమని, అసత్యాలే ఆధారంగా రాజకీయం చేసి పబ్బం గడు పుకోవాలని చూసే ఆయనలో ఈ మార్పును ఆశించడం అత్యాశే అవుతుందని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నంతకాలం రాష్ట్ర విధ్వంసానికి అహర్నిశలూ కృషి చేసిన జగన్‌రెడ్డి ప్రతిపక్షంలో కూడా అదే తీరును కొనసాగించడం అత్యంత ఆందోళనకరమని మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. అతి తక్కువలో 10 ప్రభుత్వ వైద్య కళాశాలలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంటే...పిపిపి విధానంలో ఎవరూ పాల్గొనవద్దని హెచ్చరికలు చేయడం మాజీ సిఎం వికృత మానసికతకు అద్దం పడుతుందని మంత్రి తెలిపారు.

**జగన్ నిర్వాకానికి నర్సీపట్నం ప్రతీక**

రూ.500 కోట్ల వ్యయంతో నర్సీపట్నం వైద్య కళాశాల నిర్మా ణానికి మార్చి, 2021లో అనుమతించిన ఆయన జూన్, 2024లో అధికారం నుంచి వైదొలగే నాటికి ఈ కాలేజీ నిర్మాణా నికి కేవలం రూ.10.70 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, ఇది మొత్తం వ్యయంలో కేవలం 2.14 శాతం మాత్రమేనని వెల్లడించా రు. ఈ కాలేజీ అవసరాల కోసం మొత్తం 12.19 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉండగా.. జగన్‌రెడ్డి హయాంలో కేవలం 0.89 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో పనులు చేపట్టారని తెలిపారు. దీనికి భిన్నంగా ఈ కాలేజీ నిర్మాణ పనులను పీపీపీ విధానంలో శీఘ్రతరం చేసేందు కు వీలుగా కూటమి ప్రభుత్వం అవసరం మేరకు రూ.13.10 కోట్లు వెచ్చించిందని మంత్రి తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో నర్సీపట్నం వైద్య కళాశాలలో 150 ఎంబీబీఎస్ ప్రవేశాలు కల్పిస్తామని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారని, అయితే ఈ లక్ష్యానికనుగుణంగా కృషి చేయలేదని ఎత్తిచూపారు. తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో 2024-25లో ప్రవేశా ల కల్పనకు నిర్మాణ వ్యయం రూ.500 కోట్లలో రూ.400 కోట్లు వెచ్చించిన జగన్‌రెడ్డి..నర్సీపట్నం కాలేజీలో మరుసటి సంవత్సరం లోనే ప్రవేశాలు కల్పించాల్సి ఉన్నా కేవలం రూ.10.70 కోట్లు మాత్రమే వ్యయం చేయడాన్ని మంత్రి ప్రశ్నించారు. ఈ వ్యయం కూడా నాబార్డ్ నిధులతో చేశారని పేర్కొన్నారు.

ఇదే నిర్లక్ష్యం 2025-26లో ఒక్కో కాలేజీలో 150 ప్రవేశాలు జరగాల్సిన మిగతా 10 కాలేజీలకు సంబంధించి కూడా జరిగిం దని, తద్వారా సమీప భవిష్యత్తులో ఈ కాలేజీలు ఉనికిలోకి రాని దుస్థితి ఎదురైందని తెలిపారు. ఉత్తరాంధ్రలోని పార్వతీపురం కళాశాల రూ.600 కోట్లతో నిర్మించాల్సి ఉన్నా, జగన్‌రెడ్డి తాను అధికారంలో ఉన్నంతకాలం కనీసం భూసేకరణ కూడా జరగలే దని తెలిపారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం 2025-26లో 150 ప్రవేశాలు ఎలా కల్పిస్తుందని జగన్‌రెడ్డిని నిలదీశారు. 2022-23లో ప్రవేశాలు జరిగిన విజయనగరం వైద్య కళాశాల మొత్తం వ్యయం రూ.500 కోట్లలో జగన్ ప్రభుత్వం కేవలం రూ.110 కోట్లు మాత్రమే వ్యయం చేసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే ఈ కాలేజీపై రూ.71 కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు.

**ఈ 10 ప్రశ్నలకు జగన్‌రెడ్డి సమాధానం చెప్పగలరా?**

నర్సీపట్నం పర్యటిస్తున్న జగన్‌రెడ్డికి మంత్రి సత్యకుమార్ 10 ప్రశ్నలు సంధిస్తూ బహిరంగంగా వాటికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ 10 ప్రశ్నలకు బహిరంగంగా స్పందించి నర్సీపట్నం వైద్య కళాశాల, ఇతర కళాశాలల నిర్మాణ విషయం లో చర్చకు అంగీకరించాలని సవాల్ విసిరారు.

1) పులివెందుల మెడికల్ కాలేజీపై అత్యంత శ్రద్ధను కనబరిచిన మీరు నర్సీపట్నం, పార్వతీపురం కాలేజీల నిర్మాణాల్ని ఎందుకు పూర్తిగా నిర్లక్ష్యం చేశారు?

2) నర్సీపట్నం కాలేజీలో 2025-26లో 150 ఎంబీబీఎస్ ప్రవేశాలు కల్పిస్తామని మీరు ప్రజలకు హామీ ఇచ్చారా..లేదా?

3) ఆ మేరకు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన మీరు అధికారం నుంచి 2024లో వైదొలగే నాటికి కేవలం రూ.10.70 కోట్లు మాత్రమే వెచ్చించడం ఎంతవరకు సబబు? మీ అసమర్థతను కప్పిపుచ్చుకుంటూ కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సమంజసమా?

4) అధికారంలో ఉన్నప్పుడు ఏనాడైనా నర్సీపట్నం కాలేజీని సందర్శించారా? కాలేజీ నిర్మాణపు పనుల ప్రగతిని ఒక్కసారైనా సమీక్షించారా? అలా చేయకపోవడానికి కారణాలేంటి?

5) 2025-26లో ప్రవేశాల కల్పన దృష్ట్యా నర్సీపట్నం కాలేజీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఏనాడైనా అధికారులను ఆదేశించారా?

6) నర్సీపట్నం కాలేజీ నిర్మాణానికి పూర్తిస్థాయిలో పనుల ప్రగతి ఆధారంగా ఆర్థిక సహాయాన్ని చేయడానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ నాబార్డ్ అంగీకరించినా, మీ హయాంలో మూడే ళ్లలో కేవలం రూ.10.70 కోట్లు మాత్రమే ఖర్చు చేయడానికి కారణం మీ అసమర్థతా లేక ఆ ప్రాంత ప్రజలపై నిర్లక్ష్యమా?

7) ఏ లక్ష్యంతో నర్సీపట్నం మెడికల్ కాలేజీ పర్యటనకు సిద్ధమయ్యారు? వాస్తవాలను తెలుసుకోవడానికి లేక అసత్యా లను కొనసాగించడానికా?

8) మీ నిర్వాకంతో కుదేలైన నర్సీపట్నం వైద్య కళాశాల నిర్మాణానికి కూటమి ప్రభుత్వాన్ని ఏ విధంగా బాధ్యులు చేయగలరు? రాష్ట్రంలో ప్రభుత్వ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ సీట్ల వార్షిక ఫీజును రూ.12 లక్షలకు, ఎన్నారై సీట్ల ఫీజును రూ.20 లక్షలకు పెంచినది ఎవరు? విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు 17 కాలేజీల నిర్మాణం కేవలం ప్రభుత్వ నిధు లతోనే సాధ్యం కాదని ఆనాడు మీరు చెప్పారా లేదా?

9) పీపీపీ పద్ధతిలో నర్సీపట్నం కళాశాలలో వైద్య విద్యను ఆశించే వారికి ఏ విధంగా నష్టం కలుగుతుంది? పీపీపీ విధా నంలో మన విద్యార్థులకు సీట్ల లభ్యత పెరిగే వాస్తవాన్ని కాదనగలరా?

10) వాస్తవాలు తెలుసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పగలిగే ఆత్మశుద్ధి, మనోధైర్యం మీకున్నాయా?

# మత్స్య సంపద పరిరక్షణకు సహకరించాలి

- రింగు వలల వినియోగం వద్దు
- చట్ట ప్రకారం నడుచుకోవాలి
- ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర
- రెండు జిల్లాల మత్స్యకారులతో సమావేశం



అమరావతి (చైతన్యరథం): మత్స్య సంపదను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి మత్స్యకారుడిపైనా ఉందని గనులు, భూగర్భ వనరు లు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రింగు వలల వినియోగంపై గోదావరి జిల్లాలు, కృష్ణా జిల్లా మత్స్యకారుల మధ్య సయోధ్య కుదర్చడమే లక్ష్యంగా ఇరు వర్గాలతో సమావేశం నిర్వ హించారు. రింగ్ వలల వినియోగంపై ఎప్పటి నుండో వివాదాలు ఉన్నాయని, ప్రభుత్వం నుంచి వలల వినియోగంపై స్పష్టమైన ఆదేశాలు వచ్చే వరకు రింగ్ వలలను వినియోగించొద్దని సూచిం చారు. విదేశాలకు ఎగుమతి చేసే సదుపాయం ఉండడంతో కాకినాడ, ఉప్పాడ తదితర ప్రాంతాల్లోని మత్స్యకారులు రింగు వలలతో వేట సాగిస్తున్నారన్నారు. సంప్రదాయ మత్స్యకారులు ఒక సారి వేటకు వెళ్తే 100 కిలోల చేపలు రావడం కష్టమేనని, రింగు వలల వినియోగంతో చిన్న చిన్న చేపల నుంచి పెద్ద చేపల వరకు అన్ని రకాల చేపలు టన్నుల్లో వేటాడుతున్నారన్నారు. ఫలితంగా భవిష్యత్తులో ఈ ప్రాంతంలోని మత్స్యకారులు జీవనోపాధి కోల్పో యే అవకాశం నెలకొందని పేర్కొన్నారు. రింగు వలలు లేకుండా వేటాడుకోవడానికి ఎవరికీ ఎలాంటి అభ్యంతరమూ లేదని కృష్ణా జిల్లా మత్స్యకార సంఘం నాయకులు పేర్కొన్నారు. ఉప్పాడ ప్రాంత మత్స్యకారులు రింగు వలల వినియోగం చట్టబద్ధమేననీ, వలల వినియోగంలో ఎక్కడా ఉల్లంఘనలకు పాల్పడడం లేదని తెలిపారు. ఫిషరీస్ కమిషనర్ రామనాయక్ మాట్లాడుతూ రింగ్ వలల వినియోగంతో ప్రకృతి సమతుల్యం దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ డీఎఫ్‌వో కృష్ణారా వు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీకి రెండు రోజులు వర్షాలు



అమరావతి(చైతన్యరథం): దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి మన్నార్ గల్ఫ్ వరకు, తెలంగాణ, రాయలసీమ, తమిళనాడు ప్రాంతాల మీదుగా సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో ఉత్తరాంధ్ర, రాయల సీమ జిల్లాల్లో రెండు రోజుల పాటు పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ప్రజలు చెట్ల కింద నిలబడరాదని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## ఐదు వర్శిటీలకు వీసీల నియామకం

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలోని ఐదు విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులను నియమిస్తూ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆచార్య నాగార్జున వర్సిటీ వీసీగా వెంకటసత్యనారాయణరాజు సమంతపుడి, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం వీసీగా తాతా నర్సింగరావు, వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ వర్సిటీ వీసీగా బి జయరామిరెడ్డి, జేఎన్టీయూ (విజయనగరం) వీసీగా వి వెంకటసుబ్బారావు, యోగి వేమన విశ్వవిద్యాలయం (కడప) వీసీగా రాజశేఖర్ బెల్లంకొండ నియమితులయ్యారు.

## సుధాకర్ కుటుంబానికి క్షమాపణ చెప్పాలి

- లేకుంటే జగన్ పర్యటనను అడ్డుకుంటాం
- దళిత సంఘాల తీవ్ర హెచ్చరిక

నర్సీపట్నం (చైతన్యరథం): డాక్టర్ సుధాకర్ కుటుంబానికి జగన్‌రెడ్డి క్షమాపణ చెప్పకుంటే నర్సీపట్నం పర్యటనను అడ్డు కుంటామని దళిత సంఘాలు హెచ్చరించాయి. జగన్ నర్సీ పట్నంలో అడుగు పెట్టే ముందు దివంగత డాక్టర్ సుధాకర్ తల్లికి, వారి కుటుంబసభ్యులకు క్షమాపణ చెప్పాలని దళిత సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. డాక్టర్ సుధాకర్ మరణానికి జగన్‌రెడ్డే కారణమని, ఇది ప్రపంచానికి తెలిసిన నిజమని తెలిపారు. ఒక మాస్క్, పీపీఈ కిట్ అందించలేక డాక్టర్ సుధాకర్‌ను బలిగొన్న మీరు.. ఇప్పుడు నర్సీపట్నంలో మెడికల్ కాలేజీ కడతానంటే ప్రజలు నమ్మరని విమర్శించారు. ఒక వైద్యుడి ప్రాణాలనే కాపాడలేని వారు మెడికల్ కాలేజీ ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. డాక్టర్ సుధాకర్‌కు జరిగిన అన్యాయం పై, ఆయన మృతిపై ఇంతవరకు న్యాయం జరగలేదని దీనిపై వెంటనే సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

# తిరుపతిలో జాతీయ సహకార వర్క్‌షాప్

**సహకార రంగ అభివృద్ధి, డిజిటలైజేషన్‌పై చర్చ - పాల్గొన్న సహకార మంత్రిత్వశాఖ కార్యదర్శి**



తిరుపతి(చైతన్యరథం): భారత ప్రభుత్వం సహకార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి రెండురోజుల వర్క్ షాప్ బుధవారం ఉదయం తిరుపతి తాజ్ హోటల్‌లో ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వ సహకార శాఖతో కలిసి సహకార రంగం అభివృ ద్ధి-డిజిటలైజేషన్, గ్రైన్ స్టోరేజ్, పీఏసీఎస్ విస్తరణ, కో ఆపరేటివ్ బ్యాంకింగ్ బలపరిచే దిశగా అనే అంశంపై వర్క్‌షాప్ జరుగు తుంది. రాష్ట్ర సహకార కమిషనర్, సహకార సంఘాల రిజిస్ట్రార్ ఎ.బాబు, భారత ప్రభుత్వ సహకార మంత్రిత్వశాఖ కార్యదర్శి అశీష్‌కుమార్ భూటాని, అదనపు కార్యదర్శులు పంకజ్ కుమార్ బన్సాల్, రవీంద్రకుమార్ అగర్వాల్, సంయుక్త కార్యద ర్శులు ఆనంద్‌కుమార్ ఝా, రమణ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. సహకార మంత్రిత్వశాఖ కార్యదర్శి అశీష్‌కుమార్ భూటాని మాట్లాడుతూ అంతర్జాతీయ సహకార దినోత్సవానికి సంబంధించిన ఈ సంవత్సరం ముగింపు దశలో ఉన్నామని, ఈ సందర్భాన్ని పురస్క రించుకుని ఎన్నో కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఏ రాష్ట్రంలో ఏమి జరిగింది, ఇంకా ఏమి చేయాలి అన్న దానిపై సమీక్ష ఉం టుందన్నారు. ఇందులో బెంచ్ మార్కింగ్, నేర్చుకున్న పాఠాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చ జరుగుతుందన్నారు. త్రిభువన్ శేఖర్ విశ్వవిద్యాలయం ప్రారంభమై సెప్టెంబర్ 1 నుంచి తరగతులు మొదలయ్యాయని, రాష్ట్రాలలో సహకార విద్యా వ్యవస్థను ఎలా అనుసంధానించాలో, పాఠశాలలు ఎలా స్థాపించాలో ఈ విషయా లపై చర్చించనున్నామన్నారు. పాలు, డెయిరీ రంగంలో కొన్ని రాష్ట్రాలు అమూల్ మోడల్‌ను అనుసరిస్తూ మంచి కార్యక్రమాలు చేపట్టాయని, వాటిని ప్రెజెంటేషన్ల రూపంలో చూడడం జరుగు తుందని, కేంద్రం కంటే రాష్ట్రాల గొంతుకను ఎక్కువగా వినాలన్న దే ఈ వర్క్‌షాప్ ఉద్దేశమన్నారు. ఈ వర్క్‌షాప్ అనంతరం మీ అందరికీ ఒక డాక్యుమెంట్ పంపిస్తామన్నారు. ఇందులో వచ్చే మూడు నెలల కార్యాచరణకు మార్గదర్శకంగా ముఖ్యమైన అంశా లు ఉంటాయన్నారు. రాష్ట్ర సహకార కమిషనర్, సహకార సంఘాల రిజిస్ట్రార్ ఎ.బాబు మాట్లాడుతూ గ్రెయిన్ స్టోరేజ్ ప్రాజెక్ట్ కింద నిర్మిస్తున్న గోదాములు గ్రామీణ నిల్వ మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నాయన్నారు. సహకార సంస్థలు ఇకపై కేవలం రైతుల రుణ అవసరాలను మాత్రమే తీర్చడం కాదని, అవి ఆరోగ్య సేవలు (జన ఔషధి కేంద్రాలు), ఆహార ప్రాసెసింగ్, డ్రోన్ ఆధారిత ఎరువుల పంపిణీ, ఇతర నూతన రంగాల్లోకి విస్తరిస్తు న్నాయన్నారు. ఈ కార్యక్రమంలో దేశంలోని అన్ని రాష్ట్రాల సహ కార సంఘాల కార్యదర్శులు, రిజిస్ట్రార్లు, సహకార మంత్రిత్వశాఖ, నాబార్డ్, ఎన్‌సీడీసీ, ఇతర అగ్రశ్రేణి సంస్థల ప్రతినిధులు, జాయిం ట్ కలెక్టర్ శుభం బన్సల్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీ, అడిష నల్ రిజిస్ట్రార్లు ఎన్.వి.ఆర్.ఆనందబాబు, గౌరీ శంకర్, జాయిం ట్ రిజిస్ట్రార్‌లు శ్రీలక్ష్మి, చిత్తూరు, తిరుపతి డీసీవోలు లక్ష్మీ, నాగవర్ధన, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాద ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి



ఢిల్లీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జరిగిన ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాణనష్టం చోటుచేసుకోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత ప్రజలు, కుటుంబాలకు ప్రధాని మోదీ సానుభూతి తెలియజేశారని ప్రధాని కార్యాలయం ట్వీట్ చేసింది.

# రోడ్ల మరమ్మతులకు రూ.వెయ్యి కోట్లు

అమరావతి (చైతన్య రథం): ఏపీలో రోడ్ల మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1000 కోట్ల నిధులు మంజూరు చేసింది. మొత్తం 274 రహదారుల మరమ్మతుల కోసం ఈ నిధులు కేటాయిస్తున్నట్టు తెలిపింది. ఈ మేరకు పాలనాపరమైన అనుమతులను మంజూరు చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. స్టేట్ హైవేస్‌లో 108 పనులకు రూ.400 కోట్లు, జిల్లా రోడ్లలో 166 పనులకు రూ.600 కోట్లు మంజూరు చేశారు.

# మెడికల్ కాలేజీలపై జగన్నాటకం

- **నర్సీపట్నం టూర్ ఓ డ్రామా**
- **శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకే..**
- **వైసీపీ పాలనలో నిర్మాణాలకు ఖర్చు శూన్యం**
- **మెడికల్ సీట్లను ప్రైవేట్ పరం చేసింది వారే**
- **జగన్ అండ్‌కో నానాయాగీపై వాస్తవాలు ఇవే**
- **పీపీపీ విధానంలో రెండెళ్లలో కాలేజీల పూర్తి**
- **20 ఏళ్లలో 50 వేల మంది వైద్యులు**
- **అభివృద్ధిని అడ్డుకునేందుకు వైసీపీ దుష్ప్రచారం**

నాణ్యమైన వైద్య విద్యను పేద విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో రాష్ట్రంలో 10 మెడికల్ కాలేజీలను పీపీపీ(పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్) విధానంలో నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అభివృద్ధి- సంక్షేమం చూసి ఓర్వలేని జగన్ రెడ్డి మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేస్తోం దని.. ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని లేనిపోని అసత్య ప్రచారాలు చేస్తూ.. ప్రజల్లో నవ్వులపాలు అవుతున్నారు. పురాణా ల్లో మనం చదివే ఉంటాం.. దేవుళ్లు మంచి పనులు చేస్తే.. ప్రతీసారి రాక్షసులు అడ్డుపడినట్లు.. సీఎం చంద్రబాబు దార్శనిక దృష్టితో కూటమి ప్రభుత్వంలో చేసిన ప్రతీ మంచి పనికి జగన్ అండ్ కో రాక్షసుల్లా అడ్డుపడుతున్నారు. మద్యం మాఫియా, వివేకానందరెడ్డి హత్య, ఇసుక మాఫియా వగైరా అంశాలు పక్కదారి పట్టించడానికి పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించే మెడికల్ కాలేజీలపై నానాయాగీ చేస్తున్నారు. ప్రజలు చాలా తెలివైన వారు.. జగన్ చేసిన విధ్వంసం, కుంభకోణాలు ఐదేళ్లు గమనించి కేవలం 11 సీట్లు ఇచ్చి ఇంట్లో కూర్చోబెట్టారు. జగన్ హయంలో ప్రైవేట్ సంస్థలు దండం పెట్టి పక్క రాష్ట్రాలకు వెళ్లిన ఘటనలు చూశాం. ఇప్పుడు జే టీం చేస్తున్న అరాచకాలతో ప్రైవేట్ కంపెనీలు రాష్ట్రంలో అడుగుపెట్టకుండా ఓ రకమైన భయాందోళ నలకు గురి చేస్తున్నారు. యువతకు నాణ్యమైన విద్య, ఉపాధి మార్గాలను మూసే విధంగా జగన్ అడ్డుపడుతున్నాడు. రాష్ట్రంలో జరుగుతున్న మెడికల్ కాలేజీల విషయంలో జరుగుతున్న వాస్తవాలు ఏంటీ?వైసీపీ చేస్తోన్న విష ప్రచారం ఏంటన్నది ప్రజలు అర్థం చేసుకుంటున్నారు.

### మెడికల్ కాలేజీలపై జగన్నాటకం

2019లో కేంద్ర ప్రభుత్వం దేశంలోని ప్రతి జిల్లాలో ఒక ప్రభు త్వ మెడికల్ కాలేజీ పెట్టేందుకు చర్యలు చేపట్టింది.. కేంద్రం ఇచ్చి న అవకాశాన్ని అన్ని రాష్ట్రాలు సద్వినియోగం చేసుకుంటున్నాయి. అప్పట్లో జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండటం రాష్ట్రం చేసుకున్న ఖర్మ. మొత్తం 17 మెడికల్ కాలేజీలు అవకాశం ఉన్నప్పటికీ కేవలం 7 మెడికల్ కాలేజీలు చాలని ప్రతిపాదనలు పంపాడు. అందులో కేంద్రం కేవలం 3 కాలేజీలకు అనుమతి ఇచ్చింది. వీటికి తోడుగా చంద్రబాబు 2018లోనే మొదలుపెట్టిన ఏలూరు, విజయనగరం కాలేజీలు పూర్తి చేశాడు. జగన్‌రెడ్డి 2019-24 మధ్య పూర్తి చేసింది కేవలం 5 మాత్రమే. ఇందులో నాబార్డు నిధులతో 3 కాలేజీలు నిర్మించారు. ఇలాంటి అసమర్థుడు ఒక ఊహా ప్రపంచాన్ని సృష్టించుకుని తానేదో 17 మెడికల్ కాలేజీలు కట్టేసినట్టు భ్రమ పడుతున్నాడు.

### ప్రైవేట్ పరం..మూల విరాట్ నువ్వు కాదా జగన్?

మెడికల్ కాలేజీలు ప్రైవేట్‌పరం చేస్తున్నారని దుష్టప్రచారం చేస్తోన్న ఈ సుద్దపూస జగన్మోహన్‌రెడ్డి 2023 జూలై 19న జీవో నెం.107,108 ఎందుకు తీసుకువచ్చారో రాష్ట్ర ప్రజలకు వివరిం చాలి. పేద విద్యార్థులకు కేవలం రూ.10 వేలతో వచ్చే వైద్య సీటును..జగన్ తెచ్చిన జీవోతో సెల్ఫ్ ఫైనాన్స్ ద్వారా రూ.12 లక్షలు, ఎన్‌ఆర్‌ఐ సీటు రూ.20 లక్షలకు అమ్ముకుని వైద్య విద్యను పేదవానికి అందని ద్రాక్షగా చేశారు. 107, 108 జీవోల పరమా ర్థం చూస్తే.. 100 శాతంలో 15 శాతం నేషనల్ కోటా, మిగతా 85 శాతం సగంగా డివైడ్ చేస్తే.. 42.5 శాతం ఓపెన్ కేటగిరి వాళ్లకు ఇస్తారు. మిగతా 42.5ను 50 శాతంగా తీసుకుంటే 35 శాతం ఎన్నారై, మిగతా 15 శాతం మెనేజ్‌మెంట్ కోటా ఉంటుం ది. గతంలో గంగవరం పోర్టు, కోఆపరేటివ్ మిల్క్ ఫ్యాక్టరీలను ప్రైవేటీకరించింది జగన్‌రెడ్డే.

### మెడికల్ కాలేజీలకు పైసా ఖర్చు చేయని జగన్

మెడికల్ కాలేజీలపై జగన్ చేస్తోన్న రచ్చ చూస్తుంటే.. దెయ్యా లు వేదాలు వల్లించిన చందంగా ఉంది. వైసీపీ ఐదేళ్ల కాలంలో కేవలం 5 కాలేజీలు అసంపూర్తిగా నిర్మించారు. ఇందులో రాష్ట్ర ఖజానా నుంచి ఒక్క పైసా ఖర్చు చేయలేదు. కేంద్రం, నాబార్డు నిధులతో నిర్మించి బిల్డప్ బాబాయ్ తరహాలో ఫోజులు ఇస్తున్నాడు. పైగా కేంద్రం ఇచ్చిన పీజీ మెడికల్ సీట్ల నిధులను డైవర్ట్ చేసి సూపర్ స్పెషాలిటీ వైద్య విద్య పేద విద్యార్థులకు అందకుండా ద్రోహం చేశారు. మెడికల్ కాలేజీల నిర్మాణ కాంట్రాక్టర్లకు జగన్ చెల్లించింది రూ.1451 కోట్లు కాగా ఇందులో కేంద్రం ఇచ్చిన నిధులు రూ.975 కోట్లు. పీజీ మెడికల్ సీట్ల నిధులు మళ్లింపు రూ.476 కోట్లు. జగన్ హయంలో మెడికల్ కాలేజీలకు కేటాయిం పులు శూన్యం. రాష్ట్రంలో జగన్ నిర్మించిన ఒక్క మెడికల్ కాలేజ్ కూడా లేదు. అయినా కూడా తానే కట్టానని, ప్రజలు చూసి ఆహా ఓహో అంటున్నారని చెప్పుకోవడం నవ్వు తెప్పిస్తుంది.

**జగన్ హయాంలో మొదలుపెట్టిన నాలుగు మెడికల్ కాలేజీలకు కేటాయింపులు ఇలా**

| మెడికల్ కాలేజీ | అంచనా వ్యయం | జగన్ ఖర్చు |
|---|---|---|
| నర్సీపట్నం | రూ.500 కోట్లు | రూ.11.7 కోట్లు |
| పార్వతీపురం | రూ. 600 కోట్ల | టెండర్లు కూడా పిలవలేదు |
| విజయనగరం | రూ.500 కోట్లు | రూ.84 కోట్లు |
| పాడేరు | రూ. 500 కోట్లు | రూ.116 కోట్లు |

మొత్తంగా ఈ నాలుగు కాలేజీలకు అంచనా వ్యయం రూ. 2100 కోట్లు అయితే ఖర్చు చేసింది కేవలం 212 కోట్లు..అంటే 10 శాతం మాత్రమే. ఈ స్థాయిలో అసలు పనులేం జరగక పోయినా జగన్ మాత్రం నేను అద్భుతం చేశా అంటూ ప్రచారం చేస్తూ .. ఇప్పుడు ఏకంగా ఫొటోషూట్‌ల కోసం నర్సీపట్నం వెళుతున్నాడు. అక్కడ జగన్ ఏం చూపిస్తాడు.. అక్కడున్నది ముళ్ల కంచెల మధ్య నిలిచిన నిర్మాణాలే! వాటిలో ఐసీయూలు లేవు, క్లాస్ రూములు లేవు, బోధన సదుపాయాలు లేవు. అదే రుషికొండ ప్యాలెస్ కోసం రూ.500 కోట్లు ఖర్చు చేసి ప్రజా ధనం దుర్వినియోగం చేసిన ఆయన మెడికల్ కాలేజీలకు మాత్రం చేసింది శూన్యం.

### పీపీపీతో రెండేళ్లలో 1750 ఎంబీబీఎస్ సీట్లు

మెడికల్ కాలేజీలకు ఇప్పటికే పెట్టిన ఖర్చు రూ.1451 కోట్లు పోగా ఇంకా రూ.7 వేల కోట్లకు పైగా 2 ఏళ్లలో ఖర్చు చేస్తేనే 1750 ఎంబీబీఎస్. సీట్లు పొందడం సాధ్యం. ప్రభుత్వ నిధులతో కాలేజీలు నిర్మించాలంటే 10 ఏళ్లకు పైగా పడుతుం ది. కర్నాటకలో 12 కాలేజీలు, ఉత్తరప్రదేశ్‌లో 12 కాలేజీలు పీపీపీ మోడల్లో నిర్మిస్తున్నారు. 33 సంవత్సరాలు తరువాత ఈ కాలేజీలన్నీ తిరిగి ప్రభుత్వ పరమవుతాయి.

### పీపీపీ అర్థం ఏంటో తెలుసా జగన్?

తెలుగు రాష్ట్రాలతో పాటుగా దేశంలో ఎప్పటినుంచో పీపీపీ మోడల్ ఉంది. ప్రభుత్వ ఆర్థిక భారాన్ని తగ్గించి ప్రైవేట్ సెక్టార్ ఎఫిషియెన్సీని ఉపయోగించుకోవడమే పీపీపీ మోడల్ విధానం. ఏపీలో హైవే రోడ్డులు, మెడికల్ కాలేజీలు, పోర్టులు, తెలంగా ణలో మెట్రో, మూసి రివర్ ఫ్రంట్, ఎలివేటెడ్ కారిడార్లు పీపీపీ విధానంలో నిర్మించినవే. అరవింద్ ఐ హాస్పిటల్, టాటా క్యాన్సర్ హాస్పిటల్, బర్డ్, స్విమ్స్ పీపీపి నమూనాలో ట్రస్టుల ద్వారా వైద్యం అందిస్తున్నాయి. వేలూరు క్రిస్టియన్ మెడికల్ కాలేజీ చిత్తూరు సరిహద్దు దగ్గర వైద్యం అందిస్తోంది. పీపీపీ అంటేనే ప్రైవేటు సీట్లు అమ్ముకోవడానికి అంటూ విమర్శించే వైసీపీ నేతలకు నీట్ ద్వారా పారదర్శకంగా దేశ వ్యాప్తంగా మెడికల్ కాలేజీల సీట్లు కేటాయిస్తారని విషయం తెలియదా? జగన్ వ్యవహారం చూస్తే ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో మొదటి సారి గా జగన్ పేమెంట్ సీట్లు తెచ్చి ఏమన్నా వసూలు చేశారా? అనే సందేహాలు ప్రజల్లో వస్తున్నాయి.

### శాంతి భద్రతల విఘాతానికే నర్సీపట్నం టూర్

బుడమేరు వరదలు, ఉత్తరాంధ్ర రైతులు తుఫాన్‌లతో నష్టపోతే పరామర్శలకు పోని ఈ జగన్‌రెడ్డి.. ఇప్పుడు మెడికల్ కాలేజీ పేరుతో గురువారం నర్సీపట్నం టూర్ ప్లాన్ చేశారు. పైగా విశాఖలో దిగి 63 కి.మీ రోడ్డు మార్గం ద్వారా వెళ్లాలని ప్లాన్ చేస్తున్నారు. ఎవరిని ఉద్ధరించడానికి ఈ టూర్లు. విశాఖలో ఇదేరోజు మహిళా వరల్డ్ కప్ మ్యాచ్ ఉంది. అభిమానులతో రోడ్లు కిక్కిరిసిపోతాయి. ఇలాంటి సందర్భంలో జగన్ వెళ్లి నానా యాగీ చేయాలని చూస్తున్నారు. గతంలో విశాఖలో ఓ ఈవెంట్ సందర్భంలో వెళ్లి శాంతి భద్రతలకు విఘాతం కలిగించారు. తమిళనాడులో విజయ్ ర్యాలీ ఎంత విషాదం మిగిల్చిందో చూశాం. ఈ అసమర్థుడు విశాఖ వెళ్లి అల్లర్లు సృష్టించి.. రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి ప్లాన్ చేస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

**- ఎన్.నీలంనాయుడు, అనలిస్ట్**

# గురుకుల విద్యార్థిని కుటుంబాలను పరామర్శించిన ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి



కురుపాం (చైతన్యరథం): మన్యం జిల్లా కురుపాం నియోజకవర్గం కేంద్రంలో ఉన్న గురుకుల పాఠశాలలో చదువుతున్న కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన దండుసూర గ్రామానికి చెందిన తోయక కల్పన, కంబగూడ గ్రామానికి చెందిన తోయక అంజలి అనే విద్యార్థినిలు పచ్చకామెర్లతో బాధపడుతు మృతి చెందారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మరియు పాలకొండ శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణ విద్యార్థినిల స్వగృహాలకు వెళ్లి వారి కుటుంబ సభ్యులకు పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. మీకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఇరువురు ఎమ్మెల్యేలు తెలియజేశారు. ఈ పరామర్శలో కురుపాం, పాలకొండ నియోజకవర్గాల కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# నూతన జీఎస్టీ విధానంతో సామాన్య ప్రజలకు ఊరట

**● శాసనసభ్యులు వనమాడి కొండబాబు**




కాకినాడ (చైతన్యరథం): ఎన్డీయే కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జీఎస్టీ విధానంతో సామాన్య ప్రజలకు ఊరట కలుగుతుందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమడి కొండబాబు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మెయిన్ రోడ్ నందు ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక దుకాణాల వద్దకు వెళ్లి సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ కరపత్రాలు అందచేసి, నూతన సంస్కరణల ద్వారా చేకూరే ప్రయోజనాలను కొండబాబు వివరించారు. ఈ కార్యక్రమంలో మల్లిపూడి వీరు, గ్రంధి నారాయణరావు, బచ్చు శేఖర్, గదుల సాయిబాబా, పసుపులేటి వెంకటేశ్వరరావు, గోపిశెట్టి బూరయ్య, గుజ్జు లక్ష్మణరావు, మనోహర్ గుప్తా, రిక్కా లక్ష్మి, ముత్యాల రాణి, విస్సంశెట్టి బాబ్జి, పొంగా బుజ్జి, సాగర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పది రోజుల్లో ఆటోనగర్ అభివృద్ధి పనులు

**●ఆటోనగర్‌లో పర్యటించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**



గుంటూరు (చైతన్యరథం): గత ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఆటోనగర్ ప్రాంత అభివృద్ధి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాం. మరో పది రోజుల్లో రూ.50 లక్షలతో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడతాం. అభివృద్ధికి పనులకు స్థానికులు సహకరించాలి అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. బుధవారం ఏపీ ఇండస్ట్రియల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహారావుతో కలిసి ఆటోనగర్ ప్రాంతంలో పర్యటించారు. వర్షాల కారణంగా రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో స్థానికులతో మాట్లాడారు. కొన్ని ప్రాంతాల్లో ఆక్రమణల కారణంగా శానిటేషన్ పనులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో యూనియన్ నాయకులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇండస్ట్రియల్ క్లస్టర్లు ఏర్పాటు చేసిందని, దీని ద్వారా అన్ని మౌలిక వసతులు కల్పించనుందని తెలిపారు. ఆటోనగర్ ప్రాంతంలో సుమారు 30 వేల మంది పనులు చేస్తుంటారని అన్నారు. ఇక్కడ కచ్చా డ్రెయిన్లు, వీధి దీపాలు, వెట్ మిక్స్ రోడ్ల నిర్మాణం వెంటనే చేపడతామని వెల్లడించారు. పూర్తి స్థాయి అభివృద్ధికి సుమారు కోటి రూపాయలు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నామని, అయితే ప్రస్తుతం రూ.50 లక్షలతో పనులు చేపట్టనున్నామని తెలిపారు. స్థానిక వ్యాపారులు తమ టైర్లు, ఇతర వాహనాలను రోడ్లపై ఉంచుతున్నారని, శానిటేషన్, రోడ్ల నిర్మాణం వంటి పనులకు అడ్డంకిగా ఉంటాయని చెప్పారు. వెంటనే వీటిని తీసివేస్తే అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతాయని వెల్లడించారు. ఇప్పటికే గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఆటోనగర్ ను మరింత పారిశ్రామికంగా ముందుకు తీసుకెళ్లే బాధ్యత తనదని స్పష్టం చేశారు.

# జీఎస్టీ తగ్గింపు విప్లవాత్మక నిర్ణయం : మంత్రి కొల్లు రవీంద్ర

**●ప్రజల కొనుగోలు శక్తి, పొదుపు పెరిగాయి**

**●తగ్గించిన జీఎస్టీతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రయోజనకరం**



అవనిగడ్డ (చైతన్యరథం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న జీఎస్టీ తగ్గింపు విప్లవాత్మక నిర్ణయం అని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం అవనిగడ్డ రెవెన్యూ హాలులో సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ భారతదేశం ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదుగుతోందన్నారు. గతంలో మాదిరిగా అమెరికాకు భయపడే పరిస్థితి ఇప్పుడు లేదని, తాజాగా అమెరికా పన్నులు పెంచడంతో, భారత్ ప్రత్యామ్నాయ మార్కెట్ అవకాశాలను ధైర్యంగా సద్వినియోగం చేసుకుంటోందన్నారు. బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న భారత ఆర్థిక ప్రయోజనాలు దేశ ప్రజలకు అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జివిస్టిని తగ్గించి పేద, మధ్యలతరగతి వర్గాల, రైతుల కొనుగోలు శక్తి, పొదుపు గణనీయంగా పెంచాయన్నారు. జీఎస్టీ తగ్గింపుతో నిత్యవసర సరుకుల ధరలు, వ్యవసాయ పనిముట్ల రేట్లు తగ్గాయన్నారు. ఈనెల 16న జీఎస్టీ అవగాహన సదస్సుకు రాష్ట్రానికి భారత ప్రధాని నరేంద్ర మోడీ విచ్చేయనున్నట్లు తెలిపారు. దీంతోపాటు గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో ప్రజలకు విస్తృత అవగాహన కలిగిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం రాగానే మౌళిక సౌకర్యాల కల్పనకు గ్రామాల్లో విస్తృతంగా సీసీ రోడ్ల నిర్మాణం చేసిందన్నారు. ప్రధాన రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గతంలో పులిగడ్డ – పెనుమూడి బ్రిడ్జి నిర్మాణం టీడీపీ ప్రభుత్వం చేసిందని, ఇప్పుడు ఎదురుమొండి బ్రిడ్జి నిర్మాణం కూడా కూటమి ప్రభుత్వం తప్పనిసరిగా చేస్తుందన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ... భారత ప్రధాని మోడీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తీసుకున్న జీఎస్టీ తగ్గింపు నిర్ణయానికి దేశంలో ఏ ఇతర రాష్ట్రాల్లో లేని స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే క్షేత్రస్థాయి విస్తృత ప్రచారం జరుగుతుందన్నారు. తద్వారా సామాన్య, పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు కలిగే ప్రయోజనాలపై విస్తృత ప్రచారం అవగాహన కలిగిస్తున్నట్లు తెలిపారు. తగ్గిన జివిస్టి ప్రకారం తగ్గిన ధరల వివరాల బోర్డులు కచ్చితంగా దుకాణాల ముందు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. దివిసీమ ఉప్పెన కంటే గత వైసిపి పాలనలో జరిగిన విధ్వంస దుష్పరిణామాలే అధికమన్నారు.

కూటమి ఏర్పాటులో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పాత్ర కీలకం అని, అదే క్రమంలో రాష్ట్ర అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోడీ విస్తృత సహకారం అందిస్తుండడంతో, ఎన్నికల ముందు అస్తవ్యస్తంగా ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కూటమి ప్రభుత్వం గాడిన పెట్టే అవకాశం కలిగిందన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో విస్తృతంగా గ్రామీణ సీసీ రోడ్ల నిర్మాణం, జాతీయ రహదారుల అభివృద్ధి, అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ద్వారా రాష్ట్ర ప్రగతికి బాటలు వేస్తున్న నరేంద్ర మోడీకి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, ఏఎంసీ చైర్మన్లు కొల్లూరి వెంకటేశ్వరరావు, తోట కనకదుర్గ, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, మాజీ జడ్పీటీసీ కన్నా నాగరాజు, బీజేపీ నియోజకవర్గ నాయకులు జీవీ నగరాయలు, టీవీ గిరి, స్టేట్ కార్పొరేషన్ల డైరెక్టర్లు పైడిపాముల కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఎంతో మేలు చేయనున్న నూతన జీఎస్టీ సంస్కరణలు

**● సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్**



అరకు (చైతన్యరథం): ఎన్డీయే ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ నూతన సంస్కరణలు పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ వ్యాఖ్యానించారు. సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పెదబయలు మండల కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ... ప్రతి రూపాయి ఆదాయాన్ని ప్రజల అవసరాలకు వినియోగించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, జీఎస్టీ ద్వారా సమకూరుతున్న ఆదాయాన్ని ప్రజల సంక్షేమానికి మలచడమే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలు పేద, మధ్యతరగతి వర్గాలకు గొప్ప ఉపశమనం కలిగిస్తాయన్నారు. జీఎస్టీ సంస్కరణలతో మేక్ ఇన్ ఇండియాకు ఊతమిస్తూ, భారతీయ బ్రాండ్లు గ్లోబల్ మార్కెట్‌లో పోటీ పడే పరిస్థితులు ఏర్పడతాయన్నారు. దేశీయ ఉత్పత్తులు కొనుగోలు చేస్తే దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవుతారని, ఈ సంస్కరణలు ప్రతి ఇంటికీ లాభం కలిగిస్తాయి అని అన్నారు. అలాగే సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు ఎలా మేలు జరిగిందో, అదే విధంగా ప్రస్తుత సంస్కరణలతో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని సూపర్ జీఎస్టీగా మార్చిందని.. దీని ద్వారా కూడా ప్రజలకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలుగుతుందన్నారు. జీఎస్టీ 2.0తో ప్రతి కుటుంబానికి కూడా నెలకు రూ.15,000 ఆదా కానుందన్నారు. నూతన సంస్కరణల వల్ల సుమారు రూ.8,000 కోట్లు రాష్ట్ర ప్రజలకు ఆదా అవుతుందని చెప్పారు. పేదలు, మధ్యతరగతి ప్రజల జీవితాలను మార్చటమే లక్ష్యంగా జీఎస్టీ సంస్కరణలు తెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పెదబయలు పి.ఎ.సి.ఎస్ చైర్మన్ నరంజి ప్రసాధ్, లక్ష్మిపేట సర్పంచ్‌లకే అశోక్ కుమార్, టీడీపీ సీనియర్ నాయకుడు లొట్టి త్రినాధ్(చిన్ని) మాజీ జడ్పీటీసీ సాగర సుబ్బారావు, దారెలా సర్పంచ్ పాంగి పాండురంగస్వామి, మహిళా అధ్యక్షురాలు కిముడు మహేశ్వరీ, జనసేన మండల అధ్యక్షులు పవన్ కుమార్, జనసేన నాయకులు చెట్టి ఆనంద్, బీజేపీ నాయకులు రామయ్య, నగేష్, అరకు పార్లమెంట్ రైతు సంఘం అధ్యక్షులు కూడ భూషణం రావు,టీడీపీ సీనియర్ నాయకులు జంపారంగి ధనుంజయ, తిరుపతిరావు, మేఘరాజు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# పేపరుమిల్లు కార్మికులకు న్యాయం చేశాం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం (చైతన్యరథం) : రాజమహేంద్రవరంలోని ఆంధ్రప్రదేశ్ పేపరుమిల్లు కార్మికులకు వేతన ఒప్పందం అమలు కూటమి ప్రభుత్వ విజయమేనని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. నూతన వేతన ఒప్పందం కుదిరిన నేపథ్యంలో మిల్లు కార్మిక యూనియన్ నాయకులు తిలక్ రోడ్డులో కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్యాకేజీపై ఉన్న శ్రద్ధ కార్మికుల వేతన ఒప్పందంపై చూపించలేదన్నారు. కార్మికుల సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో న్యాయం జరిగేలా మంచి అగ్రిమెంట్ చేయించగలిగామన్నారు. అనంతరం పేపరుమిల్లు కార్మిక నాయకులు మాట్లాడుతూ గత ఐదేళ్ల కు పైబడి అగ్రిమెంట్ లేక చాలా బాధలు పడ్డామన్నారు. ఎమ్మెల్యే వాసు, ఎంపీ పురందేశ్వరి, మంత్రి దుర్గేష్‌లు స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అగ్రిమెంట్ చేయించారన్నారు. విజయవాడలో జరిగిన అగ్రిమెంట్‌లో కార్మికులకు రూ.5,800 చొప్పున, కాంట్రాక్ట్ కార్మికులకు రూ.2,200 చొప్పున జీతం పెంచారని తెలిపారు. మంచి అగ్రిమెంట్ చేసి 4 వేల మంది కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ఏలూరులో అగ్రిమెంట్ కాపీ ఇచ్చారని దీనిపై 11 యూనియన్లు సంతకాలు పెట్టాయ ని తెలిపారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు,వర్రే శ్రీనివాసరావు, పేపరు మిల్లు కార్మిక నాయకులు పాల్గొన్నారు.

# గుడివాడ నియోజకవర్గంలో హౌసింగ్ నిర్మాణాలపై దృష్టి పెట్టిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



గుడివాడ (చైతన్యరథం): గుడివాడ నియోజకవర్గంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా పేదల ఇళ్ల నిర్మాణాలపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దృష్టి పెట్టారు. త్వరలో చేపట్టనున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన నిర్మాణాలపై హౌసింగ్ అధికారులతో ఎమ్మెల్యే రాము ప్రజా వేదిక కార్యాలయంలో సమీక్షించారు. పీఎంఏవై విధి విధానాలు పూర్తిస్థాయిలో వచ్చిన తర్వాత... గుడివాడ పట్టణం మరియు గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో హౌసింగ్ అధికారులు పర్యటనలు చేపట్టాలన్నారు. ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరు పథకానికి దరఖాస్తులు చేసుకునేలా హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ సమస్యలపై వచ్చే ప్రజలకు హౌసింగ్ శాఖ కార్యాలయ పని వేళల్లో, ఉద్యోగులు అందుబాటులో ఉండాలని అధికారులతో ఎమ్మెల్యే అన్నారు.

అనంతరం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ... రాష్ట్రంలోని పేద, మధ్య తరగతివర్గాల సొంతింటి కలను నిజం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. ప్రజల నుండి ఫిర్యాదులు రాకుండా హౌసింగ్ అధికారులు జవాబుదారీతనంతో పని చేయాలని ఎమ్మెల్యే రాము అన్నారు. నియోజకవర్గంలోని అర్హులందరికీ పీఎంఏవై చేరువయ్యేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. పేద మధ్యతరగతి వర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రాము పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈఈ శివ ప్రసాద్, గుడ్లవల్లేరు, ఏ.ఈ సురేంద్ర, నందివాడ ఏ.ఈ సాయి పవన్, గుడివాడ రూరల్, ఏ.ఈ పృధ్వి, గుడివాడ అర్బన్ ఏ.ఈ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నేతల డైరెక్షన్‌తోనే అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

**●నరసరావుపేట అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసిన టీడీపీ ఎస్సీ సెల్ నేతలు**



నరసరావుపేట (చైతన్యరథం): రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకే వైసీపీ నేతలు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని, అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి ప్రభుత్వం మీద బురద జల్లడానికి ప్రయత్నించిన వైసీపీ నీచ సంస్కృతిని ప్రజా సంఘాలు, కుల సంఘాలు ముక్తకంఠంతో ఖండించాలని జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ నేతలు వ్యాఖ్యానించారు. అంబేద్కర్ విగ్రహాన్ని నాశనం చేసి నరరూప రాక్షసుల్లా వ్యవహరిస్తున్న వైసీపీ నేతలను సభ్యసమాజం నుంచి వెలివేయాలన్నారు. చిత్తూరు జిల్లా వెదురు కుప్పంలో అంబేద్కర్ విగ్రహంపై దాడి చేయడం దళితుల మనోభావాలపై దాడి చేయడమేనని, ఇది దళితులను అవమానించడమేనని అన్నారు. విగ్రహ ధ్వంసం కేసులో వైసీపీ నేతలు గోవిందయ్య, ఇతరులు స్వయంగా పట్టుబడి జైలుకు వెళ్లినా జగన్ రెడ్డి మౌనంగా ఉండటం దేనికి సంకేతం అన్నారు. దళితులంటే జగన్కు ఎందుకు అంత చిన్న చూపు. విగ్రహాలు పగలగొట్టడం, తగుల బెట్టడం, రాష్ట్రంలో అశాంతిని రేకెత్తించేలా కుట్రలు చేయడం వైసీపీ నీచ రాజకీయ పేటెంట్. ఐదేళ్ల పాలనలో చెప్పుకోవడానికి చేసిన ఒక్క మంచి పని లేదు. ప్రజలు ఛీకొట్టి తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చొబెట్టినా బుద్ధి మారని జగన్.. సమాజంలో అశాంతిని రేకెత్తించేలా కుట్రలు పన్నుతున్నాడన్నారు. దళితులంటే జగన్‌కు గిట్టదు. సొంత పార్టీలో దళిత ఎమ్మెల్యేలు చెప్పులు లేకుండా జగన్ నివాసంలోకి రావాలి. కరోనా సమయంలో మాస్క్ అడిగిన పాపానికి దళిత డాక్టర్ సుధాకర్‌ను హత్య చేశారు. దళితుడైన డ్రైవర్ సుబ్రహ్మణ్యంను హత్య చేసి డోర్ డెలివరీ చేశారు. దళితుడైన సింగయ్యపై జగన్‌రెడ్డి స్వయంగా కారు ఎక్కించి తొక్కించి చంపేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో దళితులు మనశాంతిగా ఒక్కరోజూ గడపలేదు. జగన్‌రెడ్డి పాలనంతా దళితులపై దాడులు, విధ్వంసాలే జరిగాయనీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ నాయకులు కుంపటి రవి, జిపి.కుమార్, చింతిరాల బాలు, గిద్దల వెంకటేశ్వర్లు, మల్లవరపు శ్యామ్, కొల్లిపోగు సునీల్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# క్విడ్ ప్రోకో.. మనీ లాండరింగ్ ఆలోచనల నుంచి బయటపడితేనే జగన్‌కు పీపీపీ విధానం బోధపడుతుంది : ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట (చైతన్యరథం): "తన హాయాంలో రాష్ట్రంలో కల్తీ, విషపూరిత మద్యాన్ని ఏరులై పారించి, అమాయకుల చావులకు కారణమైన జగన్.. మరో పక్క తన తప్పుల్ని కప్పిపుచ్చుకోవడానికే మెడికల్ కాలేజీల నిర్మాణంపై విషప్రచారం చేస్తున్నాడు. ఐదేళ్లు తాను చేసిన దుర్మార్గాలు, పాపాలపై ఆత్మపరిశీలన చేసుకొని, ప్రజల్ని బహిరంగ క్షమాపణ కోరాకే జగన్ మనసు మెరుగై, ప్రభుత్వం ప్రజాక్షేమం తీసుకునే నిర్ణయాలు అవగతమవుతాయి. అహంకారపు పోకడలతో పరిశీలనలు.. పరామర్శలు అంటూ ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో ఆందోళనలు రేపాలనే దుర్బుద్ధితో వ్యవహరిస్తానంటే పాలకులు చూస్తూ ఊరుకోరు. పోలీసుల ఆంక్షల్ని బేఖాతరు చేస్తూ పర్యటనల పేరుతో ప్రజాజీవనానికి భంగం కలిగించే చర్యలకు పాల్పడితే ప్రభుత్వం ఉపేక్షించదు. ఈ నిజాన్ని జగన్ గుర్తించాలి. తన హాయాంలో సామాన్యప్రజల్ని నోరెత్తనీయకుండా భయపెట్టిన జగన్.. నేడు అక్రమ అరెస్టులు.. ఆంక్షలు.. కక్షసాధింపులని గగ్గోలు పెట్టడం విచిత్రంగా ఉంది. మెడికల్ కాలేజీల నిర్మాణానికి కేంద్రమిచ్చిన నిధుల్ని దుర్వినియోగం చేసిన జగన్... ఏ ముఖంపెట్టుకొని నిర్మాణాల పరిశీలనకు వెళ్తున్నాడో, నర్సీపట్నం వైద్యకళాశాల ఎంతమేర నిర్మించాడో ప్రజలకు సమాధానం చెప్పాలి.

పీపీపీ విధానానికి, ప్రైవేటీకరణకు తేడా తెలుసుకోకుండా, వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రభుత్వంపై నిందలేసే సంకుచిత రాజకీయాలు జగన్ మానుకోవాలి. ప్రైవేట్ సంస్థలకు ఎలాంటి భూకేటాయింపులు లేకుండా కేవలం వాటిని నిర్మాణానికే పరిమితం చేసినా.. కన్వీనర్ కోటా వైద్యసీట్లు పెరుగుతున్నా జగన్ ఆరోపణలు చేయడం వ్యక్తిగత ప్రయోజనం కాక ఏమనుకోవాలి? పీపీపీ విధాన నిర్ణయాలు జగన్‌కు బోధపడాలంటే ఆయన తక్షణమే దోపిడీ పాలసీలు... క్విడ్ ప్రోకో.. మనీ లాండరింగ్.. షెల్ కంపెనీల ఏర్పాటు ఆలోచనల నుంచి బయటకు రావాలి.

**వాస్తవాలు.. ప్రజలకు కలిగే మేలు కన్నా.. జగన్‌కు వ్యక్తిగత ప్రయోజనాలే ముఖ్యం**

కేవలం తక్కువ కాలంలో వైద్య కళాశాలల నిర్మాణాలు త్వరితగతిన పూర్తై, ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులోకి వచ్చేలా, 33 ఏళ్ల తర్వాత పూర్తిగా ప్రభుత్వ అధీనంలోకి వచ్చేలా ఉన్న నిబంధనల్ని జగన్ తప్పుపట్టడం హాస్యాస్పదం. వాస్తవాలు.. ఫలితాలతో పనిలేకుండా కేవలం వ్యక్తిగత ప్రయోజనాలే అజెండాగా జగన్ ప్రభుత్వ నిర్ణయాలను తప్పుపడుతున్నాడనేది వాస్తవం. చంద్రబాబు నాయకత్వంలో ఏడాదిన్నరలోనే రాష్ట్రం అభివృద్ధి.. సంక్షేమంలో పరుగులు పెట్టడం చూసి సహించలేకే జగన్.. నీచమైన ఆలోచనలతో కూటమి ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నాడని ప్రజలు గ్రహించారు. జగన్.. వైసీపీ రాక్షసమూక ఎన్ని కుట్రలు చేసినా... చంద్రబాబు తలపెట్టిన అభివృద్ధి, సంక్షేమ యజ్ఞం ఆగదు." అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఒక ప్రకటనలో హితవు పలికారు.

# హడావుడి, అలజడి సృష్టించడానికే జగన్ కుట్రలు

**●జగన్ విశాఖ పర్యటన పూర్తిగా స్వార్థ రాజకీయం కోసమే: జీవీ**



వినుకొండ (చైతన్యరథం): విశాఖపట్నంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఒకేఒక్క ఉద్దేశంతోనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి అక్కడికి పర్యటనను ప్లాన్ చేశారని ధ్వజమెత్తారు ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. ప్రజల సమస్యల కంటే రాజకీయ హడావుడి సృష్టించడమే ఈ పర్యటన అసలు ఉద్దేశమని ఆయన విమర్శించారు. బుధవారం ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో వైద్య కళాశాలలపై జగన్, వైకాపా విమర్శలు, రాద్ధాంతంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) విధానం, ప్రైవేటీకరణ మధ్య తేడా కూడా తెలియక అబద్ధప్రచారం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. వైద్య విద్యలో నాణ్యత పెంచి, మరింత సౌకర్యాలను ప్రజలకు అందించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం తీసుకొస్తున్న పీపీపీ విధానాన్ని, రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించడం బాధ్యతారాహిత్యమని ఆయన అన్నారు. పీపీపీ విధానంలో ఏర్పాటు కానున్న కళాశాలల్లో సీట్లు, ఫీజులు పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలోనే ఉంటాయని, ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా ఏ అంశమూ ఉండదన్నారు. అయినప్పటికీ జగన్ రెడ్డి ఈ నిజాలు తెలిసీ కావాలనే వైద్య కళాశాలలపై అబద్ధప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఒక్క ప్రాజెక్టు కూడా విశాఖకు తేవలేదని గుర్తుచేసిన ఆయన, అధికారంలో ఉన్నప్పుడు పట్టించుకోని విశాఖపై ఇప్పుడు చూపిస్తున్న హఠాత్తు ఆసక్తి రాజకీయ స్వార్థమేనని అన్నారు. విశాఖను కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న తీరు ఓర్చుకోలేక జగన్ రెడ్డి చిచ్చు రేపాలనే కుట్రలు చేస్తున్నారని మండి పడ్డారు. అదీగాక వచ్చే నెలలో ప్రభుత్వం విశాఖపట్నంలో అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సు నిర్వహించబోతోందన్న జీవీ ఆ సందర్భంలో నగరాన్ని ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిలో నిలపాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని దెబ్బతీయడానికి జగన్ రెడ్డి ఇలాంటి అలజడి పర్యటనలు చేపడుతున్నారని విమర్శించారు. ప్రజల అభివృద్ధి, రాష్ట్ర ప్రగతిపై కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా జగన్ చేస్తున్న ఈ రాజకీయ నాటకాల్ని ప్రజలు ఇక ఎట్టి పరిస్థితుల్లో నమ్మే అవకాశం లేదన్నారు. రోజురోజుకీ అడ్రెస్ కోల్పోతున్న వైసీపీ గ్రాఫ్‌ను పెంచుకోవడం, క్యాడర్‌ను కాపాడుకోవడానికే జగన్ యాత్రల డ్రామాలు చేస్తున్నారన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని సరైన సమయంలో సరైన కర్రు కాల్చివాత పెట్టడం ఖాయంగా కనిపిస్తోందన్నారు.

# కల్తీ మద్యానికి మూల విరాట్ జగన్

**●జగన్ విషపూరిత మద్యానికి బలైన పేదలు ఏపీఐడీసీ ఛైర్మన్ దేగల ప్రభాకర్**



గుంటూరు (చైతన్యరథం): ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసులు నకిలీ మద్యం తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకుంటూ, పలువురిని అరెస్టు చేసి,చట్టవిరుద్ధ చర్యలపై ప్రభుత్వం కఠిన వైఖరిని అవలంబిస్తోందని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దేగల ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం అర్బన్ టిడిపి కార్యాలయంలో విలేకర్లతో ఛైర్మన్ దేగల ప్రభాకర్ మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కల్తీ మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న టీడీపీ నాయకులు దాసరిపల్లి జయచంద్రరెడ్డి, కట్టా సురేంద్ర నాయుడులను పార్టీ నుండి సస్పెండ్ చేసి, తగిన విచారణ చేపట్టాలని నిర్ణయించడం జరిగిందని గుర్తు చేశారు. ఇది ప్రభుత్వ, పార్టీ నిబద్ధతకు నిదర్శనం అని అన్నారు. ఎవరో ఎక్కడో తప్పు చేస్తే దాన్ని ప్రభుత్వానికి, పార్టీకి అంటగట్టేలా వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. వాస్తవాలను వక్రీకరించి జగన్ మద్యం కుంభకోణంలో కొండత దోపిడీని కప్పిపెట్టుకొనే కుట్ర నాటకం ఆడుతున్నారని ఆరోపించారు. వైసీపీ హయాంలో విజయవాడలో మీ పార్టీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సంబంధించిన బార్‌లో కల్తీ మద్యం వల్ల 6గురు చనిపోతే సమర్థించాలేదా జగన్ అని ప్రశ్నించారు. మల్లాది విష్ణుని ఎందుకు సస్పెండ్ చేయలేదు? మీకు మద్యం మాఫియాలో భాగస్వాములు కాబట్టి కదా..? కల్తీ మద్యంలో నిందితులుగా ఉన్న వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని వైసీపీ పార్టీ నుంచి జగన్‌రెడ్డి ఎందుకు సస్పెండ్ చేయలేదు..? మీరు మద్యం మాఫియాలో భాగస్వాములు కాబట్టి... జే బ్రాండ్ల మద్యంలో విషపూరిత పదార్థాలు ఉన్నట్టు చెన్నై, బెంగళూరుతోపాటు అమెరికాలోని ప్రముఖ ల్యాబ్ లు నిర్ధారించాయన్నారు. అయినా జగన్ ప్రభుత్వం చర్యలు ఎందుకు తీసుకోలేదు? మీరు మద్యం మాఫియాలో భాగస్వాములు కాబట్టి..? జగన్ పాలనలో జంగారెడ్డి గూడెంలోనే కల్తీ నాటుసారా తాగి 27 మంది పేదల ప్రాణాలు పోతే చర్యలు తీసుకోకుండా సమర్థించావు.. వైసీపీ హయాంలో మద్యం రేట్లు పెంచడం వల్ల మద్యానికి బానిసైన వ్యక్తులు శానిటైజర్ తాగి 48మంది చనిపోయారు. గత ఐదేళ్ల కల్తీ మద్యంతో దోచుకున్న డబ్బులతో ఆఫ్రికాలో సునీల్ రెడ్డి, చెవిరెడ్డి, ద్వారంపూడి వైసీపీ నేతలు వ్యాపారా చేశారు. జగన్ ఐదేళ్ల పాలనలో విషపూరిత మద్యం తయారు చేసి రూ.3500కోట్లు కొల్లగొట్టారు. జగన్ రెడ్డి పాలనలో మద్యం తాగిన వారు నరాల వ్యాధి, కిడ్నీ వ్యాధులు, కాలేయం వ్యాధులతో 30వేల మంది పేదలు మరణించారు. అలాగే విషపూరిత మద్యంవల్ల రాష్ట్రవ్యాప్తంగా 35లక్షల మంది ఆరోగ్యాల ధ్వంసమయ్యాయి.

# నాణ్యతతో పాటు కాలుష్య నియంత్రణ అవసరం

## స్టాండర్డ్స్ కాన్‌క్లేవ్ సమావేశంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



సర్వేపల్లి, (చైతన్యరథం): ప్రతి వస్తువు వినియోగదారులకు నష్టమేకాకుండా, ఉత్తమ నాణ్యతతో అందించాల్సిన బాధ్యత తయారీదారులపై ఉందని, అదే సమయంలో వాటి వల్ల కలిగే కాలుష్యాన్ని నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని పురస్కరించుకుని విక్రమ సింహపురి యూనివర్సిటీలో నిర్వహించిన "స్టాండర్డ్స్ కాన్‌క్లేవ్" కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నాణ్యత ప్రమాణాలను గాలికొదిలిన ఘటనలు ప్రజల ప్రాణాలకు ముప్పు తీసుకువచ్చాయని, దగ్గు మందుల వల్ల చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన ఘటనను ఉదాహరణగా పేర్కొన్నారు. నకిలీ మద్యం కేసులో టీడీపీ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా స్పందించి, ఆరోపణలు ఎదుర్కొన్న నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో పాటు నిందితులపై కఠిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు వాటి కాలుష్యాన్ని నియంత్రించాల్సిన బాధ్యతను ప్రభుత్వం మరిచి పోకూడదని హెచ్చరించారు. ముఖ్యంగా పేదలు, గిరిజనులు కాలుష్యం వల్ల తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నేలటూరు, పైనాపురం ప్రాంతాల్లో ప్రజలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. కాలుష్య నివారణలో ప్రభుత్వం ప్రామాణిక చర్యలు తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో ఏపీపీసీబీ చైర్మన్ పి. కృష్ణయ్య, కలెక్టర్ హిమాన్షు శుక్లా, వీసీ అల్లం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రధాని మోడీ పర్యటనను విజయవంతం చేయాలి

## డోన్ ఎమ్మెల్యే కోట్ల పిలుపు

బేతంచర్ల, (చైతన్యరథం): పట్టణంలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయ ప్రాంగణంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలతో విస్తృత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ప్రజల సమస్యలను తమవిగా తీసుకుని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రతి ఇంటికీ కూటమి పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేర్చే దిశగా కృషి చేయాలని అన్నారు. ఈ నెల 16వ తేదీన ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పర్యటించనున్న నేపథ్యంలో కార్యక్రమం విజయవంతం కావడానికి పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

# సీఎం చంద్రబాబుతోనే సంక్షేమ పాలన సాధ్యం

## నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వెల్లడి



బుచ్చిరెడ్డిపాళెం, (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్టంలో సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టారని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఆటో డ్రైవర్ల సేవలో విజయోత్సవ ర్యాలీలో పాల్గొనేందుకు కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని వెంటబెట్టుకుని బుచ్చిరెడ్డి పాళెం పట్టణం టోల్ ప్లాజా వద్దకు వచ్చార. ప్రసన్న అనే మహిళా ఆటో డ్రైవర్ ఆటోలో కూర్చొని ఆటో డ్రైవర్ల సేవలో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. అటు టోల్ ప్లాజా నుంచి ఇటు నారాయణాద్రి లే అవుట్ వరకు బుచ్చి పట్టణం మీదుగా దాదాపు 500లకు పైగా ఆటోలతో ఆటో సోదరులు నిర్వహించిన భారీ ర్యాలీలో సంక్షేమ సారథి చంద్రబాబు జిందాబాద్, వేమిరెడ్డి దంపతుల నాయకత్వం వర్ధిల్లాలి అన్న నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా రవాణా రంగంలో ఆర్టీసీకి ఎంత ప్రాధాన్యత వుందో ఆటో వ్యవస్థ కూడా ముఖ్యమైనదేనన్నారు. రవాణా కోసం ప్రజలు ఆర్టీసీ బస్సుల తర్వాత ఎక్కువగా ఎక్కేది ఆటోలేనన్నారు. రాష్టం ఆర్థిక ఇబ్బందులలో వున్నా ఆటో సోదరులను ఆదుకోవాలన్న ఏకైక లక్ష్యంతో "ఆటో డ్రైవర్ల సేవలో" పథకాన్ని అమలు చేసి సీఎం చంద్రబాబు నాయుడు కార్మికుల పక్షపాతి అని నిరూపించుకున్నారన్నారు. గత ప్రభుత్వం 10 వేల రూపాయలు విదిలిస్తే కూటమి ప్రభుత్వం ప్రతి ఆటో డ్రైవర్లకు దసరా కానుకగా ఆటో సోదరుల అకౌంట్లలో 15 వేలు జమ చేసి ఆదుకున్నారనన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2.90 లక్షల మంది ఆటో సోదరుల ఖాతాల్లో రూ.435 కోట్లు అందజేస్తే ఒక్క నెల్లూరు జిల్లాలోనే 17వేల 409 వేల మందికి 26.11 కోట్లు జమ చేశారన్నారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆటో డ్రైవర్లకు ఆర్థిక చేయూత ఇవ్వాలనే సంకల్పంతో కోవూరు నియోజకవర్గంలో 2 వేల,795 మంది ఆటో సోదరులకు 4 కోట్ల 19 లక్షల 25 వేల ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆమె ఆటో సోదరుల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల సందర్భంగా చేసిన హామీలను దశల వారీగా అమలు చేస్తున్నామని పెన్షన్ల పెంపు, దీపం 2 పథకం ద్వారా ఏడాదికి మూడు సిలెండర్లు, అన్నదాత సుఖీభవ, మత్స్యకారసేవలో తల్లికి వందనం తదితర సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం పేదలను ఆదుకుంటుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆటో డ్రైవర్లు రోడ్డెక్కాలంటేనే భయపడే పడే పరిస్థితి వుండేదన్నారు. గతంలో 20 వేలున్న గ్రీన్ ట్యాక్స్ ను కూటమి ప్రభుత్వం 3 వేలకు తగ్గించిందన్నారు. ఆటో డ్రైవర్ల కోసం గత ప్రభుత్వం 260 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే... సీఎం చంద్రబాబు గారు.. 435 కోట్లు అందించారన్నారు. మెగా డీఎస్సీకి శ్రీకారం చుట్టి రాష్ట వ్యాప్తంగా 15,941 మంది ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టిందన్నారు. కోవూరు నియోజకవర్గంలో 67 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందారన్నారు. ఆర్థికంగా సవాళ్లున్నా.. ఊహించని స్థాయిలో సంక్షేమం, అభివృద్ధి అందిస్తూ కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తూ రాష్టాన్ని అన్ని రంగాల్లో టాప్‌లో నిలిపేలా కష్టపడుతున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు అండగా నిలిచి స్వర్ణాంధ్ర సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బుచ్చి మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ, బుచ్చి, వవ్వేరు కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ దొడ్ల విజయలక్ష్మి, బుచ్చి అగ్రికల్చర్ కో ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మెన్ ఏటూరి శివరామ కృష్ణారెడ్డి, బుచ్చి వైస్ చైర్మన్లు శివకుమార్ రెడ్డి, నస్రీన్ ఖాన్, బుచ్చి రూరల్ మరియు అర్బన్ టిడిపి అధ్యక్షులు బెజవాడ జగదీష్ , గుత్తా శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులు టంగుటూరు మల్లారెడ్డి, కోవూరు, విడవలూరు, కొడవలూరు, ఇందుకూరుపేట టిడిపి అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, శ్రీహరి రెడ్డి, నాపా వెంకటేశ్వర్లు నాయుడు, ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి, టిడిపి నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, బత్తల హరికృష్ణ, ఎంవి శేషయ్య పాల్గొన్నారు.

# వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు

## ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ వెల్లడి



నెల్లూరు, చైతన్యరథం): నగరంలోని పరమేశ్వరి నగర్‌లో జామియా మసీదుకు చెందిన 13.30 ఎకరాల వక్ఫ్ భూమిని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, టీడీపీ ముస్లిం నాయకులు, మతపెద్దలతో కలిసి పరిశీలించారు. అనంతరం అబ్దుల్ అజీజ్ మీడియాతో మాట్లాడుతూ, గతంలో పూర్వీకులు రాష్ట్ర వ్యాప్తంగా 67 వేల ఎకరాల భూమిని వక్ఫ్ చేశారని, అంటే దేవుడికి ఇచ్చారని అని తెలిపారు. వక్ఫ్ సంస్థలు వాటి యొక్క భూములతో ఆదాయాన్ని పెంచుకొని సంస్థలు నడుపుకోవటానికి పూర్వీకులు వనరులను సమకూర్చారని తెలిపారు. ఈ భూముల ఆక్రమణకు గురయ్యాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రి ఫరూక్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా పరిరక్షణ చేపడుతున్నామని తెలిపారు. వక్ఫ్ ఆస్తులను పరిరక్షించి వాటి ద్వారా ఆదాయాన్ని పెంచి పేద ముస్లింల అభివృద్ధికి ఉపయోగిస్తామని తెలిపారు. వక్ఫ్ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడి పైన ఉందని తెలిపారు. నెల్లూరులోని 13.30 ఎకరాల వక్ఫ్ భూమిని ప్రభుత్వ సహకారంతో సర్వే చేయించామని, దాదాపు 13 ఎకరాల భూమి అలానే ఉందని అక్కడక్కడ కొద్దిగా ఆక్రమణకు గురైందని దానిని ఏం చేయాలో ఆలోచిస్తామని తెలిపారు. ప్రస్తుతం 13 ఎకరాలను కేవలం జంగిల్ క్లియర్ చేసి ప్రహరీ గోడ నిర్మిస్తున్నామని, ఈ స్థలంలో ఎలా అభివృద్ధి చేయాలో స్థానిక కలెక్టర్ ప్రజా ప్రతినిధులు, ముస్లిం మత పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. దేవుడి ఆస్తులను అందరూ చౌకగా కోరుకుంటారని దేవుడి ఆస్తులను ప్రీమియంగా తీసుకోవాలని అప్పుడే దేవుడి అనుగ్రహం కూడా ఉంటుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కమర్షియల్ ప్రాపర్టీస్‌ను చౌకగా ఇవ్వకూడదని ఆదాయాన్ని పెంచి ముస్లిం సమాజానికి ఉపయోగపడాలని ముతవల్లీలకు సూచించారు. ఆదాయం పెంచకపోతే సంపద సృష్టించకపోతే సమాజం ఎలా బాగుపడుతుందని ఉన్న ఆస్తులను ఇలా వైరాగ్యంగా వదిలేస్తే సమాజం ఎలా బాగుపడుతుందని అన్నారు. వక్ఫ్ ఆస్తులను కాపాడటం ఎంత ధర్మమో, వాటి ద్వారా ఆదాయాన్ని పెంచడం కూడా అంతే ధర్మమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 28 ప్రదేశాల్లో తాలిం ఏ హునర్ పేరుతో స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలు ప్రారంభించబోతున్నామని, వచ్చేనెల 11న ముఖ్యమంద్ర& చంద్రబాబు చేత వాటిని వర్చువల్ గా ప్రారంభిస్తామని తెలిపారు. గతంలో లేని విధంగా వక్ఫ్ బోర్డు భూములకు ఆన్లైన్ ఆక్షన్ వేసామని అన్నారు. తాను బోర్డ్ చైర్మన్ అయ్యాక ఆదాయాన్ని రెండింతలు పెంచానని వెల్లడించారు. 13 ఎకరాల్లో పని ప్రారంభించేటప్పుడే అధికారులు ప్రణాళికను తెలిపారని అన్నారు. 13 ఎకరాల భూమి గుంటలు గుంటలుగా ఉందని గుంతలను పూడుస్తామని, తెలిపారు. వచ్చే మార్చి నుంచి వక్ఫ్ బోర్డు తరుపున 15 కోట్ల రూపాయల ఖర్చుతో 500 మందికి ఉచిత ఇంటర్మీడియట్ విద్య అందించబోతున్నామని తెలిపారు. ఢిల్లీలోని ఐఏఎస్ అకాడమీలను పరిశీలించానని, రానున్న రోజుల్లో ముస్లిం విద్యార్థులకు ఉచిత ఐఏఎస్ కోచింగ్ అందిస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పలు వక్ఫ్ ఆస్తులను కాపాడేందుకు సీనియర్ లాయర్లను పెట్టి సిట్టింగ్ కు 5 లక్షల ఖర్చుపెట్టి పోరాడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ముస్లిం నాయకులు, మత పెద్దలు పాల్గొన్నారు.

# ఏపీలోనే జీఎస్టీ సంస్కరణల తొలి ఫలితాలు

## ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడి



అనంతపురం, (చైతన్యరథం): సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ పేరుతో భారతదేశంలో మొదటిసారి ధరలు తగ్గించామని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. బుధవారం ఉరవకొండ పట్టణంలోని గుంతకల్ రోడ్‌లోని శ్రీ శిరిడి సాయి సూపర్ మార్కెట్ లో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ భాగంగా సూపర్ మార్కెట్ ను మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ ఆకస్మికంగా తనిఖీ చేసి ధరల తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించారు. కొనుగోలుదారులతో మాట్లాడి జీఎస్టీ తగ్గింపుతో ధరలు తగ్గయా లేదా అని మంత్రి ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ పేరుతో భారతదేశం మొత్తం మీద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో నడుస్తున్న ఎన్డీఏ ప్రభుత్వం సామాన్యుడి కుటుంబ భారాన్ని, ఖర్చులను తగ్గించే విధంగా ప్రతి వస్తువు మీద ట్యాక్సులను తగ్గించడం జరిగిందన్నారు. 28 శాతం నుంచి 18 శాతం, 12 శాతం, ఐదు శాతం వంటి వివిధ రకాల శ్లాబులలో ఉన్నటువంటివాటిని 2 శ్లాబులకు తగ్గించడం, ఆ రెండు శ్లాబులలో ఉన్నటువంటి అనేక వస్తువులను అతి తక్కువ ధరలకు తగ్గించడం, ప్రతి కుటుంబం కూడా సంవత్సరంలో వేల రూపాయలను ఆదా చేసే రకంగా ఈ పన్నుల భారాన్ని తగ్గించడం జరిగిందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్య పరచడానికి, ఇంకా ధరలు ఎక్కడైనా అందుతున్నాయా లేదా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నటువంటి ధరలు కిందకు చేరుతున్నాయా లేదా అనేది చూడడానికి కూడా ఎక్కడికక్కడ అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈరోజు పల్లెపల్లెలోనూ ఇంటింటికి కూడా సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ పేరుతో ఎన్ని ట్యాక్సుల భారాన్ని తగ్గించాం అనేది తెలుపుతున్నామని, జీఎస్టీ తగ్గింపు అనేది ప్రతి కుటుంబానికి, ప్రతి వ్యక్తికి కూడా లబ్ధి చేరుతుందన్నారు. రోజు వాడేటువంటి పేస్టులు, సబ్బుల దగ్గర నుంచి మొదలుకొని మధ్యతరగతి వారు వాడే ఏసీలు, ఫ్రిజ్ లు వరకు కూడా ధరలు తగ్గాయని, క్షేత్రస్థాయిలో ప్రజల కోసం పనిచేసేటువంటిది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృతంలోని డబల్ ఇంజన్ సర్కార్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ హేమ, డిప్యూటీ కమిషనర్ భాస్కర్ వల్లి, తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ కుటుంబాలకు అండగా ఉంటాం

## రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత భరోసా



రాప్తాడు, చైతన్యరథం): నియోజకవర్గంలోని పలువురు టీడీపీ నాయకుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరిటాల సునీత అండగా నిలిచారు. ఇటీవల ప్రమాదాలు, అనారోగ్య కారణాలతో మరణించిన వారి కుటుంబాలను, గాయపడిన వారిని ఆమె పరామర్శించారు. నేరుగా గ్రామాల్లోని వారి నివాసాలకు వెళ్లి ఆర్థిక సాయం అందజేశారు. రాప్తాడు మండలం రామినేపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ గత నెల 2వ తేదీన టిప్పర్ కిందపడి మరణించారు. ఈ నేపథ్యంలో రామినేపల్లికి వెళ్లి శ్రీకాంత్ కుటుంబసభ్యులను ఎమ్మెల్యే సునీత పరామర్శించి పదివేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు. రాప్తాడు మండలం బండమీదపల్లి గ్రామానికి చెందిన క్లస్టర్ ఇంచార్జ్ మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్బరాయుడు గత నెల 22వ తేదీన గుండెపోటుతో మరణించగా ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే సునీత పరామర్శించారు. ఆ కుటుంబానికి 25వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. అదే గ్రామంలో అనారోగ్య కారణాలతో మరణించిన బులగొండ దుబ్బన్న కుటుంబాన్ని కూడా ఎమ్మెల్యే సునీత పరామర్శించారు. బండమీద పల్లికి చెందిన ఆంజనేయులుకి ఇటీవల బైక్ పై వెళు తున్నప్పుడు ప్రమాదవశాత్తు కిందపడి కాలు విరిగింది. ఆంజనేయులు ఇంటికి ఎమ్మెల్యే సునీత స్వయంగా వెళ్లి పరామర్శించారు. అలాగే 10వేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు. బండమీద పల్లికి చెందిన తమ్మినేని రంగయ్య ఈనెల 6వ తేదీన కిడ్నీ సమస్యలతో మరణించగా ఆయన కుటుంబ సభ్యులను కూడా ఎమ్మెల్యే పరిటాల సునీత పరామర్శించారు. వారి కుటుంబానికి 10వేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు. రాప్తాడు మండలం వరిమడుగు గ్రామానికి చెందిన గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు రాంగోపాల్... 13 రోజుల క్రితం గుండెపోటుతో మరణించాడు. ఆ కుటుంబాన్ని పరామర్శించి 10వేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు. బాధిత కుటుంబాలకు అధైర్య పడవద్దని.. తమతో పాటు పార్టీ కూడా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం అనంతరం వరిమడుగు గ్రామంలో వాల్మీకి విగ్రహానికి పూలమాల వేయడంతో పాటు ఓ కిరాణా దుకాణానికి వెళ్లి అక్కడ తగ్గిన జీఎస్టీ ధరల ప్రకారం విక్రయాలు జరుగుతున్నాయా లేదా అన్న అంశం గురించి ఆరా తీశారు. జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగిన ప్రయోజనాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వానికి ఆర్థికంగా భారం అయినప్పటికీ ప్రజల కోసం జీఎస్టీ తగ్గించారని ఎమ్మెల్యే సునీత తెలిపారు. అనంతరం కనగానపల్లి మండలం తల్లిమడుగుల గ్రామానికి చెందిన నెల్లూరి మనోహర్ మాతృమూర్తి ఈ మధ్యనే అనారోగ్యంతో మరణించగా గ్రామానికి వెళ్లి మనోహర్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సునీత పరామర్శించారు.

# పేదలందరికీ జీఎస్టీ ఫలాలు అందాలి

## ఎంపీ లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే శ్రావణి శ్రీ వెల్లడి




అనంతపురం, (చైతన్యరథం): పేద ప్రజలకు జీఎస్టీ ఫలాలు అందాలని అనంతపురం ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పేర్కొన్నారు. బుధవారం అనంతపురం జిల్లాలోని శింగనమల మండలంలోని నాయనపల్లిక్రాస్‌లోని శ్రీ లక్ష్మీ నరసింహ ఆగ్రో ఏజెన్సీస్ షాపును ఎంపీ, ఎమ్మెల్యేలు సందర్శించి, సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాల జీఎస్టీ సంస్కరణలపై అవగాహన కల్పించాలని, ప్రజలకు తెలియజేయాలని వారు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటికీ కూడా సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పేరుతో ట్యాక్సుల భారాన్ని తగ్గించాం అనేది తెలపాలని, జీఎస్టీ తగ్గింపు అనేది ప్రతి కుటుంబానికి, ప్రతి వ్యక్తికి కూడా లబ్ధి చేరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# ఆర్డీటీకి కేంద్రం శుభవార్త... ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణ

## ఫలించిన కూటమి నేతల కృషి

అనంతపురం, (చైతన్యరథం): జిల్లాలోని ఆర్డీటీ సంస్థకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇది ఉమ్మడి జిల్లా పేద ప్రజల విజయంగా పలువురు భావిస్తున్నారు. రెన్యూవల్ కోసం అసెంబ్లీ చట్ట సభల్లో తమ గళాన్ని వినిపించిన ఉమ్మడి అనంతపురం జిల్లా శాసనసభ్యులు, ఎమ్మెల్సీలకు ప్రత్యేక పేద ప్రజలు ధన్యవాదములు తెలియజేస్తున్నారు. ముఖ్యంగా కూటమి నేతల ప్రయత్నం ఫలించిందని అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది.

## ఆర్డీటీ అధినేత మాంఛో ఫెర్రర్‌ను కలిసిన టీడీపీ ఎమ్మెల్యేలు

అనంతపురం, (చైతన్యరథం): ఆర్డీటీ సంస్థ నిర్వాహకులు మాంఛో ఫెర్రర్‌ను టీడీపీ ఎమ్మెల్యేలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్డీటీ సంస్థ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ విషయంలో కేంద్రం వద్దకు వెళ్లిన విషయాలు, ఆర్డీటీ రెన్యూవల్ విషయం మీద అసెంబ్లీలో చర్చించిన విషయాలు, కేంద్ర ప్రభుత్వం స్పందించిన తీరు, కేంద్ర మంత్రులు అందించిన సహాయ సహకారాల గురించి ఫెర్రర్‌కు వివరించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, కూటమి ప్రభుత్వం, కేంద్ర మంత్రులు ఆర్డీటీని నిలబెట్టేందుకు అందించిన సహాయ సహకారాలను ఫెర్రర్ కొనియాడారు. మాంఛో ఫెర్రర్‌ను కలిసిన వారిలో మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎంఎస్‌రాజు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పి వెంకటప్ప తదితరులు ఉన్నారు.



# గ్రామాభివృద్ధి పనుల వేగం పెంచండి

## మండల అధికారులతో సమీక్షలో మంత్రి సవిత ఆదేశం

పెనుకొండ, (చైతన్యరథం): మండల కేంద్రంలోని అతిథి గృహంలో పెనుకొండ మున్సిపాలిటీ, సోమందేపల్లి, పరిగి మండల అధికారులతో మంత్రి సవిత సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోచేపట్టాల్సిన అభివృద్ధి పనులపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మండలాల వారిగా ఎన్నార్ఈ జీఎస్ కింద ఇప్పటి వరకూ పూర్తైన పనుల వివరాలు, అలాగే కొనసాగిస్తున్న పనుల వివరాలు పురోగతి నివేదికను సమర్పించారు. కొత్త పనుల అంచనా వివరాలను తెలియజేశారు. అనంతరం అధికారులు ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని వేగంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామం అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని, ప్రత్యక్షంగా ప్రజలకు ప్రయోజనం చేకూరే పనులకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. పనులు సమయానికి, నాణ్యతతో పూర్తి చేయడం ప్రతి అధికారి బాధ్యత అని పేర్కొన్నారు. అర్హుల గుర్తింపు లో పక్షపాతం వద్దు, అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించాలని, అభివృద్దే లక్ష్యంగా అధికారులు పని చేయాలన్నారు. ఇప్పటికే దశాబ్దాలుగా పేరుకుపోయిన సమస్యల పరిష్కారం, చూపామని గ్రామాభివృద్ధి పనుల వేగవంతంగా జరగాలని, ప్రధానమైన విద్యుత్, రెవెన్యూ, హౌసింగ్, శానిటేషన్, రక్షిత మంచినీరు, ప్రజారోగ్యంతో పాటు అత్యవసర సేవలు పట్ల యుద్ధప్రాతిపదికన స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన అన్ని శాఖల అధికారులు, మండల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# వాయుసేన పరాక్రమానికి ఆపరేషన్ సిందూర్ తార్కాణం

## వైమానిక దళోత్సవంలో వాయుసేన అధిపతి ఏపీ సింగ్



భారతదేశ స్వదేశీ సామర్థ్యాలు, సాయుధ దళాల మధ్య ప్రభావవంతమైన సమన్వయానికి ఆపరేషన్ సిందూర్ ఒక ఉదాహరణ అని వాయుసేన అధిపతి ఏపీ సింగ్ పేర్కొన్నారు. 93వ వైమానిక దళ దినోత్సవంలో భాగంగా ఘజియాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా శత్రు భూభాగంపై కచ్చితమైన దాడులు చేసేందుకు స్వదేశంలో అభివృద్ధి చేసిన ఆయుధాలు అద్భుతమైన పనితీరు కనబరిచాయన్నారు. స్వదేశీ ఆయుధాలు మన విశ్వాసాన్ని వమ్ముచేయలేదన్నారు. కచ్చితమైన ప్రణాళిక, క్రమశిక్షణతో కూడిన శిక్షణ, నిర్దిత అమలుతో ఏం సాధించవచ్చనేది ఈ ఆపరేషన్లో చూపించామన్నారు. వైమానిక దళాన్ని సమర్థమంతంగా ఎలా ఉపయోగించుకోవచ్చో ప్రపంచానికి చాటిచెప్పామన్నారు. 1948, 1971, 1999తో పాటు బాలాకోట్‌లో ఉగ్రవాదుల విధ్వంసం, ఆపరేషన్ సిందూర్‌లో భారత వైమానిక యోధులు తమ పరాక్రమంతో చరిత్ర సృష్టించారన్నారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశిస్తూ, మనం దేశ గౌరవానికి సంరక్షకులమన్నారు. వైమానికదళ సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అవసరమైతే మరింత శిక్షణ తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఘర్షణ నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా అక్కడి భారతీయ పౌరులను తిరిగి తీసుకురావడంలో వైమానికదళం పాత్రను ఆయన అభినందించారు.

# లగ్జరీ హంగులతో నవీముంబై ఎయిర్‌పోర్టు సిద్ధం

## ప్రారంభించిన ప్రధాని మోదీ

దేశంలో అత్యంత రద్దీగా ఉండే ముంబయి ఎయిర్పోర్టుపై భారాన్ని తగ్గించేందుకు మరో అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చింది. నవీ ముంబయి ఎయిర్పోర్టును ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. సరికొత్త ఆకారంతోపాటు లగ్జరీ సదుపాయాలతో భవిష్యత్తు తరాలకు అనుగుణంగా దీన్ని రూపొందించారు. ముంబయితోపాటు పుణె, కొంకణ్ ప్రాంతాలకు వాణిజ్య, పర్యాటకానికి మరింత ఊతం ఇస్తుందని అశాభావం వ్యక్తం చేస్తున్నారు. ముంబయి దక్షిణానికి 37 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉల్వేలో ఈ విమానాశ్రయం నిర్మించారు. పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంలో ఈ ప్రాజెక్టును చేపట్టారు. రూ.19,650 కోట్లతో ప్రాజెక్టు తొలిదశ పూర్తి చేశారు. ప్రస్తుతం ఒక టెర్మినల్ అందుబాటులోకి రాగా, ప్రాజెక్టు పూర్తయ్యే నాటికి నాలుగు టెర్మినల్లు ఉంటాయి. 1160 హెక్టార్లలో ఈ విమానాశ్రయం విస్తరించి ఉంది. రన్‌వే పొడవు 3700 మీటర్లు. ఇలాంటివి. రెండు రన్‌వేలు ఉన్నాయి. లోటస్ ఆకారంలో ఉన్న ఈ విమానాశ్రయం, భవిష్యత్తు తరాల ఆలోచనలకు అనుగుణంగా ఉండటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ డిజైన్‌కు బ్రిటిష్ అర్కిటెక్చరల్ సంస్థ జహా హదీద్ రూపకల్పన చేసింది. ప్రారంభంలో ఏటా 2 కోట్ల మంది ప్రయాణికులకు సేవలందిస్తుంది. ప్రాజెక్టు మొత్తం పూర్తయితే ఏడాదికి 9 కోట్ల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యం ఉంటుందని అంచనా. ప్రస్తుత వార్షిక కార్గో సామర్థ్యం 0.5 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉండగా, రానున్న రోజుల్లో 3.25 మిలియన్ మెట్రిక్ టన్నులు కార్గో సేవలు అందించేలా నిర్మిస్తున్నారు. ప్రముఖుల కోసం లాంజ్‌లు, చిన్నారుల కోసం ప్రత్యేక జోన్లు, డిజిటల్ తెరలు, ప్రయాణికుల స్వల్పకాలిక విడిది కోసం ఎయిర్పోర్టులోపల ఓ హోటల్ తదితర సదుపాయాలు ఉన్నాయి.



# భారత్‌లో అమెరికా కొత్త రాయబారిగా ట్రంప్ విధేయుడు

## సెర్గియో గోర్ నియామకంపై దౌత్యవేత్తల్లో మిశ్రమ స్పందన



భారత్‌లో అమెరికా నూతన రాయబారిగా సెర్గియో గోర్‌ను నియమిస్తున్నట్లు ఇటీవల అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నియామకానికి తాజాగా సెనెట్ ఆమోదముద్ర పడింది. ఆయన భారత్‌లోనే కాకుండా దక్షిణ, మధ్య ఆసియాకు ప్రత్యేక రాయబారిగా విధులు నిర్వహించనున్నారు. ప్రస్తుతం యూఎస్ ప్రభుత్వం షట్ డౌన్‌ను ఎదుర్కొంటోన్న తరుణంలో సెనెట్ నుంచి ఈ ఆమోదం లభించింది. ఇంతకాలం వైట్‌హౌస్‌లో పర్సనల్ డైరెక్టర్‌గా కొనసాగిన 38 ఏళ్ల సెర్గియో, ట్రంప్‌నకు వీర విధేయుడు. అందుకే అతితక్కువ కాలంలోనే ఆయన ట్రంప్ పరిపాలన విభాగంలో స్థానం సంపాదించగలిగారు. అత్యంత వివాదాస్పదమైన వ్యక్తుల్లో ఒకరైన సెర్గియో గోర్ భారత్ అమెరికా రాయబారిగా, దక్షిణ, మధ్యఆసియాలో పర్యవేక్షకుడిగా నియమించడం దౌత్యవర్గాలను షాక్‌కు గురిచేసింది. గోర్ నియామకంపై భారత్లో మిశ్రమ స్పందన వచ్చిన సంగతి తెలిసిందే. విదేశీ వ్యవహారాల నిపుణుడు, మాజీ దౌత్యవేత్త కన్వల్ సిబల్ స్పందిస్తూ భారత్‌లో నియమించిన దౌత్యవేత్తను దక్షిణ, మధ్య ఆసియాకు ప్రత్యేక దూతగా నియమించడం ఇదే తొలిసారి అన్నారు.. పాకిస్థాన్ సహా పొరుగుదేశాలతో భారత్‌కు ఉన్న సంబంధాలను అతడు గమనిస్తాడన్నది వాస్తవమని పేర్కొన్నారు. అయితే.. ఈ చర్య భారత్, పాకిస్థాన్‌ను ఒకేగాటన కట్టినట్లవుతుందని అభిప్రాయపడ్డారు. ఇలాంటి అమెరికా వైఖరిని భారత్ గతంలో తీవ్రంగా వ్యతిరేకించిందన్నారు. అంతేకాదు, ఇక భారత్–అమెరికా సంబంధాల్లో ఇండో–పసిఫిక్ ప్రాధాన్యం కనుమరుగవుతుందని పేర్కొన్నారు. అధ్యక్షుడి అజెండాను ముందుకుతీసుకెళ్లడానికే ఆయన నియామకం చేపట్టారన్న విమర్శ వ్యక్తమైంది. "ప్రపంచంలోనే అతిపెద్ద జనాభా కలిగిన ప్రాంతంలో (ఆసియా దేశాలను ఉద్దేశిస్తూ) నా అజెండాను అమలుచేయడానికి, దేశాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దడంలో నాకు సహాయపడటానికి నేను పూర్తిగా విశ్వసించే వ్యక్తి నాకు కావాలి. ఆ విషయంలో సెర్గియో గొప్ప రాయబారి అవుతాడు. సెర్గియోకు నా అభినందనలు" అని ఆ నియామకం వేళ ట్రంప్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. సెర్గియోపై ట్రంప్‌నకు విపరీతమైన నమ్మకం ఉంది. ఆయన చెప్పిన మీదటే నాసా బీఫ్ నియామకాన్ని చివరి నిమిషంలో మార్చేయడం గమనార్హం.

# అనుమతి ఇవ్వండి బాధిత కుటుంబాలను కలుస్తా

**- తమిళనాడు డీజీపీని కోరిన నటుడు విజయ్**



టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీ తీవ్ర విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలో బాధిత కుటుంబాలను కలిసేందుకు తనకు అనుమతివ్వాలంటూ డీజీపీకి విజయ్ మెయిల్ పంపారు. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

తొక్కిసలాట బాధిత కుటుంబాలతో మంగళవారం విజయ్ వీడియోకాల్లో మాట్లాడిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వారిని ఓదార్చిన ఆయన, త్వరలోనే వారివద్దకు వస్తానని హామీ ఇచ్చారు. ఈ క్రమంలోనే తన పర్యటనకు అనుమతి కోరినట్లు తెలుస్తోంది. విషాదంలో ఉన్న బాధిత కుటుంబాలను స్వయంగా కలిసి సానుభూతి వ్యక్తం చేయాలని కోరుకుంటున్నట్లు డీజీపీకి పంపిన మెయిల్లో ఆయన పేర్కొన్నారు. గత నెల 27న విజయ్ కరూర్లో ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ క్రమంలో అక్కడ తొక్కిసలాట జరిగింది. 41 మంది ప్రాణాలు కోల్పోయారు. అనేకమంది. గాయపడ్డారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతికి గురిచేసింది. అంచనాలకు మించి ప్రజలు రావడంతో పాటు, ర్యాలీకి విజయ్ ఆలస్యంగా రావడమే తొక్కిసలాటకు ప్రధాన కారణంగా పోలీసులు పేర్కొన్నారు.

# కాంగ్రెస్ బలహీనతే ఉగ్రవాదులకు బలమయింది

## నిప్పులు చెరిగిన ప్రధాని నరేంద్రమోదీ



కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోదీ మరోసారి విరుచుకుపడ్డారు. 2008 ఉగ్రదాడికి దీటుగా ప్రతిస్పందించలేదని ఆరోపిస్తూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. విదేశీ ఒత్తిడి వల్లే కాంగ్రెస్ వెనక్కి తగ్గిందన్నారు. నవీ ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం తర్వాత మాట్లాడిన మోదీ, ఆ సమయంలో ఎవరు నిర్ణయం తీసుకున్నారో కాంగ్రెస్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "ముంబయి ఆర్థిక రాజధాని మాత్రమే కాదు, దేశంలో అత్యంత శక్తిమంతమైన నగరాల్లో ఒకటి.. అందుకే ఉగ్రవాదులు ఈ నగరంపై దాడి చేశారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం బలహీనతను ప్రదర్శించింది. ఉగ్రవాదులకు బలంగా మారింది. 2008 ముంబయి దాడుల తర్వాత పాకిస్థాన్పై దాడి చేసేందుకు మన భద్రతా దళాలు సిద్ధంగా ఉన్నప్పటికీ.. విదేశాల ఒత్తిడితో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం సైనిక చర్యను అడ్డుకుంది. ఇదే విషయాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ హోంమంత్రి ఇటీవల వెల్లడించారు. నాటి నిర్ణయం ఎవరు తీసుకున్నారో కాంగ్రెస్ చెప్పాలి. ఈ తప్పిదానికి దేశం ఎంతో మందిని కోల్పోవాల్సి వస్తోంది. పౌరుల రక్షణ, జాతీయ భద్రత కంటే ఏదీ ఎక్కువ కాదు" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పాకిస్థాన్‌పై ప్రతీకార చర్యలకు దిగకూడదని అంతర్జాతీయంగా ఒత్తిడి వచ్చిందని ఓ ఇంటర్వ్యూలో మాజీ హోంమంత్రి పీ చిదంబరం అంగీకరించడం ఇటీవల చర్చనీయాంశమైంది. యుద్ధం మొదలు పెట్టవద్దని అమెరికా కూడా నాటి కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వానికి సూచించిందన్నారు. చిదంబరం చేసిన వ్యాఖ్యలను ప్రధాని మోదీ పరోక్షంగా ప్రస్తావిస్తూ కాంగ్రెస్ తీరుపై ధ్వజమెత్తారు.

# పెరుగుతున్న దగ్గుమందు మృతుల సంఖ్య

## రంగంలోకి దిగిన ప్రపంచ ఆరోగ్య సంస్థ

దగ్గు మందుతో చిన్నారుల మరణాల ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది. మధ్యప్రదేశ్లో 'కోల్డ్రిఫ్' దగ్గుమందు కారణంగా పలువురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దీనిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పందించింది. ఈ ఔషధం ఎగుమతులపై భారత్‌ను కూడా ఆరా తీసినట్లు తెలుస్తోంది."చిన్నారుల మరణాలకు కారణమైన కోల్డ్రిఫ్ దగ్గు మందును ఇతర దేశాలకు ఎగుమతి చేశారా అని డబ్ల్యూహెచ్ఓ భారత్‌ను అడిగింది. సంబంధిత అధికారుల నుంచి వివరణ వచ్చిన తర్వాత ఈ ఔషధంపై గ్లోబల్ మెడికల్ ప్రొడక్ట్స్ అలర్ట్ జారీ చేయాలా? వద్దా? అనే దానిపై అంచనా వేయనుంది" అని ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి.

20కి పెరిగిన మృతులు ఈ దగ్గుమందు కారణంగా చిన్నారుల మరణాలు పెరుగుతుండటం కలవరపెడుతోంది. ఇప్పటికే మధ్యప్రదేశ్‌లో మృతుల సంఖ్య 20కి చేరింది. ఒక్క చింద్వాడాలోనే 17 మంది ప్రాణాలు కోల్పోయినట్లు మధ్యప్రదేశ్ ఆరోగ్య మంత్రి రాజేంద్ర శుక్లా బుధవారం వెల్లడించారు. మరో ఐదుగురు చిన్నారుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఇలాంటి కల్తీ దగ్గుమందు తాగి రాజస్థాన్‌లో నూ కొందరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. కోల్డ్రిఫ్ దగ్గుమందును తమిళనాడులోని కాంచీపురానికి చెందిన శ్రీసన్ ఫార్మా యూనిట్ తయారు చేసింది. మరణాల నేపథ్యంలో ఈ కంపెనీలో తనిఖీ చేయగా సిరప్‌లో 48.6 శాతం డైథిలిన్ గ్లైకాల్ ఉందని తేలింది. ఇది అత్యంత విషపూరితమైనదిగా అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఈ కంపెనీపై చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమయ్యారు. మరోవైపు, ఈ సిరప్‌పై ఇప్పటికే పలు రాష్ట్రాలు నిషేధం విధించాయి.

# రాత్రి వేళల్లో నాగినిగా భయపెడుతున్న భార్య


## కలెక్టర్‌కు మొరపెట్టుకున్న బాధితభర్త



సమస్యలపై ప్రజల నుంచి వినతుల స్వీకారానికి నిర్వహించే సమాధాన్ దివస్' (ప్రజా ఫిర్యాదుల దినం)లో ఓ వ్యక్తి నుంచి వచ్చిన అర్జీ చూసి యూపీలోని సీతాపూర్ కలెక్టర్ నివ్వెరపోయారు. తన భార్య నసీమున్ రాత్రిపూట నాగినిగా మారిపోయి బుస కొడుతోందని. బెదిరిస్తోందని మహమూదాబాద్ తహసీల్లోని లోధాసా గ్రామానికి చెందిన మెరాజ్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీసులకు చెప్పినా ప్రయోజనం లేకపోవడంతో సహాయం కోసం కలెక్టర్ వరకు రావాల్సి వచ్చిందని చెప్పుకొచ్చారు. ఈ విషయాన్ని పరిశీలించి, తగిన చర్య తీసుకోవాల్సిందిగా పోలీసులను కలెక్టర్ ఆదేశించారు. ఈ ఫిర్యాదు చర్చనీయాంశంగా మారింది.

# రసాయన శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

**- మెటల్-ఆర్గానిక్ ఫ్రేమ్ వర్క్స్ అభివృద్ధికిగాను అవార్డు**




సుసుము కిటాగవా  రిచర్డ్ రాబ్సన్  ఒమర్ ఎం యాఘీ


రసాయన శాస్త్రంలో విశేష పరిశోధనలు జరిపిన ముగ్గురు శాస్త్రవేత్తలకు ఈ ఏడాది నోబెల్ బహుమతి లభించింది. మెటల్ -ఆర్గానిక్ ఫ్రేమ్ వర్క్స్ అభివృద్ధి చేసినందుకుగాను సుసుము కిటాగవా, రిచర్డ్ రాబ్సన్, ఒమర్ ఎం యాఘీలకు ఈ పురస్కారాన్ని అందించనున్నట్టు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ వెల్లడించింది. వీరు కొత్తరకం మాలిక్యూలర్ ఆర్కిటెక్చర్ అభివృద్ధి చేసినట్లు తెలిపింది. గతేడాది ముగ్గురికి ఈ అవార్డు దక్కింది. ప్రొటీన్లపై విశేష పరిశోధనలు చేసిన డేవిడ్ బేకర్, డెమిస్ హసాబిస్, జాన్ జంపర్లు ఈ పురస్కారం అందుకున్నారు. మొత్తంగా 1901-2024 మధ్యకాలంలో 116సార్లు రసాయన శాస్త్రంలో నోబెల్‌ను ప్రకటించగా ఇప్పటివరకు 195మంది దీనిని అందుకున్నారు. వీరిలో జాన్‌బీ గూడెనఫ్ 97 ఏళ్ల వయసులో కెమిస్ట్రీలో పురస్కారం అందుకున్న వృద్ధుడిగా నిలువగా.. ఫ్రెడెరిక్ జోలియట్ 35ఏళ్ల వయసులో నోబెల్ అందుకున్న అతిపిన్న వయస్కుడిగా నిలిచారు. ఇక ఫ్రెడరిక్ సాంగెర్, బ్యారీ షార్ప్ లెస్లు రసాయన శాస్త్రంలో రెండుసార్లు నోబెల్ అందుకోవడం విశేషం. మరోవైపు సోమవారం (అక్టోబర్ 6న) మొదలైన నోబెల్ పురస్కారాల ప్రకటన అక్టోబర్ 13వరకు కొనసాగనుంది. తొలుత వైద్యశాస్త్రంలో, మంగళవారం భౌతికశాస్త్రంలో విజేతలను ప్రకటించగా.. నేడు రసాయనశాస్త్రంలో నోబెల్ గ్రహీతల పేర్లు వెల్లడించారు. గురువారం సాహిత్యం, శుక్రవారం శాంతి బహుమతి, అక్టోబర్ 13న అర్థశాస్త్రంలో ఈ పురస్కారం అందుకోనున్న వారి పేర్లను ప్రకటిస్తారు. ఆల్ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి రోజైన డిసెంబర్ 10న విజేతలకు అవార్డులను అందజేస్తారు.

# ఆ మృతదేహాలు అప్పగించాల్సిందే

**యహ్యా, మహమ్మద్ సిన్వర్‌ల కోసం హమాస్ డిమాండ్**

ఇజ్రాయెల్ దాడుల్లో హతమైన తమ నేతలు యాహ్యా, మహమ్మద్ సిన్వర్ మృతదేహాలను అప్పగించాలని హమాస్ డిమాండ్ చేసింది. ఇజ్రాయెల్‌కు చెందిన బందీలకు ప్రతిగా పాలస్తీనా ఖైదీలను విడుదల చేసేటప్పుడు వారి మృతదేహాలను అప్పజెప్పాలని హమాస్ కోరింది. ఈ మేరకు వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం పేర్కొంది. గతంలోనూ హమాస్ ఈ డిమాండ్ చేయగా.. ఇజ్రాయెల్ తిరస్కరించిందని వెల్లడించింది. గాజా యుద్ధాన్ని ముగించడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 20 సూత్రాల ఫార్ములాను ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. దీనికి అంగీకరిస్తున్నట్టు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఇప్పటికే ప్రకటించారు. హమాస్ సైతం ముందుకొచ్చినప్పటికీ.. కొన్ని అంశాలపై చర్చలు జరపాల్సిఉందని పేర్కొంది. ఈ శాంతి ప్రణాళిక తొలిదశ అమలుపై హమాస్-ఇజ్రాయెల్ మధ్య పరోక్ష చర్చలు ఈజిప్టులో జరుగుతున్నాయి. దీని ప్రకారం ఒప్పందం కుదిరిన 72గంటల్లో బందీలందరినీ హమాస్ విడుదల చేయాలి. హమాస్ చెరలో 48మంది బందీలుండగా.. వారిలో 20మంది మాత్రమే ప్రాణాలతో ఉన్నట్టు భావిస్తున్నారు. ఆ బందీలకు బదులుగా 2023 అక్టోబర్ 7నుంచి ఇజ్రాయెల్ అదుపులో ఉన్న గాజా ప్రజలు, జీవిత ఖైదు అనుభవిస్తోన్న 250మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేయనున్నారు.





**జాబితాలు ఇచ్చిపుచ్చుకున్న హమాస్-ఇజ్రాయెల్**

ఈజిప్టులో జరుగుతోన్న శాంతిచర్చల నేపథ్యంలో కీలక ముందడుగు పడింది. విడుదల కావాల్సిన బందీలు, ఖైదీల పేర్లు ఉన్న జాబితాలను ఇజ్రాయెల్- హమాస్ మార్పిడి చేసుకున్నాయి. ఇదిలాఉంటే.. ఉగ్రవాదాన్ని అంతం చేసే నెపంతో ఇజ్రాయెల్ రెండేళ్లుగా గాజాలో జాతిహననం కొనసాగిస్తోంది. ఆసుపత్రులు, పాఠశాలలు, నివాస భవనాలు, శరణార్థి శిబిరాలు ఇలా అన్నింటిపై ఇంతవరకు సుమారు రెండు లక్షల టన్నుల పేలుడు పదార్థాలను గుమ్మరించింది. వాటి ధాటికి ఇప్పటివరకు దాదాపు 67వేల మంది పాలస్తీనీయులు ప్రాణాలు కోల్పోయారు. 1.7 లక్షలమంది క్షతగాత్రులయ్యారు. వారిలో సగానికిపైగా చిన్నారులూ మహిళలే. ఇజ్రాయెల్ విధ్వంసం ధాటికి గాజాలో 90శాతానికి పైగా ఇళ్లు ధ్వంసమయ్యాయి. 9 లక్షలమంది నిర్వాసితులయ్యారు. బయటి నుంచి వచ్చే ఆహార సరఫరాలకు టెల్‌అవీవ్ మోకాలడ్డటంతో గాజాలో ఆకలి బాధలు మిన్నంటుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ శాంతి ప్రణాళికలకు ఇండియా, చైనా, జపాన్‌లతోపాటు పలు ఐరోపా, అరబ్ దేశాలు స్వాగతించాయి. అనుకున్నట్లు జరిగితే పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలకు ముగింపు లభించే అవకాశం ఉంది.

# రష్యా చమురే భారత్‌కు ఆధారం కాదు

రష్యానుంచి కొనుగోలు చేసే చమురే భారత ఆర్థిక వ్యవస్థకు ఆధారం కాదని అమెరికా వాణిజ్య ప్రతినిధి, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సలహాదారు జెమీసన్ గ్రీర్ అన్నారు. అయినా ఇప్పటికే భారత్ తన చమురు కొనుగోళ్లను మాస్కోనుంచి మళ్లిస్తోందని తెలిపారు. న్యూయార్క్‌లో జరిగిన ది ఎకనామిక్ క్లబ్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "రష్యాతో భారత్‌కు బలమైన సంబంధాలు ఉన్నాయి. కానీ, గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో మాస్కోనుంచి చమురును కొనుగోలు చేయలేదు. డిస్కౌంట్ ధరల కారణంగా గత రెండు, మూడేళ్లనుంచి రష్యా చమురును ఎక్కువగా కొంటోంది. ఇది కేవలం వినియోగం కోసం మాత్రమే కాదు. ఆ చమురును శుద్ధిచేసి రీసేల్ చేస్తున్నారు. దీన్నిబట్టి చూస్తే భారత ఆర్థిక వ్యవస్థకు రష్యా చమురు కొనుగోలు ఒక్కటే బలమైన ఆధారం కాదని అర్థమవుతోంది. అందుకే వారు ఇతర



దేశాలనుంచి కొనుగోలు చేయాలని సూచిస్తున్నాం. దీన్ని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాం. ఇప్పటికే వారు ఈ విషయంలో వైవిధ్యభరిత చర్యలు ప్రారంభించడం మేం చూస్తున్నాం" అని గ్రీర్ పేర్కొన్నారు.

ఇక, భారత్ సార్వభౌమత్వ దేశమని ట్రంప్ సలహాదారు అన్నారు. ఆ దేశం సొంత నిర్ణయాలు తీసుకోగలదని తెలిపారు. "ఇతర దేశాలు ఎవరితో సంబంధాలు కొనసాగించాలి. ఎవరితో కొనసాగించకూడదు అనేది మేం చెప్పాలనుకోవడం లేదు. ఈ విషయంలో మేం ఎవర్నీ శాసించడం లేదు" అని గ్రీర్ తెలిపారు. ఈ సందర్భంగా రష్యా చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై ట్రంప్ విధించిన సుంకాల గురించీ ఆయన ప్రస్తావించారు. "అమెరికాతో వాణిజ్యం కారణంగా భారత్‌కు 40 బిలియన్ డాలర్లకు పైగా మిగులు ఉంటోంది. మేం వారికి విక్రయించే దానికంటే.. భారత్ మాకు అమ్మేవే ఎక్కువ. అయితే, రష్యా చమురును కొనుగోలు చేయడంతో ఉక్రెయిన్‌పై యుద్ధానికి పుతిన్‌కు న్యూఢిల్లీ వనరులను అందించినట్లవుతోంది. మాస్కోపై ఒత్తిడి తెచ్చేందుకే భారత్‌పై ఈ స్థాయిలో సుంకాలు విధించాల్సి వచ్చింది. అయితే, టారిఫ్‌ల విషయంలో అమెరికాతో ఆ దేశం గొప్ప డీల్ చేసుకుంటోంది" అని గ్రీర్ వెల్లడించారు.

# సైన్యమే లక్ష్యంలో పాక్‌లో బాంబు దాడి

**- ఇద్దరు అధికార్లు సహా 11మంది హతం**



పాకిస్థాన్‌లో మరోసారి బాంబు పేలుడు చోటుచేసుకుంది. సాయుధ బలగాలు ప్రయాణించే వాహనమే లక్ష్యంగా మిలిటెంట్లు జరిపిన దాడిలో ఇద్దరు అధికారులు సహా 11మంది పారామిలిటరీ సిబ్బంది హతమైనట్టు సమాచారం. ఈమేరకు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. కుర్రం జిల్లాలో పాక్ సైనిక కాన్వాయిపై మిలిటెంట్లు బాంబు దాడికి పాల్పడ్డారు. పక్కా ప్రణాళికతో చేసిన దాడిలో ఇద్దరు అధికారులు, తొమ్మిదిమంది పారామిలిటరీ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడి అనంతరం మిలిటెంట్లు పెద్దఎత్తున కాల్పులకు పాల్పడ్డారు. దాడికి పాల్పడిన వారి కోసం భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ దాడికి సంబంధించి పాక్ ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటనను విడుదల చేయలేదు. ఇక, తెహ్రీక్ తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఈ దాడికి తమదే బాధ్యతని ప్రకటించినట్టు తెలుస్తోంది. అఫ్గాన్-పాక్ సరిహద్దు నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తోన్న టీటీపీ గ్రూప్ పాక్ దళాలకు తలనొప్పిగా మారింది. తాలిబన్లు అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి ఇస్లామాబాద్‌కు వ్యతిరేకంగా పాక్ భద్రతా సిబ్బంది, ప్రజలు లక్ష్యంగా ఈ గ్రూప్ పలు దాడులకు పాల్పడింది.

## ఈసారి యుద్ధం జరిగితే.. భారత్‌పై కవ్వింపులకు తెగబడిన పాక్ రక్షణ మంత్రి

**యుద్ధం అవకాశాలను కొట్టిపారేయలేమని వ్యాఖ్యలు**



*ఆపరేషన్ సిందూర్‌తో భారత్ దెబ్బను రుచి చూసినా.. పాకిస్థాన్ ప్రగల్బాలు మాత్రం ఆపట్లేదు. తాజాగా ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ.. భారత్‌తో మళ్లీ యుద్ధం జరిగే అవకాశాలను తోసిపుచ్చలేమన్నారు. అయితే, ఈసారి యుద్ధం వస్తే తాము అనుకూల ఫలితాలు సాధిస్తామంటూ బీరాలు పలికారు. పాక్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఖవాజా ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. "నేను ఉద్రిక్తతలను కోరుకోవట్లేదు. కానీ, ముప్పు పొంచి ఉన్నమాట వాస్తవం. భారత్‌తో యుద్ధం అవకాశాలను కొట్టిపారేయలేం. కానీ, ఈసారి యుద్ధం జరిగితే.. గతంలోకన్నా మెరుగైన ఫలితాలు సాధిస్తాం" అంటూ రెచ్చగొట్టేలా మాట్లాడారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న పాక్‌కు ఇటీవల భారత్ ఆర్మీ చీఫ్ గట్టి వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దానికి బదులిస్తూనే ఖవాజా ఈ విధంగా కవ్వింపులకు పాల్పడ్డారు. ఇటీవల భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది మాట్లాడుతూ.. "భారత్ పూర్తి సన్నద్ధంగా ఉంది. ఆపరేషన్ సిందూర్ 1.0లో మాదిరిగా ఈసారి సహనం ప్రదర్శించబోం. పాక్ ప్రపంచపటంలో ఉండాలనుకుంటే సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపి తీరాల్సిందే. లేదంటే ఆ దేశాన్ని చరిత్ర నుంచి తుడిచిపెట్టాల్సి వస్తుంది జాగ్రత్త" అని జనరల్ ద్వివేది గట్టిగా హెచ్చరించారు. అంతేగాక, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగ ఉండాలని సైనికులను ఆదేశించారు. "పూర్తి సన్నద్ధంగా ఉండండి. దేవుడు వాంఛిస్తే ఆ అవకాశం త్వరలోనే మనకు వస్తుంది" అని భారత జవాన్లకు ఆయన పిలుపునిచ్చారు.*

# వైజాగ్‌లో పరుగుల వరదే...

◆ మహిళల వరల్డ్‌కప్‌లో

నేడు దక్షిణాఫ్రికాతో భారత్ మ్యాచ్

విశాఖపట్నం: మహిళల వరల్డ్‌కప్‌లోని గత రెండు మ్యాచ్‌లలో భారత జట్టు బ్యాటింగ్‌లో తడబడింది. ఈ నేపథ్యంలో విశాఖలో బలమైన దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాతో హర్మన్‌ప్రీత్ సేన తలపడనుంది. అయితే కీలక మ్యాచ్‌లకు ఎలాంటి పిచ్‌ను తయారు చేస్తారోనన్న చర్చ జోరుగా సాగుతుంది. కానీ, విశాఖలో ఫ్లాట్ పిచ్‌ను తయారు చేశారన్న వార్త భారత బ్యాటర్లకు ఊరటనిచ్చేదే. శ్రీలంక, పాకిస్థాన్‌పై జరిగిన మ్యాచ్‌ల్లో భారత్ గెలిచింది. కానీ, అదంతా బౌలర్ల ప్రతిభతోననే చెప్పుకోవాలి. బ్యాటర్లు విఫలమైనా.. బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థులను కట్టడి చేశారు. కానీ, బిగ్ మ్యాచ్‌లు కావడంతో హర్మన్, స్మృతి ఫామ్‌లోకి రావాలని అభిమానులు కోరుకొంటున్నారు. 'వికెట్ బ్యాటర్లకు అనుకూలం. గత కొన్ని మ్యాచ్‌లను పరిశీలిస్తే.. మంచు ప్రభావం లేకపోతే స్పిన్నర్లకు కొంత సహకారం లభించవచ్చు' అని ఆంధ్ర క్రికెట్ సంఘం తెలిపింది. వైజాగ్‌లో 11 ఏళ్ల తర్వాత గురువారం మహిళల వన్డే మ్యాచ్ జరుగుతోంది. 2014, జనవరి 23న ఇదే వేదికపై శ్రీలంకతో భారత్ తలపడింది.



**విశాఖ చేరుకున్న దక్షిణాఫ్రికా క్రికెటర్లు**

మహిళల వన్డే ప్రపంచ కప్‌లో భాగంగా గురువారం భారత జట్టుతో తలపడనున్న దక్షిణాఫ్రికా క్రికెటర్లు మంగళవారం విశాఖపట్నం చేరుకున్నారు. సోమవారం ఇండోర్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా విజయం సాధించిన సంగతి తెలిసిందే.




### ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్..

## సిరాజ్, జడేజాకు అత్యుత్తమ పాయింట్లు

టీమిండియా ప్లేయర్లు మహ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తమ కెరీర్‌లో అత్యుత్తమ టెస్టు రేటింగ్ పాయింట్లు సాధించారు. వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టులో అదరగొట్టిన వీరిద్దరూ బుధవారం నాడు ఐసీసీ ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో తమ స్థానాలను మెరుగుపర్చుకున్నారు. విండీస్‌తో మొదటి టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఏడు వికెట్లు పడగొట్టిన సిరాజ్ (718 పాయింట్లు) మూడు స్థానాలు ఎగబాకి 12వ స్థానానికి చేరుకున్నాడు. సిరాజ్ కు టెస్టు కెరీర్‌లో అత్యుత్తమ రేటింగ్ పాయింట్లు ఇవే. జస్‌ప్రీత్ బుమ్రా టాప్‌లో కొనసాగుతున్నాడు. స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ ఏడు స్థానాలు ఎగబాకి 21 ర్యాంకులో నిలిచాడు. మరోవైపు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో సీనియర్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా(644 పాయింట్లు) కెరీర్‌లో ఉత్తమ రేటింగ్ పాయింట్లు అందుకున్నాడు. జడ్డూ ఆరు స్థానాలు మెరుగై 25వ స్థానానికి ఎగబాకాడు. విండీస్‌పై జడేజా తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ (104) చేసిన సంగతి తెలిసిందే. అలానే కేఎల్ రాహుల్ నాలుగు స్థానాలు మెరుగుపరుచుకుని 35వ స్థానానికి చేరుకున్నాడు. బ్యాటింగ్ విభాగంలో ఇంగ్లాండ్ ప్లేయర్ జో రూట్ నంబర్ వన్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. యశస్వి జైస్వాల్ రెండు స్థానాలు దిగజారి ఏడో ర్యాంక్‌కు పడిపోగా.. రిషభ్ పంత్, శుభ్‌మన్ గిల్ వరుసగా 8, 13 స్థానాల్లో నిలిచారు. ఆల్‌రౌండర్ల విభాగంలో జడేజా టాప్‌లో ఉండగా.. వాషింగ్టన్ సుందర్ నాలుగు స్థానాలు మెరుగై 11 స్థానంలో నిలిచాడు.




### అండర్ 19 యూత్ రెండో టెస్ట్..

## ఆస్ట్రేలియాపై భారత్ ఘన విజయం

మెకే (ఆస్ట్రేలియా): అండర్ 19 రెండో టెస్ట్‌లో ఆసీస్‌పై భారత్ ఘన విజయం సాధించింది. మొదటి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 135 పరుగులకు ఆలౌట్ కాగా భారత్ 171 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం రెండో ఇన్నింగ్‌లో ఆస్ట్రేలియా 116 పరుగులకు కుప్ప కూలింది. 81 పరుగుల లక్ష్య చేదనతో బరిలో దిగిన భారత్ మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

## ఖతార్‌పై యూఏఈ విజయం

వరల్డ్ టీ20 క్వాలిఫైయర్‌లో ఖతార్, యూఏఈ మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో యూఏఈ ఘన విజయం సాధించింది. తొలుత ఖతార్ 20 ఓవర్లలో 118 పరుగులు చేసింది. 119 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన యూఏఈ మూడు వికెట్లు కోల్పోయి విజయం సాధించింది.

### మహిళల వన్డే వరల్డ్ కప్..

# పాక్‌పై ఆసీస్ ఘనవిజయం

మెకే (ఆస్ట్రేలియా): మహిళల వరల్డ్ కప్ వన్డే మ్యాచ్‌లో పాక్‌పై ఆస్ట్రేలియా విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ 50 ఓవర్లలో 221/9 పరుగులు చేసింది. 115 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న ఆస్ట్రేలియాను బెత్ మూనీ 114 బంతుల్లో 11 ఫోర్లతో 109 పరుగులు, అలానా కింగ్ 49 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 51 పరుగులు చేసి ఆదుకున్నారు. తొమ్మిదో వికెట్‌కు 106 పరుగులు జోడించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన పాక్ 114 రన్స్‌కు ఆలౌటైంది.



## వన్డే జట్టులో స్టార్క్..భారత్‌తో సిరీస్‌కు ఆస్ట్రేలియా జట్ల ఎంపిక

మెల్‌బోర్న్: భారత్‌తో జరిగే వన్డే, టీ20 సిరీస్‌ల కోసం ఆస్ట్రేలియా జట్లను ప్రకటించారు. గత నెల టీ20 ఫార్మాట్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించిన పేసర్ మిచెల్ స్టార్క్‌కు వన్డే జట్టులో చోటు దక్కింది. ఈనెల 19 నుంచి భారత్‌తో మూడు వన్డేల సిరీస్ జరుగనుంది. ప్యాట్ కమిన్స్ గాయం నుంచి కోలుకోక పోవడంతో జట్టుకు మిచెల్ మార్ష్ నాయకత్వం వహించనున్నాడు. 15 మంది ఆటగాళ్ల జాబితాలో మాథ్యూ రెన్‌షా, షార్ట్, మిచ్ ఓవెన్‌లకు కూడా చోటు దక్కింది. మరోవైపు ఈనెల 29 నుంచి జరిగే ఐదు టీ20 సిరీస్‌లోని తొలి రెండు మ్యాచ్‌లకు మాత్రమే జట్టును ప్రకటించారు. మిగిలిన మ్యాచ్‌లకు జట్లను ఆ తర్వాత ప్రకటించే అవకాశం ఉంది.

వన్డే జట్టు: మార్ష్ (కెప్టెన్), బార్ట్‌లెట్, క్యారీ, కనోలీ, డ్వార్షుస్, ఎల్లిస్, గ్రీన్, హాజెల్‌వుడ్, హెడ్, ఇన్‌గ్లిస, ఓవెన్, రెన్‌షా, షార్ట్, స్టార్క్, జంపా.

టీ20 జట్టు: మార్ష్ (కెప్టెన్), ఎబాట్, బార్ట్‌లెట్, డేవిడ్, డ్వార్షుస్, ఎల్లిస్, హాజెల్‌వుడ్, హెడ్, ఇన్‌గ్లిస్, కునేమన్, షార్ట్, ఓవెన్, స్టొయినిస్, జంపా.

# ట్రోఫీ లేకుండానే టీమిండియా సంబరాలు

◆ **ఆ ఐడియా ఎవరిదంటే..**

ఈ ఏడాది జరిగిన ఆసియా కప్ చాలా వాడివేడిగా సాగింది. ముఖ్యంగా భారత్, పాక్ మధ్య జరిగిన మ్యాచ్‌లు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారితీశాయి. ఈ టోర్నీలో విజేతగా నిలిచిన టీమిండియా ట్రోఫీ తీసుకోలేకపోయింది. ఆసియా క్రికెట్ కౌన్సిల్ చీఫ్‌గా ఉన్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ అధ్యక్షుడు మొహ్సిన్ నఖ్వీ తనతో పాటే ట్రోఫీని తీసుకెళ్లిపోయారు. నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ తీసుకోవడానికి టీమిండియా నిరాకరించడంతో అతడు తనతో పాటు హొటల్ గదికి ట్రోఫీని తీసుకెళ్లిపోయారు. ట్రోఫీ లేకపోయినప్పటికీ టీమిండియా ఆటగాళ్లు తమదైన శైలిలో సంబరాలు చేసుకున్నారు. గత టీ-20 ప్రపంచకప్ విజేతగా నిలిచిన తర్వాత రోహిత్ ట్రోఫీ అందుకుని రోబోలా నడిచి వచ్చాడు. ట్రోఫీ లేకపోయినా ప్రస్తుత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా అదే తరహాలో నడిచి వచ్చి జట్టు ఆటగాళ్లతో సంబరాలు చేసుకున్నాడు. ఇలా చేయడం వెనుక టీమిండియా బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ ఉన్నాడట. ఈ విషయాన్ని తాజాగా వరుణ్ చక్రవర్తి వెల్లడించాడు. 'ట్రోఫీ కోసం చాలా సేపు ఎదురు చూశాం. కానీ అలా జరగలేదు. అప్పుడు అర్ష్‌దీప్ ఒక ఐడియా ఇచ్చాడు. ట్రోఫీ లేకపోయినా కప్ అందుకున్నట్టు చేద్దామని, తర్వాత ఫొటోలు మార్చుకుందామని చెప్పాడు. దీంతో అందరం అలాగే చేశాం. నేనూ కూడా అలాగే చేశా. బెడ్ పైన నా పక్కన కాఫీ కప్ ఉంచారు. ట్రోఫీ లేకుండా సంబరాలు చేసుకోవడం చాలా కొత్తగా ఉంది. మా డ్రెస్సింగ్ రూమ్‌లో అద్భుతమైన వాతావరణ ఉంది' అని వరుణ్ చెప్పాడు.



# వెంకీ త్రివిక్రమ్..
# కథ మొదలైంది



త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకటేశ్ కథానాయకుడిగా సినిమా రూపొందుతోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ మొదలైంది. ఈ సందర్భంగా సెట్స్‌లో వెంకటేశ్, త్రివిక్రమ్ కలిసి దిగిన ఫొటోను నిర్మాత నాగవంశీ పంచుకున్నారు. "20 నెలల సుదీర్ఘ విరామం తర్వాత మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ మళ్లీ కెమెరా వెనక్కి వచ్చారు. ప్రతి ఒక్కరి అభిమాన కథానాయకుడు వెంకటేశ్‌తో చేతులు కలిపారు. 'ది ఓజీస్' ఎంటర్టైన్మెంట్ మళ్లీ పునరావృతం కానుంది" అని పేర్కొన్నారు. సంచలన విజయం సాధించిన 'సంక్రాంతికి వస్తున్నాం' తర్వాత వెంకటేశ్ సోలోగా నటిస్తున్న సినిమా ఇదే. వెంకటేశ్ కథానాయకుడిగా ఇది వరకు వచ్చిన 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' సినిమాలకు త్రివిక్రమ్ స్క్రిప్టును అందించారు. దీంతో ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. త్రివిక్రమ్ గత చిత్రాల్లాగే ఇందులోనూ ఇద్దరు నాయికలకు అవకాశమున్నట్టు ఇటీవల వార్తలు వచ్చాయి. ఆ పాత్రల కోసం త్రిష, నిధి అగర్వాల్‌తో పాటు రుక్మిణీ వసంత్ పేర్లు పరిశీలనలో ఉన్నట్టు ప్రచారం జరిగింది. ఇదిలావుంటే, చిరంజీవి-అనిల్ రావిపూడి కాంబోలో రానున్న 'మన శంకర వరప్రసాద్'లో వెంకటేష్ అతిథి పాత్రలో కనిపించనున్నారు. అలాగే 'దృశ్యం - 3'తో మరోసారి థ్రిల్ పంచనున్నారు.

# యదువంశీతో నిహారిక సినిమా?

గతేడాది చిన్న చిత్రంగా విడుదలై మంచి హిట్ అందుకున్న 'కమిటీ కుర్రోళ్లు' కాంబో మరోసారి రిపీట్ అవుతోంది. ఆడియన్స్‌కు కనెక్టయ్యేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించిన యువ దర్శకుడు యదువంశీ మరోసారి పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై సినిమా చేయనున్నారు. నిహారిక కొణిదెల నిర్మించనున్నారు. 2026లో ఈ మూవీ సెట్స్‌పైకి వెళ్లనుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. 'కమిటీ కుర్రోళ్లు' మూవీతో 11మంది హీరోలు, నలుగురు హీరోయిన్లు తెలుగు సినిమాకు పరిచయమయ్యారు. బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా రూ.24.5 కోట్ల వసూళ్లను సాధించింది. అవార్డుల రేసులోనూ సత్తా చాటింది. సైమా, గద్దర్ అవార్డుల్లో సత్తా చాటింది. మరోవైపు నిహారిక కొణిదెల నిర్మిస్తున్న మరో చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో సంగీత్ శోభన్, నయన్‌సారిక జంటగా నటిస్తున్నారు.




# ప్రభాస్..
# డబుల్ ఫీస్ట్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధికుమార్‌లు హీరోయిన్లుగా ఫ్యాన్స్‌కి ఫుల్ మీల్స్ పెట్టడానికి దర్శకుడు మారుతీ తెరకెక్కించిన చిత్రమే "ది రాజా సాబ్". కొద్దికాలంగా ఒక్కో అప్డేట్‌తో హైప్ సెట్ చేసుకుంటున్న సినిమాపై మేకర్స్ మరో సాలిడ్ అప్డేట్ ఇచ్చారు. అయితే ఈ ఉదయమే థమన్ ప్రభాస్‌పై ఓ క్రేజీ డాన్స్ నెంబర్ ఉందని రివీల్ చేయగా.. మేకర్స్ ఒకటి కాదు రెండు చార్ట్‌బస్టర్ సాంగ్స్ ఉన్నాయంటూ కన్ఫర్మ్ చేశారు. ఇక ఈ సాంగ్‌తోనే నేడు కొత్త షెడ్యూల్ షూటింగ్‌ని మొదలు పెట్టినట్టుగా కూడా కన్ఫర్మ్ చేశారు. సో మొత్తానికి ప్రభాస్ ఫ్యాన్స్‌కి రాజా సాబ్‌లో డబుల్ డాన్స్ ఫీస్ట్‌లు గ్యారెంటీ అని అర్థమవుతోంది.



# మన లైఫ్.. ఇతరుల కోసం కాదు

కొన్ని రోజులుగా నటి రష్మిక పేరు ట్రెండింగ్‌లోవున్న విషయం తెలిసిందే. వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఆమె తాజాగా ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. తన అప్‌కమింగ్ మూవీ 'థామా' విడుదల సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో కన్నడ ఇండస్ట్రీ తనను బ్యాన్ చేసిందంటూ వస్తోన్న రూమర్స్‌పై స్పందించారు. తెరవెనక ఏం జరుగుతుందో చాలామందికి తెలియదన్నారు. ఇటీవల విడుదలై మంచి ఆదరణ సొంతం చేసుకున్న 'కాంతార చాప్టర్-1'పై స్పందించకపోవడంపై రష్మిక విమర్శలు ఎదుర్కొన్నారు. దీనిపై ఆమె మాట్లాడుతూ.. "ఏ సినిమా అయినా విడుదలైన రెండు, మూడు రోజుల్లో నేను చూడలేను. కాంతార కూడా అంతే. విడుదలయ్యాక కొన్ని రోజులకు చూశాను. చిత్రబృందాన్ని అభినందిస్తూ మెసేజ్ కూడా చేశా. వాళ్లు నాకు ధన్యవాదాలు తెలిపారు. తెరవెనక ఏం జరుగుతుందో ఎవరికీతెలియదు. మన వ్యక్తిగత జీవితాన్ని కెమెరా ముందుకు తీసుకురాలేం కదా. అలాగే, నేను ప్రతీ విషయాన్నీ ఆన్‌లైన్‌లో పంచుకునే వ్యక్తిని కాదు. అందుకే ప్రజలు ఏమనుకున్నా పట్టించుకోను. వాళ్లు నా నటన గురించి ఏం మాట్లాడతారు అనేదే నాకు ముఖ్యం. దానిని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటాను" అని తెలిపారు. ఇక కన్నడ ఇండస్ట్రీ తనను బ్యాన్ చేసిందంటూ వస్తోన్న వార్తలపై రష్మిక సమాధానమిచ్చారు. ఇప్పటివరకూ తనను ఏ ఇండస్ట్రీ నిషేధించలేదన్నారు. ఇతరుల కోసం జీవించొద్దన్నారు. ఇలాంటి రూమర్స్ అన్నీ అపార్థంవల్ల పుట్టుకొస్తాయని అన్నారు.



# ఓటీటీకి వచ్చేసిన
# వార్-2

ఈ ఏడాది ప్రేక్షకులు అత్యంత ఆసక్తిగా ఎదురు చూసిన భారతీయ సినిమాల్లో 'వార్ 2' ఒకటి. ప్రముఖ నిర్మాణ సంస్థ యష్‌రాజ్ ఫిల్మ్స్, స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందిన ఫ్రాంచైజీలో ఎన్టీఆర్, హృతిక్ రోషన్ నటించారు. కియారా అడ్వాణీ కథానాయిక. ఆగస్టులో విడుదలైన మూవీ బాక్సాఫీస్ వద్ద మాత్రం ఆశించిన విజయాన్ని అందుకోలేక పోయింది. ఇక ఓటీటీలో వస్తే చూద్దామని ఎదురు చూస్తున్న ప్రేక్షకులకు ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ శుభవార్త చెప్పింది. అక్టోబరు 9నుంచి హిందీ, తెలుగు, తమిళ భాషల్లో స్ట్రీమింగ్ కానున్నట్టు తెలిపింది. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లు వసూలు చేసినట్టు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి.



**ఇంతకీ కథేంటంటే..**

రా మాజీ ఏజెంట్ కబీర్ (హృతిక్ రోషన్) దేశం దృష్టిలో ఓ ద్రోహి. రా విభాగానికి చీఫ్ అయిన కల్నల్ సునీల్ లూథ్రా (అశుతోష్ రాణా)కి ఒకప్పుడు నమ్మిన బంటు. అలాంటి కబీర్ రా కళ్లుగప్పి అజ్ఞాతంలో గడుపు తుంటాడు. ఓ కాంట్రాక్టులో భాగంగా జపాన్‌లో అత్యంత శక్తిమంతమైన ఓ వ్యక్తిని అంతం చేస్తాడు. ఆ తర్వాత అతనిపై కలి కార్టెల్ అనే ఓ అజ్ఞాతమైన అసాంఘిక శక్తి కన్నేస్తుంది. కబీర్‌ని తన కార్టెల్లో భాగం చేసుకుని భారత దేశాన్ని గుప్పెట్లోకి తీసుకోవాలనేది కలి పన్నాగం. ఆ కార్టెల్ మొదట కబీర్‌కి ఓ టాస్క్ అప్పజెబుతుంది. తనకి గాడ్‌ఫాదర్‌లాంటి సునీల్ లూథ్రాని అంతం చేయాలనేదే ఆ టాస్క్. చెప్పినట్టే ఆ పనిని పూర్తి చేస్తాడు కబీర్. దాంతో కబీర్‌ని ఎలాగైనా పట్టుకోవాలని రా కొత్త చీఫ్ విక్రాంత్ కౌల్(అనిల్ కపూర్), భారత ప్రభుత్వం సోల్జర్ విక్రమ్ చలపతి (ఎన్టీఆర్) నేతృత్వంలో ఓ బృందాన్ని రంగంలోకి దింపుతుంది. ఆ బృందంలో లూథ్రా కూతురు వింగ్ కమాండర్ కావ్య లూథ్రా (కియారా అద్వాణీ) కూడా ఒకరు. మరి కబీర్ కోసం విక్రమ్ బృందం మొదలు పెట్టిన వేట ఎలా సాగింది? కబీర్ దేశద్రోహిగా ఎందుకు మారాడు? అతనికీ, కావ్యకీ ఉన్న సంబంధమేమిటి? కబీర్... లూథ్రాని చంపడం వెనక ఇతర కారణాలేమైనా ఉన్నాయా? కబీర్‌కు విక్రమ్ ఎవరో తెలిశాక ఏం చేశాడు? కలి కార్టెల్ వెనకున్న అజ్ఞాత శక్తులు ఎవరు? అన్నది చిత్ర కథ!

# తుంబాడ్ సీక్వెల్లో కంగన?

భారతీయ సినిమానుంచి వచ్చిన బెస్ట్ హారర్ చిత్రాల్లో మరాఠీ చిత్రం "తుంబాడ్" ఆల్ టైం టాప్‌లో ఉంటుందని చెప్పడంలో ఎలాంటి ఆశ్చర్యం లేదు. టెక్నికల్‌గాగాని కంటెంట్‌పరంగా కానీ పీక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చిన చిత్రానికి ఇప్పుడు సీక్వెల్ వస్తుండడంతో దీనిపై పాన్ ఇండియా లెవెల్లో మంచి అంచనాలున్నాయి. దర్శకుడు అనీల్ రాహి బర్వె తెరకెక్కిస్తున్న ఈ హారర్ చిత్రంపై కొన్ని రోజులునుంచి ఓ ఇంట్రెస్టింగ్ రూమర్ వైరల్‌గా వినిపిస్తుంది. దీని ప్రకారం సినిమాలో ప్రభాస్ ఏక్ నిరంజన్ బ్యూటీ కంగన రనౌత్ నటించనున్నట్టుగా తెలుస్తుంది. 2026లో స్టార్ట్ కానున్న సినిమాలో ఆమె కూడా జాయిన్ అవుతుందని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. మరి ఇందులో ఎంతవరకు నిజం ఉందనేది వేచి చూడాలి.

# డిసెంబర్ 5న
# వా వాథియర్

కోలీవుడ్ టాలెంట్ హీరో కార్తీకి మన తెలుగు ఆడియెన్స్ లోనూ మంచిఆదరణ ఉన్న సంగతి తెలిసిందే.మరి తాను హీరోగా ఉప్పెన బ్యూటీ కృతిశెట్టి హీరోయిన్‌గా దర్శకుడు నలన్ కుమారస్వామి తెరకెక్కిస్తున్న చిత్రమే "వా వాథియర్". మంచి బజ్‌వున్న చిత్రంవిడుదలకు మేకర్స్ ఇదివరకే దీపావళిని లాక్ చేశారు. అయితే ఈ సినిమా పనులు అనుకున్న విధంగా పూర్తి కాకపోయేసరికి.. దీపావళి రేస్ నుంచి తప్పించినట్టు అఫీషియల్‌గా కొత్త డేట్‌ని ఇచ్చేసారు. దీనితో ఈసినిమా ఈ ఏడాది డిసెంబర్ కి వాయిదా పడింది. డిసెంబర్ 5న సినిమాను ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేస్తున్నట్టుగా కొత్త పోస్టర్‌తో రివీల్ చేశారు. ఈ సినిమా తెలుగు రిలీజ్ మాత్రం ఉంటుందా? లేదా? అనేది ఇంకా ప్రశ్నగానే ఉంది. ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తుండగా స్టూడియో గ్రీన్ నిర్మిస్తోంది.

